
ఓం భూర్భువః స్వః తత్సవితుర్వరేణ్యం భర్గోదేవస్య ధీమహి ధియోయోనః ప్రచోదయాత్



# యుగశక్తి గాయత్రి





ఓం వందే భగవతీం దేవీం శ్రీరామంచ జగద్గురుం
పాదపద్మే తయోః శ్రిత్వా ప్రణమామి ముహుర్ముహుః

ప్రఖర ప్రజ్ఞ　మాతృ దేవోభవ ! పితృ దేవోభవ ! ఆచార్య దేవోభవ ! అతిథి దేవోభవ !　సజల శ్రద్ధ

సంకల్పం - సంరక్షణ
వేదమూర్తి, తపోనిష్ఠ, పండిత
**శ్రీరామ శర్మ ఆచార్య**
శక్తి స్వరూపిణి
**మాతా భగవతీ దేవి శర్మ**

ప్రధాన సంపాదకులు
**డా॥ ప్రణవ్‌పండ్యా**
సంపాదకులు
**బి.సి.హెచ్.వి. సుబ్బారావు (అశ్విని)**
ఉప సంపాదకులు
**ముక్కామల రత్నాకర్**
సంపాదక మండలి
సాధన నరసింహాచార్య
శ్రీమతి లక్ష్మీరాజగోపాల్
డి.వి.ఆర్. మూర్తి

**సంపుటి 22 - సంచిక 1**
**జూన్ 2017**

పత్రిక అందనివారు మరియు పత్రికకు సూచనలు, సలహాలు ఇవ్వదలచినవారు ఈ క్రింది ఫోన్ నంబర్లలో సంప్రదించగలరు
**040-23700722**
**94407 69798**

## సత్యయుగానికి అధిదేవత గాయత్రి

**'సయత్ కృత్స్నా గాయత్రీ మన్వాహ తత్ కృత్స్నం ప్రాణం దధాతి'** అని శతపథబ్రాహ్మణం చెపుతోంది. అనగా సమిష్టిగతము, వ్యక్తిగతము అయిన జగత్తులో వ్యవస్థను ఏర్పరచేది, సమన్వయాన్ని నిర్మాణం చేసేది గాయత్రి.

ఈ ఋషి వాక్కు విశ్వమంతట అక్షరాల అమలు జరిగే తరుణం ఆసన్నం అయింది. వాస్తవానికి నవసమాజ నిర్మాణానికి, వికాసానికి అత్యావశ్యకములైన సద్గుణాలను, సత్ ప్రవృత్తులను, సత్ విధానాలను సూత్రబద్ధం చేస్తే, ఆ దివ్య సూత్రమే మూడు చరణముల గాయత్రీ మహామంత్రం. సమస్త మానవాళికి ఆధ్యాత్మికమైన మూలాధారాన్ని ప్రసాదించే మహత్తర తత్త్వాలన్నీ ఆ మంత్రంలో ఇమిడి ఉన్నాయి.

నేడు అవివేకం అనే మహారాక్షసుడు మానవజీవనంలోని ప్రతి రంగాన్ని ఏలుతున్నాడు. ఫలితంగా మానవజాతి అనైతికం అయిపోతోంది. అనాగరికం అయిపోతోంది. మనిషి ఆలోచనలలో సత్ వివేకాన్ని ప్రతిష్ఠిస్తే తప్ప - మానవాళికి పురోగమనం గగన కుసుమమే అవుతుంది. గాయత్రీ ఉపాసన అంటే సత్ వివేక ఉపాసన, సత్ జ్ఞాన ఉపాసన, ప్రతి జీవన రంగాన్నీ ఆరోగ్యప్రదంగా, సమర్థవంతంగా, వివేకవంతంగా తీర్చిదిద్దే వెలుగుల వెల్లువను ఉపాసకుని అంతఃకరణలో ఉప్పొంగజేసే దివ్యమంత్రం గాయత్రి.

కనుకనే మన మహర్షులు, మహా మనీషులు గాయత్రీ మంత్రాన్ని ఏకగ్రీవంగా ప్రస్తుతించారు. అవతారపురుషులందరూ భగవతి గాయత్రిని ఇష్టదేవిగా కొలిచారు.

ఈవిధంగా ప్రాచీనకాలం నుండి భారతీయ సంస్కృతికి ఊపిరిగా విలసిల్లింది గాయత్రి. వేదమాతగా, దేవమాతగా, విశ్వమాతగా లోకోత్తర భూమికను నిర్వహించింది గాయత్రి. ఈ బీజమంత్రం నవయుగంలో విశ్వసంస్కృతికి మూలాధారం అవుతుంది. నవయుగానికి కల్ప వృక్షం అవుతుంది. ఈ మంత్రంలో అంతర్గతంగా ఉన్న జ్ఞానవిజ్ఞానాలు ఆధారంగా వ్యక్తిలో ఉత్కృష్టత, సమాజంలో సువ్యవస్థ తిరిగి స్థాపించబడతాయి. నవయుగంలో విశ్వమంతా సమత-మమత-శుచితల త్రివేణిలో స్నానం చేసి పునీతం కావలసి ఉంది. ఆత్మవత్ సర్వ భూతేషు, వసుధైవ కుటుంబకం - అనే సార్వజనీన, సార్వకాలిక సూత్రాలను మానవాళి తన దైనందిన జీవితంలో ప్రతిబింబించవలసి ఉంది. ఇందుకు కావలసిన సిద్ధాంతపరమయిన, వ్యవహారపరమయిన సత్యాలన్నీ గాయత్రీ మహామంత్రంలో బీజరూపంలో ఉన్నాయి.

అందువల్ల - సత్యయుగ అవతరణకు దారిచూపే దివ్యజ్యోతి గాయత్రి. యుగశక్తి గాయత్రి. మహాకాలుని సంకల్పం ఇది. తిరుగులేని సంకల్పం ఇది.

# విషయసూచిక


1. **సంపాదకీయం:** సత్యయుగానికి అధి దేవత గాయత్రి 3
2. **విషయసూచిక** 4
3. **యుగనిర్మాణ చిత్రావళి-27:** 5 మానత్వంపై దానవ ఆక్రమణ
4. **గాయత్రీ జయంతి ప్రత్యేకం:** ప్రపంచాన్నంతా గాయత్రిమయం చేద్దాం రండి 6
5. **పరమపూజ్య గురుదేవుల సుదీర్ఘయాత్ర-60:** సుదర్శనధారి శ్రీకృష్ణుడు 10
6. **గాయత్రీ జయంతి ప్రత్యేకం:** జ్ఞానగంగ-పరమ పావన భాగీరథీ అవతరణ మహాపర్వం 13
7. **కబీరుదాస్ జయంతి ప్రత్యేకం:** ఆచరణలో ఆధ్యాత్మికత : కబీరు జీవన వేదం 15
8. **21వ శతాబ్ది-ఉజ్జ్వల భవిష్యత్తు - 7:** ధర్మగ్రంథాలలో వర్ణింపబడిన భవిష్యత్కథనాలు 19
9. **సమయదానమే యుగధర్మము-6:** ప్రభావితం చేయగల సామర్థ్యం 22
10. **అశ్వమేధ యజ్ఞం - దేవ సంస్కృతి దిగ్విజయ యాత్ర-4:** పశుబంధ యజ్ఞములు 24
11. **మాతా భగవతీదేవిశర్మ దివ్యచరిత్ర-3:** బాల్యలీలలు 28
12. **అంతర్యాత్ర - 6 :** చాలా అద్భుతమైనవి మనస్సు యొక్క ఐదు వృత్తులు 32
13. **గాయత్రీ జయంతి ప్రత్యేకం:** విస్తరించు దశదిశలా గాయత్రీ వెలుగు 34
14. **గాయత్రీ జయంతి ప్రత్యేకం:** గాయత్రీ-గంగల మహత్తు 39
15. **పూజ్య గురుదేవుల అమృతవాణి:** ఆధ్యాత్మిక యొక్క అసలైన సంపదలు-1 41
16. **నా వారితో నా మాట:** తొమ్మిది సంవత్సరాల మాతృశక్తి శ్రద్ధాంజలి నవసృజన మహాపురశ్చరణ 44
17. **అశ్వమేధ మహాయజ్ఞం-జనవరి 2018** (కౌంట్‌డౌన్-7) 47
18. **అశ్వమేధ గాయత్రీ మహాయజ్ఞం-జనవరి 2018 శక్తి కలశపూజనం** 48
19. **వార్తలు:** ఉభయ తెలుగు రాష్ట్రాలలో జరిగిన వివిధ కార్యక్రమాలు 50



## యుగశక్తి గాయత్రి

**విడి ప్రతి రూ॥ 15/-** **సం॥ చందా రూ॥ 150/-**
**3 సం॥ చందా రూ॥ 420/-** **10 సం॥ చందా రూ॥ 1300/-**

చందా రుసుమును ఎట్ పార్ చెక్ ద్వారా (at par cheque) లేక డి.డి.ద్వారా కాని పంపగలరు. యం.ఒ. ద్వారా కూడా పైకం పంపించవచ్చు. కానీ యం.ఒ. ద్వారా వచ్చినప్పుడు పూర్తి అడ్రస్సు ఉండుట లేదు. అందువలన యం.ఒ. ద్వారా పైకం పంపినప్పుడు క్రింద ఇచ్చిన ఫోన్ నంబర్లను సంప్రదించి మీ వివరాలు అన్నీ ఇవ్వ ప్రార్థన. రూ. 5,000 లేక అంతకన్నా ఎక్కువ పంపదలచుకున్నప్పుడు ఆన్‌లైన్ ద్వారా పంపవచ్చును. దీనికన్నా తక్కువ పంపే వారు, రూ. 50/- అదనంగా చేర్చి పంపాలి.

ఖాతాపేరు: **శ్రీ వేదమాత గాయత్రీ ట్రస్టు**
బ్యాంకు పేరు: **స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా**
**ఎర్రగడ్డ శాఖ, హైదరాబాద్**
ఖాతా నెం.: **32506416087**
IFSC Code: **SBIN-0013272**

ఆన్‌లైన్‌లో పంపినప్పుడు బ్యాంక్ చలానా జిరాక్సు కాపీని మీ చిరునామా తెలుపుతూ తప్పక మాకు పంపించాలి.

**"శ్రీ వేదమాత గాయత్రీ ట్రస్టు"**
**గాయత్రీ చేతనా కేంద్రము,** హెచ్.పి. రోడ్, మూసాపేట
అశ్విని హౌస్ దగ్గర, హైదరాబాదు - 500 018.
ఫోన్: 040-23700722, సెల్: 9949111175


## పండుగలు

**జూన్ 2017**

| | |
|---|---|
| 04-06-2017 | గాయత్రీ జయంతి |
| 21-06-2017 | ప్రపంచ యోగా దినోత్సవము |
| 25-06-2017 | పూరి జగన్నాథస్వామి రథోత్సవము |

**జులై 2017**

| | |
|---|---|
| 09-07-2017 | గురుపూర్ణిమ |
| 30-07-2017 | సంత్ తులసీదాస్ జయంతి |

**గాయత్రీ మంత్రం అపౌరుషేయం**

యుగనిర్మాణ చిత్రావళి-27

# మానవత్వంపై దానవ ఆక్రమణ



మానవత్వానికి సముచిత స్థానం, సన్మానం ఈ ప్రపంచంలో లభించాలి. మానవీయ సద్గుణాలే గొప్పవని గుర్తించాలి. అలాంటి సద్గుణములు ఉన్న వ్యక్తులకు గౌరవము, గుర్తింపు లభించాలి. ఈ గుర్తింపు ఉన్నంత వరకు ప్రపంచంలో సజ్జనత్వము, సద్భావనలు పెంపొందుతాయి, సుఖ శాంతులు వర్షిస్తూనే ఉంటాయి. సత్ప్ర వృత్తులకు లేమి ఉండదు, కష్టములకు కలహములకు కారణములు ఉండవు. కానీ మానవత్వస్థాయి పడిపోయి నప్పుడు, సజ్జనత్వాన్ని తిరస్కరించి నప్పుడు, శ్రేష్ఠమైన సద్గుణములు అపహాస్యం పాలైనప్పుడు నిస్సం దేహముగా దుఃఖదారిద్ర్యముల సంఘటనలు పెచ్చు మీరుతాయి. సర్వత్ర శోకసంతాప వాతావరణం తయారవుతుంది.

దౌర్భాగ్యవశమున ఈ రోజున అసురత్వానికి గౌరవం, సన్మానం లభిస్తున్నాయి. దుష్ప్రవృత్తులు సఫలత్వానికి ఆధార మయ్యాయి. ఇది అనేక దుష్పరిణామాలకు దారితీస్తున్నాయి. అసురత్వం ద్వారా ముందుకు వెళ్ళి సఫలత్వాన్ని పొందే వారికి ప్రశంస, ప్రతిష్ఠ లభిస్తే ఎలా? ఇలాంటివారిని ఎదిరించటంపోయి, వారికి సహకారం ఇస్తుంటే, అందరికీ ఈ మార్గంలో పోయి తేలికగా సఫలత్వం పొందుదామనే ఉంటుంది. ఇలాంటి ప్రవృత్తిగలవారు పరస్పర సహకారము, సహాయము అందించుకుంటారు. సఫలత్వాన్ని సాధించు కుంటారు, సన్మానాన్ని పొందుతారు. ఇలాంటప్పుడు అసురత్వానికి ప్రామాణికత లభిస్తుంది, మనుష్యులు ఎలాంటి సంకోచం లేకుండా ఈ మార్గంలో వెళ్ళడానికి ప్రోత్సాహం లభిస్తుంది.

ఈరోజులలో అలాంటి వాతావరణం తయారయింది. అసురత మానవత్వంపై ఆక్రమణ చేయడమే కాదు, పదచ్యుతి చేయడంలో కూడా సఫలమవుతున్నది. తమ లెక్కకు మించిన అనుయాయుల బలమైన అసురత ఏ దిశలోనైనా ముందుకు వెళ్ళగలదు. ఏ క్షేత్రంలోనైనా విజయ దుందుభి మ్రోగించగలదు. అలాంటి దుష్టులు కలసి, ఒకరికొకరు సహాయ సహకారములను అందించుకుని, సజ్జనులపై అభాండాలు వేసి, వారిని చెడ్డవారిగా చూపించి దండనలకు పాత్రులుగా చేస్తున్నారు. ఎటువంటి దయనీయ స్థితి ఇది? ఇలాంటి క్రమము నడుస్తుంటే మంచివాడిగా ఉండటానికి, మంచితనాన్ని సమర్ధించడానికి భయం వేస్తుంది, అసురత్వాన్ని ఎదిరించడానికి ధైర్యం చాలదు.

ఇలాంటి భయంకర పరిణామాలను ఎదుర్కొనడానికి ఒకే ఒక ఉపాయం ఉన్నది. సజ్జనులందరు కలవాలి, సత్ప్రవృత్తులను పెంపొందించడానికి అధికాధిక సాహసం పురుషార్థం త్యాగ బలిదానాలను చూపించాలి. అసురతకు సహాయం చేయకూడదు. వీలయితే దానిని ఎదిరించడానికి అడుగు ముందుకు వెయ్యాలి.

ఈ సజ్జనుల సంఘబద్ధత, సాహసముల ఆధారంపైనే దుష్టత్వాన్ని, అవినీతిని ఎదిరించగలగడం సాధ్యమవుతుంది. రాక్షసత్వం సజ్జనత్వాన్ని, మానవత్వాన్ని పదవీచ్యుతుని చేయకుండా ప్రతివారు తమ కర్తవ్యాన్ని నిర్ధారించుకోవాలి. సాహసాన్ని చూపించాలి.

*- అనువాదం : ముక్కామల రత్నాకర్*

**గాయత్రీ మంత్రం - ఆది మంత్రం**



గాయత్రీ జయంతి ప్రత్యేకం

# ప్రపంచాన్నంతా గాయత్రిమయం చేద్దాం రండి

జూన్ నాలుగో తారీఖున మనం గాయత్రి జయంతి జరుపుకుంటున్నాం. గాయత్రీ తత్వాన్ని దర్శించిన యుగద్రష్ట, యుగఋషి పరమపూజ్య గురుదేవులు మన యుగానికి గాయత్రి అనే వరాన్ని ఇచ్చారు. గాయత్రీ మంత్ర సాధన, దాని తత్త్వచింతన, అందులో నిహితమైన జీవనదృష్టి మనందరి జీవిత రూపురేఖలనే మార్చివేస్తుంది. శ్రద్ధ పేరిట పాతుకుపోయిన మూఢాచారాలను కూకటి వేళ్ళతో పెకిలించాలి. వాటిస్థానంలో ప్రకాశవంతమైన ధారణలు, సదాలోచనలు, సత్కర్మలు మరియు సద్భావనలు, సంవేదనలను నెలకొల్పాలి. ఈ పని మహాశక్తి గాయత్రి ద్వారానే సంభవం. ఆ గాయత్రి ఇప్పుడు యుగశక్తి రూపంలో విస్తరిస్తూనే ఉన్నది.

కలియుగానికి ముందు యుగాలలో అవతారాలు వ్యక్తమయ్యాయి. కానీ నేడు అసురశక్తి అవ్యక్తంగా ఉన్నది. అది మన మనసులలో, మన నమ్మకాలలో తిష్ట వేసుకుని కూర్చుంది. అందుకే ఇప్పుడు మనిషి అంతరాళాల్లోకి చొచ్చుకుపోగల ప్రకాశవంతమైన, తేజోమయమైన ప్రచండ మహాశక్తి అవసరం. యుగశక్తి గాయత్రిలో మాత్రమే ఈ సామర్థ్యం ఉంది. ఆ శక్తి ఆవిర్భావాన్ని, అవతరణనే ఈ యుగంలో జరిగిన అత్యంత అలౌకిక సంఘటన అని అర్థం చేసుకోవాలి. ఆదిశక్తి యుగశక్తిగా దర్శనం ఇవ్వడం ఒక ఎత్తు, అది సక్రియంగా మారి యుగాన్ని పూర్తిగా ఆవరించడం మరో ఎత్తు. ఆదిశక్తి యుగశక్తిగా అవతరించిన ప్రతీ సారి దేవతలు అందరూ సహాయం చేశారు. ఆ దేవాంశులతో సంపన్నమైనదే మన గాయత్రి పరివారం. సువిశాలమైన గాయత్రి పరివారం లోని అందరినీ గురుదేవులు తమ తపశ్శక్తితో దేవాంశతో సంపన్నం చేశారు.

గాయత్రీ పరిజనులే దేవాత్మల రూపంలో మహాశక్తి గాయత్రిని విస్తరింపజేయాలి. నేటి మాయావి అసురశక్తిని ఎలా ఎదుర్కోవాలి అనేది తెలియాలి. మన బుద్ధి దిగ్భ్రాంతి చెందినంత సేపు, వివేకం గందరగోళంలో ఉన్నంత సేపు మాటిమాటికీ మార్గదర్శం చేయవలసిన అవసరం ఉంటూనే ఉంటుంది. గురుదేవుల పరాచైతన్యం ఈ మధ్యకాలంలో ఈ పనే చేస్తున్నది. వారి అనవరత తపోసాధన, నిరంతర సంరక్షణ వల్లనే గాయత్రీ సాధన దినాదినాభివృద్ధి చెందుతున్నది.

ఇంత వరకు చాలా సాధించాము. కానీ సాధించవలసింది ఇంకా చాలా ఉంది. మన దేశ జనాభా 125 కోట్లు దాటుతోంది. ప్రపంచం ఇంతకన్నా చాలా పెద్దది. ఇప్పటి వరకు మనం చేసినదానితో ప్రపంచమంతా మారుతుందని ఎలా ఆశించ గలం? ఇంకా మన దేశమే మొత్తం గాయత్రీ మయం కాలేదు. మొత్తం ప్రపంచాన్నంతా గాయత్రి ఆవరించాలన్నది మన లక్ష్యం.

వాతావరణమంతా గాయత్రీమయం చేయకతప్పదు. రాముడు రావణుడిని మహాసమరంలో, శ్రీకృష్ణుడు మహా భారతం ద్వారా బుద్ధ భగవానుడు ధర్మచక్ర ప్రవర్తన కార్యంలో – ఏవో కొన్ని సంఘటనల్లోనే కాక, మొత్తం ప్రజల చైతన్యాన్ని మార్చారు, వాతావరణాన్ని ప్రభావితం చేశారు. అదేవిధంగా గాయత్రి చింతన, ధారణల ద్వారా ఆలోచనా సరళి, శ్రద్ధ, సంస్కారాలను ప్రభావితం చేస్తేనే యుగశక్తి ప్రేరణలు నలుదిక్కులా వ్యాపిస్తాయి. వాటితో తరతరాల వరకు శాంతి, ప్రసన్నత, సహకారం, ధర్మపరాయణత, సదాచారాల సుగంధం నిలిచి ఉంటుంది, వృద్ధి చెందుతుంది.

వాతావరణం ఎంతటి గొప్పదో, మహిమాన్వితమైనదో తెలియనిది ఎవరికి! దేవదారు వంటి వృక్షాలు హిమాచ్ఛాదిత క్షేత్రాల్లోనే పెరుగుతాయి. ధాన్యం పంటలకి లక్షల లీటర్ల నీరు కావాలి. వాతావరణంలోని సూక్ష్మ మరియు స్థూల ప్రకృతి, దానిలో నాటిన బీజాలలో అనుకూలమైనవాటిని పోషిస్తుంది, పెంచుతుంది. బీజాల ప్రవృత్తి వాతావరణానికి అనుకూలంగా లేకపోతే వాటి వికాసానికి దోహదపడదు. మన దేశమే కాదు, మానవజాతి మొత్తం ఉత్కృష్ట జీవన మూల్యాల పట్ల సంవేదనతో, సదాశయత పట్ల నమ్మకంతో ఉండాలంటే వాతావరణాన్ని అందుకు తగ్గట్టు గౌరవప్రదంగా

**గాయత్రి జ్ఞానాన్ని ప్రసాదించే వేదమాత**

మార్చాలి. అప్పుడు యుగం మొత్తం వివేకంతో, సద్గుణాలతో, సదాచారాలతో మెలుగుతుంది.

వాతావరణ ప్రభావం కేవలం మొక్కల మీద, చెట్ల మీద మాత్రమే ఉండదు. ఏదైనా ప్రదేశానికి వెళ్ళినప్పుడు, మనకు తెలిసిగానీ, తెలియకగానీ, మన ప్రమేయం లేకుండానే భయభ్రాంతులమవుతాం. ఒక్కో చోట మనకి తెలియకుండానే ప్రసన్నంగా అనిపిస్తుంది. మనుష్యులే కాదు, జంతువులు కూడా కసాయికీ, రైతుకీ తేడా కనిపెట్ట గలవు. వాతావరణాన్ని బట్టి ప్రతిక్రియ కూడా మారుతుంది.

స్వాతంత్ర ఉద్యమం జరుగుతున్న రోజులవి. అరవిందుల వారిని అలీపుర్ జైల్లో చీకటిగదిలో చాలా రోజులు ఉంచారు. అక్కడ ఉన్నన్ని రోజులు ఆయన తపోసాధనలో, యోగసాధనలో గడిపారు. ప్రతి క్షణం ఆయన ఆత్మచింతన, దైవచింతనలోనే గడిపారు. వారిని విడుదల చేశాక అదే గదిలో ఒక బందిపోటు దొంగను ఉంచారు. ఆ దొంగ ఎప్పుడూ కోపంతో, అశాంతిగా, పిచ్చిపట్టినట్టు ఉండేవాడు. ఏదో ఒక ఉపద్రవం లేవనెత్తడం అతని అలవాటు. కానీ ఈ చీకటిగదిలోకి వచ్చినప్పటి నుండి అతను చాలా ప్రశాంతంగా ఉన్నాడు. అతని స్వభావం ఆశ్చర్య కరంగా మారిపోయింది. జైలు అధికారులు ఈ మార్పుకి కారణాలు వెతికితే, అది ఆ చీకటిగది వాతావరణ ప్రభావం అని అర్థమైంది.

హిమాలయాల దుర్గమ క్షేత్రాలలో నేటికీ ఇటువంటి దివ్య వాతావరణ ప్రభావం ఉన్నది. దీనికి కారణం ఏమిటంటే, యుగయుగాల నుండి హిమాలయాలు దేశానికి, ప్రపంచానికి తపోభూమి కావడం. మహామహా తపస్వులు ఇక్కడే దీర్ఘకాల తపశ్చర్యలు, సాధనలు చేశారు. అక్కడి సంచిత సంస్కారాల వల్లనే ఆ చోటులో అడుగుపెట్టినవారిలో అనాయాసంగా భక్తి శ్రద్ధలు పొంగిపొరలుతాయి. వారి చైతన్యం పురోగమిస్తుంది. ఆ క్షేత్రం చుట్టుపక్కల ఉన్న గ్రామవాసులు మిగిలిన వారి కన్నా ఎక్కువ నిజాయితీపరులు.

వాతావరణ ప్రభావం వ్యాపకమైనది. దాని వల్ల స్థూల కార్యకలాపాలు మాత్రమే కాక సూక్ష్మసంస్కారాలు, ఆలోచనలు, భావనలు కూడా ప్రభావితమవుతాయి, వికసిస్తాయి. ఇప్పుడు వైజ్ఞానికులు కూడా తమ పరిశోధనలతో ఈ విషయాలను తేల్చి చెప్తున్నారు. ప్రఖ్యాత వైజ్ఞానికుడు డా. ఆస్కర్ బ్రోన్లర్ తమ పరిశోధనా పత్రం, 'బ్రెయిన్ రేడియేషన్' లో ఈ విషయమై చాలా వివరంగా వ్రాశారు. ఏదైనా క్షేత్రంలోని ప్రజలలో ఒకే రకమైన ఆలోచనలలో గట్టి నమ్మకం ఉంటే, వారి మెదడు నుండి వెలువడే ఘన తరంగాలు అక్కడ వ్యాపించి, చాలా కాలం వరకు అక్కడే స్థిరంగా ఉంటాయి. రష్యా వైజ్ఞానికులు ఒక ప్రత్యేకమైన కెమెరాను రూపొందించారు. ఎక్కడైనా ఏదైనా నేరం చేసి పారిపోయిన అపరాధి శరీరం నుండి వెలువడ్డ శక్తి తరంగాల ఆధారంగా అతని వాస్తవిక స్వరూపాన్ని ఆ కెమెరా చిత్రీకరించగలదు. ఆ సమయంలో అతని మానసిక స్థితిని అధ్యయనం చేయగల యంత్రాన్ని కూడా కనుక్కునే పనిలో ఉన్నారు. దాని వల్ల నేరస్తుడి ఆలోచనలు, అతని ప్రణాళికలు కూడా తెలుసుకునే అవకాశం ఉంటుంది.

శక్తివంతమైన ఆత్మశక్తితో, సాధనలతో వాతావరణాన్ని గనక నింపేస్తే చాలా కాలం వరకు అక్కడి ప్రజలను ప్రభావితం చేసే పరిస్థితులు ఏర్పడతాయని కూడా పరిశోధనల్లో తేలింది. ఈ రోజుల్లో బాగా ఎక్కువైపోయిన అవినీతి, తృష్ణ, లిప్స, నేరప్రవృత్తి, హీనచరిత్ర, క్షుద్ర అహంకారాల విషాన్ని కడగాలంటే విస్తారంగా గాయత్రి మరియు యజ్ఞాల క్రాంతిని లేవనెత్తాలి. ఈ యుగంలో మనమందరం కలిసి చేయవలసిన ఈ పనే యగశక్తి యొక్క ముఖ్య ఉద్దేశం.

సామూహిక ఉపాసన, సాధన, ప్రార్థన, అనుష్ఠానాల వెనుక కూడా ఆశయం ఇదే. ఒంటరిగా చేసే సాధన మనిషిని బాహ్యంగా, ఆంతరికంగా ప్రభావితం చేస్తుంది. మహాఅయితే కుటుంబసభ్యులు, చుట్టుపక్కలవారు కూడా ప్రభావితులు అవుతారు. కానీ సామూహికంగా మార్గదర్శనం అవసర మైనపుడు, ప్రేరణలు ఆవరించాలి అన్నప్పుడు సామూహిక సాధన చేయక తప్పదు.

గాయత్రీ మంత్రంలో ఉచ్చరించబడే, 'యోనః' పదానికి అర్థం కూడా, 'నన్ను కాదు, మమ్మల్ని.' అంటే అర్థం, వ్యక్తిగత గాయత్రీ సాధన కన్నా, సామూహిక సాధన చాలా మహిమా న్వితమైనది. సామూహిక గాయత్రీ అనుష్ఠానంలో వాతావరణాన్ని అనుకున్న దిశలో మార్చగలిగే శక్తి ఉంది. ప్రత్యేకమైన వాతావరణంలో మనుషులు తయారవడానికి, మారడానికి కారణం ఇదే.

**గాయత్రి దేవత్వాన్ని ప్రదానం చేసే దేవమాత**

దీనికి సంబంధించిన మరో సత్యం ఉంది. మనిషి తన సాధనా సామర్థ్యంతో వాతావరణాన్ని రూపొందించగలడు, మార్చగలడు. దానితో చాలా కాలం ప్రవహించే సంస్కారాలు, ఆలోచనల విలక్షణ శక్తి బ్రహ్మాండంలోంచి పరిగెత్తుకుంటూ వచ్చి వాతావరణాన్ని కప్పేస్తుంది. గాయత్రీ ఉపాసనలో, 'అసతోమా సద్గమయ, తమసోమా జ్యోతిర్గమయ, మృత్యోర్మా అమృతంగమయ!' అనేది కేవలం ప్రేరణ కాదు, దానిని సాకారం, సాక్షాత్కారం చేయగల సామర్థ్యం కూడా ఉంది. ఒంటరి సాధనతో కేవలం ఆ వ్యక్తిత్వము మాత్రమే చక్కదిద్దబడు తుంది. కానీ సామూహిక సాధనతో సమాజం, దేశం, ప్రపంచం మొత్తం ప్రభావితమవుతాయి, ప్రకాశవంతమవుతాయి. కచ్చితంగా సామూహిక సాధనలు సంపూర్ణ వాతావరణాన్ని కుదిపేయగల సామర్థ్యం కలిగి ఉంటాయి.

యుగ పరివర్తన కోసం, దుష్టత్వం, అసురత్వం, అధర్మం, ఆడంబరాలతో పోరాడగల ఏకైక యుగశక్తి గాయత్రి సాధనను అందరికీ పరిచయం చేయాలి. అందుకే గురువుగారు గాయత్రీ సాధన అనే పాఠాన్ని చదివారు, చదివించారు. యుగపరివర్తన కార్యక్రమానికి గాయత్రీ తత్వజ్ఞానాన్ని ఆధారం చేసుకున్నారు.

ఈ ఉద్దేశం కోసం మనందరం కలిసి చాలా అడుగులు వేశాం. కానీ ఇప్పుడు దీన్ని విశ్వవ్యాప్తం చేయాల్సిన సమయం వచ్చింది. దీని వల్ల నెలకొనే వాతావరణం మానవజాతి అంతః కరణాల్లోని అజ్ఞానాన్ని, అంధకారాన్ని చీల్చి చెండాడుతుంది. అజ్ఞాన అంధకారాలు ఉన్నంత వరకు మానవ సంవేదనలకు మార్గం స్థిరపడదు. అందుకే యుగపరివర్తనకు ఆధార భూమికగా దీన్ని వ్యాపింపజేయాలి.

గాయత్రీ మంత్రం పైకి చూడడానికి మిగిలిన మంత్ర సాధనలు, సామాన్య విధానాల వలె కనిపిస్తుంది. కానీ ఇందు లోని 24 అక్షరాలు, బ్రహ్మాండాన్ని కుదిపేయగల 24 మర్మ స్థలాలు, బీజాలు, శక్తికేంద్రాలు అన్న విషయం మంత్ర విద్య అనుభవం ఉన్నవారికి తెలుస్తుంది. ఒకప్పుడు గాయత్రీ మంత్రాన్ని ఏదో ఒక జాతికి, కులానికి మాత్రమే పరిమితం చేశారు. కానీ యుగఋషి, పరమ పూజ్య గురుదేవులు అన్ని బంధనాలనుంచి విముక్తి చేశారు.

గాయత్రి లేకపోవడం వల్ల దేశానికి చాలా చెడు జరిగింది. ఇప్పుడు మళ్ళీ దీన్ని విస్తరింపజేయాలి. ఈ యుగానికి ఈ శక్తి సంజీవనీ ఔషధం వంటిది. అందుకే గాయత్రీ అవతరణ దినోత్సవమైన గాయత్రీ జయంతి ఉత్సవాలను వైభవంగా జరుపుకోవాలి. అదే రోజున గాయత్రీ విస్తారానికి అందరం కలిసి నడుం బిగించాలి, దృఢ సంకల్పాన్ని తీసుకోవాలి.

ఒక్క సారి సామూహిక గాయత్రీ సాధనతో వాతావరణాన్ని సంస్కారవంతంగా చేసేస్తే, దేశాన్ని, ప్రపంచాన్ని కూడా ఆరోగ్య వంతమైన, సమర్థ దైవీభావనలతో నింపే ప్రక్రియ దానంతటదే మొదలవుతుంది. ఈ ప్రత్యేకమైన బాధ్యత గాయత్రీ పరిజనుల మీదే ఉన్నది. ఎందుకంటే నేటి పరిస్థితిని వివేకంతో గుర్తించ గల సామర్థ్యం మనలో ఉంది. అంధవిశ్వాసాలు, మూఢ నమ్మకాలు, గుడ్డి సాంప్రదాయలను ఎలా సంభాళించాలో అనుభవం ఉంది.

ఒక్క సారి గనక మనందరి సమ్మిళిత ప్రయత్నాలతో ఆ అద్భుత అనుభవం దేశము, ప్రపంచ మానవులు రుచి చూస్తే సర్వశక్తివంతమైన యుగశక్తి గాయత్రి మాత అనుగ్రహం, ఆశీస్సులు అందుకునే ప్రక్రియ తరతరాల వరకు కొనసాగు తుంది. మన వ్యక్తిగత, సామాజిక జీవితాలను ఆనందంగా, సమున్నతంగా, సస్యశ్యామలంగా మార్చగల తత్వాలన్నీ గాయత్రిలో ఉన్నాయి. ఈ గాయత్రిని ఇంటింటికి, మనిషి మనిషికి అందించి, ఆ మహాశక్తితో సంపర్కం ఏర్పరచాలి. ఈ గాయత్రీ జయంతినాడు మనందరం ఈ పని చేస్తామని ప్రతిజ్ఞ చేద్దాం.

ఈ పుణ్యకార్యానికి ముందడుగు వేసిన వారు గొప్ప సాధకులో, లేక గాయత్రీ జ్ఞానంలో నిష్ణాతులో అవ్వాల్సిన పని లేదు. యుగఋషి, పరమపూజ్య గురుదేవులు స్వయంగా అందుకు తగ్గ పరిస్థితులను నిర్మించారు. దీనికి కావాలసిన శిక్షణ, మార్గదర్శనం, సంరక్షణ అన్నీ శాంతికుంజ్‌లో లభిస్తాయి. గాయత్రీ ఉపాసన, దర్శనం, కర్మకాండలు, నియమాలు, ఉప నియమాలు, విధానాలు, విజ్ఞానం మొదలైన అన్ని విషయాల మీద అనేక స్థాయిలలో సాహిత్యం లభ్యమై ఉంది. గురుదేవులు రచించిన గాయత్రీ మహావిజ్ఞానం అనే పుస్తకం గాయత్రీ సాధనకు ఎన్‌సైక్లోపీడియా అనవచ్చు. అఖండజ్యోతిలో కూడా ఈ విషయాల గురించి ముద్రిస్తూనే ఉంటారు. జన జీవితాన్నీ, మనిషి వ్యక్తిత్వాన్ని గాయత్రి సంపర్కంలోకి తేవడమే తదుపరి బాధ్యత.

**గాయత్రి, వ్యవస్థను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దే విశ్వమాత**

గాయత్రిని ప్రాణోత్కర్షణ సాధన అని కూడా అంటారు. ఉపాసన వల్ల మన అంతరంగం పవిత్రమవుతుంది, క్రియాశీల మవుతుంది. దాని మీద అలుముకున్న అంధకారం, మలినాలు, అవివేకం తొలగిపోతాయి. జీవితం యొక్క యదార్ధ స్వరూపం ఈ సాధన వల్ల ప్రకటమవుతుంది. అప్పుడు మనిషి జీవించే కళను, కౌశలాన్నీ నేర్చుకుంటాడు. ఆలోచించదగ్గవే ఆలోచిస్తాడు, చేయదగ్గవి మాత్రమే చేస్తాడు. భావనల్లో పవిత్రత ఉదయిస్తే, కర్మలో కూడా శుచిత్వం వికసిస్తుంది. ఈ రెండింటినీ ఒకదానికి ఒకటి పర్యాయాలుగా కూడా అర్థం చేసుకోవచ్చు.

ప్రజల భావనలలో శుద్ధత, పవిత్రత ఉంటే, ఆ సమాజంలో అంతటా శాంతి, సువ్యవస్థ, ప్రసన్నత మరియు సంతోషాలతో కూడిన జీవనధార ప్రవహిస్తూ ఉంటుంది. అందుకే గాయత్రిని దేవమాత, వేదమాత అని కూడా అంటారు. ప్రవిత్రత, జ్ఞాన సమృద్ధి, సకారాత్మక సక్రియత నిరంతరం అభివృద్ధి అవుతూ ఉంటాయి. జీవితానికి ఆధారాలైనటువంటి సుఖం, శాంతి, సమృద్ధులను గాయత్రీ సాధన సంపూర్ణంగా, పరిపూర్ణంగా చేస్తుంది.

గాయత్రి జ్ఞాన-విజ్ఞాన పక్షాలు, దర్శన-సాధన పక్షాలు రెండూ కలిస్తే సమగ్రం మరియు సంపూర్ణమవుతాయి. ఈ రెండిటినీ ఇంటింటికీ చేర్చడానికి మనలో శక్తినంతటినీ ఒడ్డాలి. వ్యక్తి, కుటుంబం, సమాజాల వాతావరణం మారుతుంది. గాయత్రీ ఉపాసన, సాధన, ఆరాధనలతో ఈ యగ వాతావర ణాన్ని గాయత్రీ మయం చేయగలిగితే, యుగశక్తి అవతరణ మహోత్సవమైన గాయత్రీ జయంతి పర్వ ఉల్లాసం సార్థకమైనట్టే. దేశాన్ని, ప్రపంచాన్ని చిరకాలం వరకూ స్వచ్ఛంగా, ఆరోగ్య వంతంగా, సమర్థవంతంగా ఉంచగల ఊష్మ, ఊర్జ ప్రస్ఫుటించడం సంభవమవుతుంది.

గాయత్రీ జయంతి మనందరం ప్రతి సంవత్సరం జరుపు కుంటాం. ఈ సంవత్సరం, మనమంతా, మనలో ప్రతి ఒక్కరూ, మనలోని జ్ఞానాన్ని, సాధనలోని ప్రత్యేకతలనీ వినియోగించాలి. మనకి లభించిన, మనం పాటిస్తున్న గురుజ్ఞానం ఇప్పుడు అందరికీ అందించడంలో మన ప్రావీణ్యతను, కౌశలాన్ని చూపించాలి. గాయత్రీ జయంతి-యుగశక్తి అవతరించిన రోజు మాత్రమే కాదు, మహాసాధకుడు, మహాసిద్ధ యుగఋషి పూజ్య గురుదేవుల మహానిర్యాణ దినం. 2 జూన్, 1990న గాయత్రీ జయంతి నాడు, స్థూల శరీర బంధనాలను వదిలించు కుని, యుగశక్తి గాయత్రి యొక్క పరాచైతన్యంలో లీనమై పోయారు. ఇప్పుడు ఆయనకు మారు పేరు గాయత్రి, గాయత్రికి పరిచయం స్వయంగా గురువుగారే. మన గాయత్రి నిష్ఠా జీవనం ద్వారా ఆయనను, గాయత్రిని అనుభూతి చెందవచ్చు.

*- అఖండజ్యోతి, జూన్ 2017*

*అనువాదం: శ్రీమతి జయలక్ష్మి*

## గురుదేవుల విరాట్ స్వరూపం

*పరమపూజ్య గురుదేవులు ఆర్షసాహిత్యాన్ని అనువదించిన రోజుల్లో గంగోత్రి తీర్థంలోని కృష్ణానందస్వామి గారి గుహలో కొంత కాలం గడిపారు. కృష్ణానందస్వామి ఒకే రాయి మీద చాలా కాలం కూర్చునే ఉండేవారనీ, ఎవరైనా దివ్య పురుషులు వస్తే తప్ప ఆయన దిగి వచ్చేవారు కాదని చెప్పుకునేవారు. పరమపూజ్య గురుదేవులు ఆయన గుహలోకి వెళ్ళినప్పుడు, స్వామివారు ఆ రాయి దిగివచ్చి స్వాగతం పలికారట. చాలా సంవత్సరాల తరువాత వందనీయ మాతాజీ గంగోత్రి తీర్థానికి వెళ్ళడం జరిగింది. అప్పుడు మాతాజీ వెంట వెళ్ళిన శిష్యులను కృష్ణానందస్వామి గారి ఆశ్రమానికి పంపించారు.*

*కృష్ణానంద స్వామివారు అప్పటికే తమ పార్థివ శరీరాన్ని త్యజించారు. కానీ వారి ముఖ్య శిష్యులొకరు అక్కడే ఉన్నారు. ఈ శిష్యులు ఆయనతో మాట్లాడడం మొదలు పెట్టాక, ఎన్నిసార్లు పరమపూజ్య గురుదేవుల గురించి మాట్లాడితే, అన్నిసార్లు, ప్రతిసారి ఆయన నిలబడి హిమాలయాలవైపు తిరిగి నమస్కారాలు చేశారట. కారణం అడిగితే, మీకు ఆయన విరాట్ స్వరూపం గురించి ఇంకా తెలియదు కాబోలు. ఒకప్పుడు ఆయన గాయత్రీమాతను ఆరాధించారు, కాని నేడు గాయత్రీ మాత ఆయనను ధ్యానిస్తుంది. నేడు ఆయనే స్వయంగా మహాకాలుడయ్యారు.*


*అనువాదం: శ్రీమతి జయలక్ష్మి*

## గాయత్రి వేదశాస్త్రాలసారం

### పరమపూజ్య గురుదేవుల సుదీర్ఘయాత్ర-60

# సుదర్శనధారి శ్రీకృష్ణుడు

అఖండజ్యోతి పునఃముద్రణ గురించి ప్రకటించే సమయానికే మొదటి ప్రతి సిద్ధమైంది. రెండవ ప్రతికి అవసరమైన సామాగ్రి కూడా ప్రెస్‌కి పంపించేశారు. 1940 జనవరిలో ప్రచురించిన 'అఖండజ్యోతి' మొదటి కవర్‌పేజీ మీద సుదర్శనచక్రం ధరించిన శ్రీకృష్ణభగవానుని చిత్రం ముద్రించారు.



నిర్ధారించిన సమయానికి ముందే పత్రిక ప్రచురణ పూర్తయిపోయింది. వసంత పంచమికి రెండు మూడు రోజుల ముందే తాయిజీని శ్రీరామ్ ఆవల్‌ఖేడా నుండి పిలిపించారు. మాఘ శుక్ల పంచమి తెల్లవారుఝూమున ఆవిడ చేతుల మీదగానే మొదటి పత్రిక గాయత్రీమాత విగ్రహం ముందు స్థాపింపచేశారు. ఆవిడ దానికి బొట్టు పెట్టి, అక్షింతలు సమర్పించారు. సరస్వతీదేవి కూడా నమస్కరించుకున్నారు. శ్రీరామ్ ఆరతి పాడారు. ఈ విధంగా అఖండదీప ప్రకాశంలో దాని దివ్య జ్యోతి యొక్క దైవీ లోకార్పణ జరిగింది.

పోస్టులో మొదటి పత్రిక మహాత్మాగాంధీ గారికి, వారి కేంద్రం సేవాగ్రామ్‌కు పంపారు. బాబు గులాబ్‌రాయ్ మరియు కృష్ణదత్ పాలీవాల్ గార్లకు స్వయంగా ఒక్కో కాపీ అందించారు. 'కళ్యాణ్' సంపాదకులు హనుమాన్ ప్రసాద్ పొద్దార్, రామకృష్ణ మిషన్, అరవిందో ఆశ్రమం, పూరీ, కంచి శంకర మఠాలకు కూడా పోస్టు ద్వారా పంపారు. ఆ తరువాత సామాన్య వితరణ జరిగింది. ప్రతి ఒక్కరు వారి అభిప్రాయం నిష్పాక్షికంగా ఇవ్వాలని నివేదించారు. పత్రికలోని విషయాల మీద, వితరణ వ్యవస్థ మీద, ముద్రణ స్థాయి మీద, కాగితం, చిత్రాల ఎంపిక మీద కూడా పాఠకులు తమ అభిప్రాయాలను తెలియజేయాలని అడిగారు.

మొదటి సంచిక 500 ప్రతులు ముద్రించారు. అవి బైండింగ్ అయ్యే ముందే రెండవ ప్రతికి సామాగ్రి ప్రెస్‌కు పంపేశారు. సుమారు 350 ప్రతులు పోస్టు ద్వారా పంపారు. వాటిపై చిరునామాలు వ్రాసే పని శ్రీరామ్ స్వయంగా చేశారు. చేతితో రాసిన ఈ చిరునామాలను కార్బన్ పెట్టి అనేక కాపీలుగా సిద్ధం చేశారు. వాటిని చింపి పత్రిక మీద అంటించే పని సరస్వతిదేవి చేశారు. ఇంటిని, పాపాయినీ చూసుకున్నాక పత్రిక వ్యవస్థలో కూడా ఆవిడ చేదోడుగా ఉండేవారు. రెండవ ప్రతి ముద్రణ అయ్యే సమయానికి పత్రికను కాగితంలో చుట్టే పని కూడా ఆవిడే చేశారు.

మొదట కొన్ని నెలలు పత్రిక వితరణ పనులు శ్రీరామ్ స్వయంగా చూసుకున్నారు. మూడు, నాలుగు నెలల తరువాత సహాయానికి ఒక కార్యకర్తను తోడు ఉంచుకున్నారు. స్వాతంత్ర్య ఆందోళన చేసిన రోజుల నుండి అతను తోడుగానే ఉన్నాడు. శ్రీరామ్ ఆశయాల మీద అతనికి విపరీతమైన నమ్మకం. స్వాతంత్ర్య ఆందోళనలో కూడా శ్రీరామ్ వల్లనే ఉన్నాడు. క్రొత్తగా అఖండజ్యోతి మొదలుపెట్టాక ఇక్కడ కూడా తోడుగా వచ్చేశాడు. లెక్కలు వ్రాసేవాడు, ఉత్తర ప్రత్యుత్తరాలు చూసుకునేవాడు. సుమారు 150 నుండి 200 ప్రతులను ఇంటింటికీ వెళ్ళి అందించేవాడు. పత్రిక రెండో సంచిక విడుదలయ్యేసరికి పాఠకుల నుండి చాలా ఉత్తరాలు వచ్చాయి. విద్వాంసుల, పండితుల నుండి కూడా ఉత్తరాలకు జవాబులు వచ్చాయి. మహాత్మా గాంధీ గారి నుండి కూడా ఉత్తరం వచ్చింది. అందులో వారు. పత్రికలో వేర్పాటువాదం రాకుండా జాగ్రత్తపడమని సలహా ఇచ్చారు. అందరితో కలిసి మెలిసి సామరస్యాన్ని స్థాపించడం మీద దృష్టి సారించమన్నారు. భగవంతుడి సృష్టిలో ఎవరు ఎవరికీ విరోధులు కారు. విరోధం కనిపించినా, నిజానికి అక్కడ అంతా అనుగుణ్యం గానే ఉంటుంది.

కళ్యాణ్ సంపాదకులు హనుమాన్ ప్రసాద్ పొద్దార్‌గారు కూడా 'అఖండజ్యోతి'ని ఆశాకిరణం అంటూ కొనియాడారు. అప్పట్లో ఆయన పత్రిక 20,000కు పైగా కాపీలను ముద్రించే వారు. హిందీలో మొదటి శ్రేణి పత్రికల్లో కళ్యాణ్ ఒకటి. ఆయన అఖండజ్యోతి పత్రిక మీద ఆశలు పెట్టుకున్నారు.

**గాయత్రీ మంత్రం ఒక జీవన దర్శనం**

మొదటి సంచికలోనే భారతీయ పరంపరకు మూలమైన మరియు తప్పక ఉపాసించవలసిన గాయత్రీమాత సందేశాన్ని అందరికీ అందజేస్తామనే సంకల్పాన్ని ప్రచురించారు. సనాతన ధర్మ విద్వాంసులు దీనిని కొనియాడారు. ఆర్యసమాజ విద్వాంసులు కాస్త నొచ్చుకున్నారు. ఎందుకంటే వారు విగ్రహారాధనను సమర్థించరు.

సమాజంలోని విభిన్న వర్గాల నుండి వివిధ రకాలుగా ప్రతిక్రియలు వచ్చాయి. అన్నింటికన్నా శక్తివంతమైన ప్రతిక్రియ తాయీజీది. ఆవిడ అఖండజ్యోతి మొదటి పత్రిక గాయత్రీ మాత ముందు అర్పించినప్పుడు ఏమీ అనలేదు. కానీ ఒక నెలయ్యాక ఉన్నట్టుండి ఒకరోజు "శ్రీరామ్! నువ్వు గాయత్రీ మాత పత్రిక ఆగ్రాలో ముద్రించావు. దాని మీద సుదర్శన చక్రాన్ని ధరించిన కృష్ణుడి చిత్రం ఉన్నది. ఈ పత్రిక ఆయన జన్మస్థలం నుండే వెలువడితే ఎంత బావుంటుంది!"

అంతకు ముందు నుండే శ్రీరామ్ మనసులో కొనసాగుతున్న ఒక ఆలోచనకు తాయీజీ మాట బలం చేకూర్చింది. ఆగ్రా సాహిత్యపరమైన, రాజకీయ నగరం. దానితో పాటు అది పర్యాటక స్థలం కూడా. దానికి చారిత్రక మహత్తు ఉంది. కానీ ధార్మిక, సాంస్కృతిక కార్యాలకు మథురకే ఎక్కువ ప్రాధాన్యత ఉన్నది. సాధారణంగా ధార్మిక కార్యలకి దక్కాల్సిన ప్రాముఖ్యత ఆగ్రా, గ్వాలియర్, భోపాల్ లేదా ఢిల్లీలాంటి చారిత్రక ప్రధాన నగరాలలో దక్కదు. తాయీజీ మనస్సు ఎప్పటికీ మథుర, బృందావనం చుట్టూరానే తిరుగుతూ ఉంటుంది.

తల్లి చెప్పిందనో, తీర్థస్థల మహత్యం వల్లనో మథుర మీద ధ్యాస మళ్ళలేదు. అఖండజ్యోతిని మథురకు తీసుకుని వెళ్ళడం అనేది రాబోయే కాలానికి అవసరం అని వారికి అనిపించింది. ఆ కాలంలోనే యుగగాయత్రితో ముడిపడిన సందేశంతో ఒక స్వప్నం కనిపించింది. కలలో అప్పుడు ఆశ్వయుజ నవ రాత్రులు. ప్రొద్దున నవరాత్రి పూజా సంకల్పం తీసుకోవాలి. ఆ రాత్రే కల వచ్చింది. తండ్రిగారు వ్యాసపీఠం మీద కూర్చుని ఉన్నారు. భాగవత ప్రవచనం చెప్తున్నారు. వ్యాసపీఠం వెనుక అఖండజ్యోతి కవర్ పేజీ మీద ముద్రించిన సుదర్శన చక్రం ధరించిన శ్రీకృష్ణుడి చిత్రపటం పెట్టి ఉంది. రూప్‌కిశోర్ శర్మ గారు 'గాయత్రీ భాగవతం' శీర్షిక నుండి వ్యాఖ్యానం చేస్తున్నారు. మొదలుపెడ్తూనే ఆయన అన్న మాటలు "నేడు ఉన్నట్టుగానే మరికొన్నాళ్ళు భాగవతం కేవలం విద్వాంసుల వరకే పరిమితమై ఉంటుంది. ఆ తరువాత ఈ శాస్త్రం కేవలం పారాయణగా పాడుకునే గ్రంథంగానే మిగిలిపోతుంది. అందులో చెప్పబడిన ధర్మం, భక్తిభావాలు మాయమైపోతాయి. ఆ యుగంలో గాయత్రి ద్వారానే భాగవత మర్మం అర్థమవుతుంది."

సుదర్శనచక్రధారి శ్రీకృష్ణుడి ముందు గాయత్రీ విగ్రహం ప్రతిష్ఠింపబడి ఉంది. తండ్రిగారు అమ్మవారిని శ్రీకృష్ణుడితో పాటు కూడా ఆరాధిస్తున్నట్టు కనిపించింది శ్రీరామ్‌కి. ప్రత్యక్షంగా కథా శ్రవణం చేసే రోజులలో తండ్రిగారు "సత్యం పరం ధీమహి" గురించి చెప్పే వ్యాఖ్యానాలే ఇప్పుడు కూడా చెప్తున్నట్టు అనిపించింది. వ్యాఖ్యానం ముగిస్తూ ఆయన – "శుకమహర్షి భాగవతాన్ని వ్రజభూమిలో చెప్పారు. గాయత్రీ కథా వ్యాఖ్యానం కూడా అక్కడ నుండే జరగాలి" అంటూ లేచి నిల్చున్నారు. పూజా వేదిక మీద నుండి దిగి ఆయన శ్రీకృష్ణ జన్మస్థలం నుండి బృందావనం వైపు నడుచుకుంటూ వెళ్ళారు. జన్మభూమిలో కటరా కేశవ్‌దేవ్ అనే చిన్న గుడి ఉండేది అప్పట్లో తండ్రిగారు వెళ్తుంటే శ్రీకృష్ణుడు కూడా ఆయన వెనకాలే వెళ్తున్నట్టు అనిపించింది శ్రీరామ్‌కి.

ఈ కల వచ్చిన కొన్నాళ్ళకు ధ్యానంలో శ్రీరామ్‌కు మరో అనుభూతి కలిగింది. మార్గదర్శకసత్తా కూడా మథురను కేంద్రంగా చేయమని సూచించినట్టు అనిపించింది. గాయత్రీ మంత్రంలో భాగవత ప్రేరణలతో నిండిన 'సనాతనధర్మం' మరియు భగవంతుని సందేశం బీజరూపంలో ఉంది. దీపావళి దగ్గర పడ్డప్పుడు ఈ అనుభూతి కలిగింది. మథురను కేంద్రంగా చేయాలని శ్రీరామ్ నిర్ణయించుకున్నారు. వీలైనంత తొందరగా ఆగ్రా నుంచి మారాలి.

ఈ నిర్ణయాన్ని తాయీజీకి సూచించారు. "మథురలో ఉండాలని ఎప్పుడూ కోరికగా ఉండేది. మీ నాన్నగారికి కూడా చెప్పేదాన్ని. ఆయన వినకపోయినా, కృష్ణుడు విన్నాడు." తల్లి మాట శ్రీరామ్‌కు ఆశీర్వాదం వంటిది. మర్నాడే ఆయన 'అఖండ జ్యోతి' పాఠకులకు సందేశం పంపారు. మథురను కేంద్రంగా ప్రకటిస్తూ, అక్కడ సాధన, సంస్కారాల కొత్త కార్యక్రమాలను నడుపుతామని కూడా సూచించారు. దేవోత్థాన ఏకాదశి తరువాత కొత్త వ్యవస్థ ఏర్పాటు కోసం మథురకు వెళ్ళారు.

**గాయత్రీ మంత్రం జీవించేకళ**

ఆగ్రాలో శ్రీరామ్‌కు శిరోమణిగారు అనే సాహిత్య మిత్రుడుండేవారు. ఆయన అసలు పేరు వేరే కాని ఈ పేరుతోనే అందరికీ పరిచయం. 'సాహిత్య సందేశం' అనే పత్రాన్ని ముద్రించేవారు. కొన్నాళ్ళు 'సైనిక్' లో కూడా తోడుగా పని చేశారు. అఖండజ్యోతి ప్రారంభం కాగానే అందులో కూడా తోడుండాలని నిశ్చయించుకున్నారు. 'సాహిత్య సందేశాన్ని' పూర్తిగా మూసేసి అఖండజ్యోతితో కలిసిపోవాలన్నంత ఉత్సాహం చూపించారు. ఆయనది సంపన్న కుటుంబం. నిర్వహణ భారం లేదు. ఆయన సహకారాన్ని స్వీకరించారు కానీ, తన పత్రిక మాత్రం నడుపుతూనే ఉండాలని చెప్పేవారు శ్రీరామ్. అఖండజ్యోతి ఒక ప్రయోగం. భవిష్యత్తులో ఏ రూపు దాలుస్తుందో చెప్పలేం. జరగరానిదేదైనా జరిగినా, 'సాహిత్య సందేశం' అనే చిన్న వేదిక కూడా చేజారిపోతుంది.

"ఏం పర్వాలేదండి, ఒకరు మునిగిన చోట ఇద్దరు మునుగుతారు. చావైనా, బ్రతుకైనా మీతోటే అని నిశ్చయించుకున్నాను" అనేవారు శిరోమణి గారు.

"ఒక్క ఆరు నెలలు ఓపిక పట్టండి. పత్రిక భవిష్యత్తు తేలిపోతుంది" అన్నారు శ్రీరామ్.

దానికి ఆయన నొచ్చుకుని, " అంటే? అప్పటివరకు 'అఖండ జ్యోతి' కిరణం ఒక్కటి కూడా మా నుదుట రాసి లేదా?" అన్నారు.

అందుకు బదులుగా శ్రీరామ్ ఆయనను ఈ మధ్యలో మీరు పత్రికకు పాఠకులను చేర్చండి. ఎంత ఎక్కువమంది సభ్యులను చేర్చగలిగితే మనది అంతటి సమృద్ధమైన కుటుంబం అవుతుంది." అన్నారు.

శిరోమణి గారు సభ్యులను చేర్చే పనిలో మునిగిపోయారు. ఆయన ఒక్కరే డెబ్బైమందికి పైగా చేర్చారు. ఈ మధ్యలోనే కేంద్రం మార్చాలనే నిర్ణయం జరిగింది. శిరోమణి గారి ఉత్సాహం కాస్త చల్లబడింది. ఆయన పని మానలేదు కానీ మొండిపట్టుదల వదిలేశారు. శ్రీరామ్ మథురకు మారడంలో కూడా ఆయన సహాయం చేశారు. అక్కడ ఉండడానికి చోటు వెతకాలి. దాని కోసం శ్రీరామ్‌తో పాటు ఆయన కూడా మూడు నాలుగు సార్లు మథురకు వెళ్ళారు.

– అనువాదం: *శ్రీమతి జయలక్ష్మి*

## మహాత్ముడు

*ఒక మహాత్ముడు ఉండేవాడు. ఆయన తనకు లభించినదానిలో ఎక్కువ భాగాన్ని అవసరంలోఉన్నవారికి పంచుతూ, తాను ఆకలితో ఉండి కూడా ఇతరుల అవసరాలను తీరుస్తూ ఉదారుడై జీవించేవాడు. ఆయనకు చాలా రోజులుగా భోజనం లభించలేదు. ఒకనాడు శ్మశానంలో పిండితో చేసిన మూడు పిండాలు పడి ఉండటం ఈయన చూశారు. కాష్టం కాలగా మిగిలిన చితి మండుతోంది. పిండాలతో రొట్టె చేసికొని, చితిమీద కాల్చుకుని కడుపు నింపుకొనే ప్రయత్నంలో ఉన్నాడు. పై నుండి శివపార్వతులు ఇది చూశారు. పార్వతి దుఃఖాన్ని ఆపుకోలేక, ఇంతటి మహానుభావునికి ఈ బాధలు ఏమిటి? మీకు దయలేదా అని పరమేశ్వరుడిని ప్రశ్నించింది. పరమేశ్వరుడు చిరునవ్వుతో మహాత్ముణ్ణి వీక్షిస్తూ, "దేవీ! ఇటువంటి మహాజనులకు దారిద్ర్యం, దైన్యం లాంటివి అంటించినా అంటుకోవు. ఇతరుల సుఖం కోసం వారి వైభవాన్ని ఒదులుకొనే ఈ త్యాగమూర్తులను దరిద్రులు అనటానికి ఎంతమాత్రం వీలులేదు. కావాలంటే క్రిందికి దిగి పరీక్షించి చూడు. నీ ఆకలి తీర్చటానికి ఇతడు తన ఆకలిని ఆనందంగా ఆహ్వానిస్తాడు. వీరికి కడుపు నింపుకొని సుఖంగా ఉండాలనే కాంక్ష, కోర్కె ఉండవు" అని పలికాడు. పరమేశ్వరుని మాట ప్రకారం పార్వతి వృద్ధ స్త్రీ వేషంలో క్రిందకు దిగి మహాత్ముడిని సమీపించి, ఒణుకుతూ చేయి జాచి ఆకలి తీర్చమని ప్రాధేయపడింది. తినటానికి సిద్ధంగా ఉన్న అతడు ఆనందంగా రొట్టెలను పార్వతి చేతులలో పెట్టి, త్రాగటానికి నీటిని కూడా తెచ్చి ఆమె ముందుంచాడు. పార్వతి ప్రసన్నురాలై ఆ మహాభక్తునికి నిజరూపంలో దర్శనమిచ్చి, వరాన్ని కోరుకోమన్నది.*

– ప్రజ్ఞాపురాణం నుండి
అనువాదం: *శ్రీమతి గౌరీ సావిత్రి*

**గాయత్రీ విద్యయే ప్రాణవిద్య**



### గాయత్రీ జయంతి ప్రత్యేకం

# జ్ఞానగంగ-పరమపావన భాగీరథీ అవతరణ మహాపర్వం

గాయత్రి మరియు గంగానది అవతరించిన పర్వదినమే గాయత్రీ జయంతి. భూమి మీద గంగామాత అవతరించినది. ఈరోజే జ్ఞానగంగ గాయత్రీ కూడా అవతరించినది. నిక్షిప్తమైన జ్ఞానం బహిర్గతమై, పవిత్రత వ్యక్తమైన ఈరోజు ఎంతో విశేషమైన రోజు, విశిష్టమైన పర్వం. గాయత్రి రూపంలో దూరదర్శత, వివేకం, ప్రఖరత మరియు గంగామాత రూపంలో చల్లదనం, పవిత్రతలు పృథ్వీచైతన్యానికి ఒక కొత్తదిశను అందించాయి. ఈ అవతరణల వలన మానవీయ చైతన్యంలోని ఒక భాగము క్రొత్తగా క్రియాన్వితమైనది, కొత్త పరిణామాలకు దారి ఏర్పడింది. మానవ జీవితానికి సంబంధించిన నూతన వికాస శిఖరాన్ని అధిరోహించే రోజు ఇదే.

ఈ సృష్టిని నిర్మించిన బ్రహ్మదేవుడు మనిషికి వివేకము ఆలోచనా విధానాలను అందించిన రోజు ఇది. చాలా రకాలుగా గాయత్రీ జయంతి ముఖ్యమైనది. ఎన్నో పౌరాణిక, ఆధ్యాత్మిక, మార్మిక ప్రసంగాలు ఈ పర్వదినంతో ముడిపడి ఉన్నాయి. పరిజనులమైన మనందరము సంకల్పం, శ్రద్ధాంజలి అర్పించవలసిన రోజు ఇది. మనందరి ఆరాధ్యుడు, పరమపూజ్య గురుదేవులు గాయత్రీమాతలో లీనమైపోయిన రోజు. స్థూల రూపాన్ని త్యజించి సూక్ష్మరూపంలో మనందరి మనస్సులలో స్థిరపడ్డారు. అశ్రుపూరిత నయనములతో వారి ఉద్దేశ్యాలను ఎల్లప్పటికి ప్రాణవంతంగా ఉంచుతామని, వాటిని ప్రతి మనిషికి తెలియచేయాలనే సంకల్పాన్ని స్వీకరించి, భావాంజలిని అర్పించిన రోజు. నేడు ఆ సంకల్పజ్వాలలను మరింత ఉత్తేజపరచి, ప్రజ్వలింపజేయాల్సిన అవసరం ఉంది.

గంగ, గాయత్రీమాతలు మన ఆలోచనలలో, భావనలలో అవతరించి, జీవితం వివేకంతో, ఉన్నత ఆదర్శాలతో నిండాలి అనే సంకల్పం ఈరోజు తీసుకోవాలి. ఈ సమన్వయాన్నే ఋతుంభరా ప్రజ్ఞ అంటారు. ఈశ్వరుడు ఏ ఉద్దేశ్యంతో మనలను సృష్టించాడో, ఎందుకు మనం ఆ ఈశ్వరుని రాకుమారులం అని పిలిపించుకుంటున్నామో దానిని గుర్తుంచుకోవడమే ఋతుంభరా ప్రజ్ఞ. భగీరథుడు స్వర్గం నుండి భూమికి గంగను దింపినట్టు, ఋతుంభరా ప్రజ్ఞ కూడా విశ్వ వసుధపై అవతరించింది. ఈ ఆధ్యాత్మిక ధార మానవుల్లో ప్రవహించి గాయత్రీ విద్యగా, బ్రహ్మవిద్యగా పేరుగాంచింది. ఇది మనిషిలోని అనేక సుషుప్త శక్తుల్ని జాగృతపరచి వికసింప జేస్తుంది. మనిషిని సిద్ధులతోను, విభూతులతోను నింపివేస్తుంది. మనిషికి తన నిజస్వరూపాన్ని తెలియజేస్తుంది, దారితప్పిన దేవతని, తప్పుదోవ వదిలితే దేవమానవుడు కాగలవని తెలియ జేస్తుంది. మనిషి నరుడి రూపంలో ఉన్న నారాయణని స్వరూపమే.

ఋతుంభరా ప్రజ్ఞ అంటే బ్రహ్మవిద్య. రిద్ధిసిద్ధులతో నిండిన విద్య. ఈ విద్యకి మూడు చరణాలున్నాయి. అవి అహంకారం నుండి దూరంగా; లోభం, తృష్ణ, కామనల నుండి దూరంగా, ఇంద్రియ దురుపయోగం నుండి దూరంగా ఉండడం. నేటి మనిషి అహంకారపు తోలుబొమ్మ. ఏమాత్రం ఉపయోగపడని గొప్పతనాన్ని సంపాదించుకోవడానికి మాత్రమే కృషి చేస్తున్నాడు, ఆలోచిస్తున్నాడు. తాను స్వయంగా సృజేత పదవిని అలంకరించాలనుకుంటున్నాడు. తన ఆదేశానుసారం సూర్యోదయ, సూర్యాస్తమయాలు జరగాలని; గ్రహాలు, ఉపగ్రహాలు తన పరిధిలో తిరగాలని; ప్రకృతి నియమాలన్నీ తన ఆధీనంలో ఉండాలని కోరుకుంటున్నాడు. ఇది ఎన్నడు సంభవం కాలేదు, కాదు కూడా. ఎందరో ఈ ప్రయత్నంలో నాశనమైపోయినప్పటికి అహంకారం మాత్రం ఊరికే ఉండదు. అహంకారం సురస ముఖం వంటిది. ఒక్క జీవితం కాదు, వేల జీవితాలు నాశనమైపోయినా అహంకారం తృప్తిచెందదు. అటువంటి వ్యక్తికి అహంకారాన్ని పోషించుకోవడానికే సమయం సరిపోదు. ఇక లోకోపకారం, మానవకళ్యాణం వంటి వాటి ఆలోచనే రాదు. ఈ అహంకారాన్ని రూపుమాపడమే ఋతుంభరా ప్రజ్ఞ యొక్క మొదటి చరణం.

రెండవ చరణం తన శరీర అవసరాల కోసం మనిషి సతమతమవకూడదు. వ్యాకులత చెందకూడదు. కానీ వాస్తవానికి అలా జరగడం లేదు. తన శారీరిక సౌందర్యాన్ని మెరుగు పరుచుకోవడానికి, కడుపు నింపుకోవడానికి, పట్టెడన్నానికి

**గాయత్రీ మంత్రం సమాజనిర్మాణ విధానం**

బదులు తినకూడని అనేక పదార్థముల కొరకే జీవితంలోని బహుమూల్యమైన శక్తిసాధనలను ఉపయోగిస్తుంటాడు. ఇందుకై తన నైతిక విలువలకు, సిద్ధాంతాలకు తిలోదకాలి స్తున్నాడు. తన తెలివిని, భావాలను కూడా అందుకే వెచ్చిస్తుంటాడు. మనిషి తనను తాను శరీరం మాత్రమే అని భావిస్తున్నాడు. ఉన్నతాదర్శాలను అణచివేస్తున్నాడు. ప్రపంచం లోని వైభవము, విలాసవస్తువులన్నీ తనకు లభించాలని ఉవ్విళ్ళూరుతున్నాడు. ఇది ఎలా సాధ్యమవుతుంది?

మూడవ చరణం మనిషి జీవితంలో ఆనందం పొంగి పొర్లుతూ ఉండాలని, అంతరం ఉల్లాసభరితంగా ఉండాలనే ఉద్దేశ్యంతో భగవంతుడు మనిషికి ఇంద్రియాలను ప్రసాదించాడు. అవి జిహ్వా, చెవి, కళ్ళు, కామేంద్రియాలు మొదలైనవి. ఇంద్రియాలన్నీ ఆనందంగా ఉండటానికే లభించాయి. కానీ ఆ ఇంద్రియాలలోని ప్రఖరత, దివ్యత్వం, సౌందర్యం సమసిపోయే టట్టు చేసుకున్న మన దౌర్భాగ్యాన్ని ఏమనాలి? మత్తు పదార్థాలు సేవించాం, వినకూడనివి విన్నాం, చూడకూడని చూస్తున్నాము, ముల్లోకాల్లో ఎక్కడా తలదాచుకోవడానికి వీలులేనంతటి దుశ్చర్యలన్నీ చేశాం. శ్రేష్ఠమైన ఆదర్శాలన్నిటినీ మట్టిలో కలిపేశాం. ఉల్టా నడుస్తున్నాము.

త్రిపద గాయత్రిలోని మూడు ధారలు ఈ మూడు విషయాల నుండి ముక్తి పొందేందుకు శిక్షణనిస్తాయి. మనిషి ఇతరుల కోసం ఉత్కృష్ట భావాలతో సమర్పిత జీవితం గడపాలి. సామాన్య జీవన అవసరాలు తీరడానికి అవసరమైనంత శ్రమ, సమయం, బుద్ధిని ఉపయోగించి, మిగిలినది నిస్సహాయుల సేవకు, దుఃఖితుల బాధలు తీర్చడానికి, ఇతర లోకోపకార కార్యాలకు ఉపయోగించాలి అనే సంకల్పం ఉదయించాలి. మనిషిలోని శారీరిక, మానసిక సామర్థ్యాలు వాసనల వల్ల నాశనమైపోకుండా గాయత్రీ మంత్రం శిక్షణనిస్తుంది. మనలోని శక్తులన్నింటిని ఏకత్రితం చేసుకోవాలి. విచ్చలవిడిగా ఉపయోగించకూడదు. ఇంద్రియాల సామర్థ్యం, శక్తులు సదుపయోగపడాలి. ఈవిధంగా చేస్తే మన జీవశక్తి క్షయమవదు, సంరక్షించబడుతుంది. ఇంతేగాక అది పెంపొందుతూ ఉంటుంది మరియు మంచి ఉద్దేశ్యాలకు ఉపయోగపడుతుంది. మనలోని లోభం నాశనమయ్యేటట్టు శిక్షణ ఇస్తుంది. కామనలను, తృష్ణను నిగ్రహించుకోగలిగితే మనలోని ప్రతి ఒక్కరము దేవ మానవులం కాగలం. గాయత్రీ జయంతి నాడు ఈ ప్రపంచంలో మూడు ధారలుగా త్రిపద గాయత్రి అవతరించిననాడు మనము కీర్తి, ప్రతిష్ఠల వెనుక పరుగులు పెట్టకుండా కర్తవ్యాన్ని నిర్వర్తించాలి. లోకులేమనుకుంటారో అనే భయం లేకుండా వివేకాన్ని ఉపయోగించాలి. ప్రపంచమంతా విరోధించినా కూడా సదాచారాన్ని వదలకూడదు. పొగడ్తలకి సులువుగా లొంగే మనస్సు, ఈ ప్రపంచం ఎవరిని పొగిడితే వారే గొప్ప అనుకుంటుంది. నిజానికి పొగిడినంత మాత్రాన మనిషి గొప్పవాడు కాలేడు. అంతేకాక అసలు పొగిడేవాడికి అంతటి అర్హత కూడా ఉండదు. ఇటువంటి మిథ్యా విషయాల వెంటపడితే ఉపయోగం ఏమిటి? అంతర్ముఖమవడమే నిజమైన ప్రశంస. లోకోపకార కార్యాలు ప్రశంసనీయం. పైకి కనబడకపోయినా నిజానికి ఇవి చాలా గంభీరమైనవి. నేటి ఈ పర్వదినాన మనందరము మరోసారి ఆత్మవిమర్శ చేసుకోవాలి. భగవంతుని ప్రసాదమైన మన శక్తి సామర్థ్యాలన్నీ సదుపయోగపడుతున్నాయా లేదా అనేది వెయ్యి సార్లు గమనించుకోవాలి. ఈ సంకల్పాన్ని క్రియాన్వితం చేసుకునే మహాపర్వమే గాయత్రీ జయంతి. ఈ కర్తవ్య నిర్వహణే మన పరమ కర్తవ్యం.

*– అఖండజ్యోతి, జూన్ 2005*
*అనువాదం: శ్రీమతి జయలక్ష్మి*

## తైమూరు

*తైమూరు ఢిల్లీ వీధుల్లో తిరుగుతూ ఉండగా ఒక అంధురాలైన అవ్వ కనిపించింది. ఆమెను పేరేమిటని ప్రశ్నించగా తన పేరు 'సంపద' అని బదులు పలికింది. అరే సంపద గుడ్డిదా అంటూ తైమూరు ఆశ్చర్యాన్ని ప్రకటించాడు. ఆమె కోపంగా సంపద గుడ్డిదైనప్పుడే కాళ్ళు చేతులు లేని నీ వంటి కుంటి వాళ్ళు కూడా సులభంగా దోచుకోవటానికి వీలవుతుందని ఆమె బదులు పలికింది. కుంటి తైమూరు నోటివెంట మాట పెకలలేదు. సిగ్గుతో తలవంచుకొన్నాడు.*

– ప్రజ్ఞాపురాణం నుండి
*అనువాదం: శ్రీమతి గౌరీ సావిత్రి*

**గాయత్రి అనగా సామూహిక వివేకశీలత**

కబీరుదాస్ జయంతి ప్రత్యేకం

# ఆచరణలో ఆధ్యాత్మికత : కబీరు జీవన వేదం

## జన్మకథను దాచని కబీరు

ఒక వితంతువు అప్పుడే పుట్టిన తన శిశువును సమాజానికి వెరచి కాశీలోని అగర్తలా చెరువు ఒడ్డున ఉన్న కాలిబాట మీద వదలివేసింది ఆ దారిన పోయే పుణ్యాత్ములు ఎవరైనా ఆ శిశువును తీసుకువెళ్ళి పెంచుతారనే ఆశతో. ఆ పిల్లవాణ్ణి ఒక ముస్లిం చేనేత కార్మికుడు పెంచాడు. ఆ కార్మికుని పేరు నీరూ. అతడి భార్య పేరు నీమా. ఈ కుటుంబంలో ఆ పిల్లవాడు పెరిగి పెద్దవాడయ్యాడు. ఆయన పేరు కబీరు.

## గురుదీక్ష

ఒకరోజున బ్రహ్మ ముహూర్తంలో గురువు రామానందజీ గంగా స్నానానికి వెళ్తున్నారు. కబీరు ఆ దారిలో పడుకున్నాడు. ఆ చీకటిలో గురువుగారి పాదం కబీరు గుండెమీద పడింది. ఆయన నివ్వెరపోయారు. 'రామ-రామ' అంటూ వెనుకకు అడుగు వేశారు. అదే కబీరుకు గురుదీక్ష అయింది. ఇందులో గురువుగారి అనుగ్రహం లేదు. శిష్యుని విశ్వాసమే ఉంది. ఈ విశ్వాసం కాలక్రమంలో ఫలించి పుష్పించింది.

15 సంవత్సరాల వయస్సులో అతడి అంతరంగంలో ఒక కొత్త ప్రేరణ ఉదయించింది. "నీ జీవితం మహత్తర లక్ష్యాల సాధన కోసం ఉద్దేశించబడింది" – అన్నదే ఆ ప్రేరణ. అతడు తానేమి చేయాలని పలువిధాలుగా తర్జన భర్జన చేసుకున్నాడు. దారి తప్పిన జన మానసానికి సరైన దారి చూపాలని నిర్ణయిం చుకున్నాడు. అతడు తెల్లవారుజామునే లేచి తండ్రి వృత్తిని చేపట్టేవాడు. తనకు కడుపు నిండేటంత పని చేసి బయటికి వెళ్ళేవాడు. ఇంటింటిలో, వీధి వీధిలో, పల్లె పల్లెలో భావజ్యోతిని వెలిగించేవాడు. అతడి ఆలోచనలను విన్న ప్రతి ఒక్కరు చలించి పోయేవారు. కొద్దిరోజులలోనే వేలాదిమంది ఆయన ప్రశంస కులుగా, సమర్థకులుగా, సహాయకులుగా మారిపోయారు. సంత్‌గా ఆయన ప్రఖ్యాతి పొందారు. కానీ, శ్రమించి కడుపు నింపుకునే పని మాత్రం ఆయన వదలలేదు.

## గృహస్థు సంత్

ఆచరణలో శుద్ధి, లోకకళ్యాణం, మతసామరస్యం దుష్ప్రవృత్తి నిర్మూలన అనే అంశాలు ఆయన మత ప్రచారంలోని మూల సూత్రాలు. ఈ ప్రచారం వల్ల తమ స్వార్థ ప్రయోజనాలకు భంగం కలుగుతోందని కొందరు వ్యక్తులు ఆందోళన చెందేవారు. వేషం, వంశముల పేరిట జరుగుతున్న అనాచారం ఆయన ప్రాణాలకు ముప్పుగా పరిణమించింది. ఆయనపై పలుమార్లు ఆక్రమణలు జరిగాయి. కబీరు ప్రాణాలతో బయటపడ్డారు. అయినా ఆయన భయపడలేదు. ఆగిపోలేదు. తన పని చేసుకుంటూపోయారు. ప్రశంసకుల పట్ల ఇష్టం కానీ, నిందించే వారి పట్ల ద్వేషం కానీ ఆయనలో చోటుచేసు కోలేదు. ఆయన దృష్టి అంతా లక్ష్యంపై లగ్నమై ఉంది. ఆయన తన మార్గంలో ఏకాకిగా ముందుకు సాగారు.

## రామనామం, రామకార్యం

అనుచరులు ఆయన జీవనచర్యను ప్రత్యక్షంగా చూశారు. రాత్రిపూట బట్టలు నేయడం; ఉదయం నుండి ప్రచార, సత్సం గాలలో నిమ్నగం కావడం. ఆయన భజన ఎప్పుడు చేసేవారు? భజన చేయని వ్యక్తి సంత్ ఎలా అవుతాడు? కబీరు బట్టలు నేస్తూ రామనామం జపించేవారు.

## సంస్కర్తల నిర్మాణం

కబీరు తన ప్రచారయాత్రలలో ఆలోచనాపరులు పలువురిని కలుసుకున్నారు. కులాల పేరిట హెచ్చుతగ్గుల భావనను నిర్మూలించే ప్రయత్నం జరపడానికి వారిని అంగీకరింపజేశారు. ఈవిధంగా ఆయన పలువురు సంత్‌లను, సంస్కర్తలను తయారుచేశారు.

## గుండె నుండి పెల్లుబికిన భజనలు

వెనుకబడినవారిని ముందుకు తీసుకుపోవడానికి, మత సామరస్యాన్ని పెంపొందించడానికి, దురాచారాల నిర్మూలనకు కబీరు జన్మించారు. ఈ పనిని ఆయన తాను జీవించి ఉన్నప్పుడు సూక్ష్మశరీరంతో కూడా చేస్తూ వచ్చారు. మహత్తరమైన తన

గాయత్రీ మంత్రం - దేవ సంస్కృతి దర్శనం

ఆత్మబలంతో అసంఖ్యాకుల ఆలోచనలను మార్చారు. తన సంపర్కంలోనికి వచ్చిన వ్యక్తులను తన వర్చస్సుతో ఉన్నతోన్నతులను చేశారు. వారికి మరిన్ని సాఫల్యాలు లభించేటట్లు చేశారు.

కబీరు చిన్నతనం నుండి సత్యాన్వేషణలో నిమగ్నులు అయ్యారు. సత్యాన్వేషణలో, భ్రమలను తొలగించడంలో, సత్ సంప్రదాయాలను ప్రతిపాదించడంలో ప్రాణాలను ఒడ్డి నిమగ్నం కాని రోజు ఆయన జీవితంలో లేదు. ఆయన ఇలా ఆలోచించేవారు – వ్యక్తి భవసాగరాన్ని దాటడానికి ఈ జన్మలో సన్నాహాలు చేయకపోతే వచ్చే జన్మలలో ఏమి ఆశించగలం?

పని చేస్తున్నంతసేపు ఆయన ఏవో భావాలు అల్లుకుంటూ వాటిని మాటలలో, పాటలలో పేర్చుకుంటూ ఉండేవారు. ఇలా తన్మయంగా అల్లుకున్న పదాలు భజనలుగా వెలికివచ్చేవి. ఇలా లోలోపల పాడుకున్న భజనలను ఆయన ప్రతిరోజు స్వామి రామానందజీ సత్సంగ గోష్ఠిలో వినిపిస్తూ ఉండేవారు. కబీరు చదువుకున్నవారు కారు. అయినా – ఆయన హృదయం నుండి పెల్లుబికివచ్చిన, భక్తిరసంతో పొంగిపొరలిన ఆ భజనలు శ్రోతల గుండె లోతులను తాకేవి. వారు తన్మయులు అయ్యేవారు. కాలక్రమంలో కబీరు కవిగా ప్రసిద్ధి పొందారు.

సత్సంగం మనిషి ఆత్మను ప్రభావితం చేస్తుందన్నది నిశ్చయం. మనస్సు, బుద్ధి, వివేకం, ప్రతిభలను మేలుకొల్పుతుంది ఆ ఆత్మ వెలుగు. కనుకనే సత్సంగం మహిమను శాస్త్రాలు నొక్కి వక్కాణించాయి. సత్సంగంలో పాల్గొని చదువుకోని వ్యక్తి సైతం యోగ్యుడు అవుతాడు, మూఢుడు పండితుడు అవుతాడు.

## నా కులం మానవత, నా మతం ప్రేమ

కబీరుకు వివాహం జరిగింది. ఆయన భార్య పేరు లోఈ. జనం కబీరు ఇంటికి వచ్చిపడ్డారు. వారిలో ఇద్దరు ముగ్గురు ఆయనను ఇలా గద్దించారు – ఇలా చేయి పట్టుకుని పెళ్ళి చేసుకునే హక్కు నీకు ఎవరిచ్చారు? కాజీనీ పిలువలేదు. బంధువులను పిలువలేదు. ఈ వివాహం చెల్లదని మేము నిర్ణయిస్తున్నాం.

కబీరు ప్రశాంతంగా ఇలా అన్నారు – లోఈ నన్ను పెళ్ళి చేసుకుంది. నేను ఆమెను పెళ్ళి చేసుకున్నాను. పూర్తిగా ఇష్టపడి పెళ్ళి చేసుకున్నాం. పెళ్ళి చేసుకోవడం, చేసుకోకపోవడం అన్నది మా ఇద్దరిమధ్యా ఉన్న విషయం. ఆ పెళ్ళి చెల్లుతుందని కాని, చెల్లదని కాని నిర్ణయించే హక్కు మీకు లేదు. మీ సమాజంలోని బలహీనత ఇదే. కుళ్ళిపోయిన పాతకాలపు ఆచార వ్యవహారాలను మీరు అనుసరిస్తున్నారు. వాటికోసం అప్పులమీద అప్పులు తెస్తున్నారు. ఆ వడ్డీల ఉచ్చులో చిక్కుకుని గిలగిలలాడుతున్నారు. పేదరికంలో మ్రగ్గుతున్నారు. ఆకలి చావులకు గురి అవుతున్నారు. ఇకనైనా మీరు మీ జీవితాలలోకి కొత్త వెలుగును ఆహ్వానించండి. విజ్ఞతతో వ్యవహరించండి. పనికిమాలిన ఆచార వ్యవహారాలను వదులుకోండి. మిమ్మల్ని మీరు సంస్కరించుకోండి.

ఈ మాటలు విని వారిలా అన్నారు – నిన్ను కులం నుంచి వెలివేస్తున్నాం. నీవు కాఫిర్ అయిపోయావు. ఈ మాట చెప్పడానికి మేము వచ్చాం.

కబీరు ఇలా అన్నారు – మంచిది. నాకసలు కులమే లేదు. మరి మీరు నన్ను దేని నుంచి వెలివేస్తారు? నా కులం మానత్వం, నా మతం ప్రేమ. నమ్మకాన్ని కోల్పోయిన ముస్లిములే కాఫిర్‌లు అవుతారు. నేను ముస్లింను కాను. నేను నా నమ్మకాన్ని కోల్పోలేదు. నా నమ్మకం నిలచి ఉన్నప్పుడు, నా మార్గం ఋజుమార్గం అయినప్పుడు – నేను కాఫిర్‌ను ఎలా అవుతాను?

గుంపులోని మనుషులు ఒకరి ముఖం ఒకరు చూస్తూ ఉండిపోయారు. వారి హృదయాలపై లోతైన సంస్కారపు ముద్ర పడింది. ఇంటికి వచ్చే వ్యక్తుల సౌకర్యం కోసం ఆయన పెళ్ళి చేసుకున్నారు. గృహస్థుగా ఉంటూనే, శ్రమించి సంపాదిస్తూనే – సంత్ యొక్క జీవన క్రమాన్ని మరింత చక్కగా నిర్వహించ వచ్చునని ఆయన తన ఉదాహరణ ద్వారా నిరూపించారు.

## గోశాలల నిర్మాణం

స్వామి రామానందజీ కృప, పైన వర్ణించిన సంఘటన, భక్తిభావభరితములైన భజనలు – అన్నీ కలసి కబీరుపట్ల ప్రజలలో శ్రద్ధాభక్తులను ఇనుమడింపజేశాయి. కబీరు మహాత్మా కబీర్‌దాస్‌గా ప్రఖ్యాతి పొందారు. కబీరు భజనలలో, ప్రవచనాలలో ప్రముఖాంశం – మూఢ నమ్మకాల, ఆడంబరాల ఖండన. ఆయన ప్రజలకు సమత, సమానత, భేదభావరాహిత్యాలను బోధించారు. కులతత్వాన్ని, మతతత్వాన్ని, అంటరానితనాన్ని ఖండించడానికి ఆయన ఎన్నడు సంకోచించలేదు. నిజాన్ని సూటిగా చెప్పడంలో ఆయన చూపిన సాహసం అనుకరించ

**గాయత్రీ భారతీయ సంస్కృతికి తల్లి**

దగినది. ఆత్మ నుండి సూటిగా వెలువడి, లోకకళ్యాణ భావనతో పొంగిపొరలే ఆయన వాణి అద్భుతమైన ప్రభావాన్ని కలిగించింది. ఆ వాణి విన్నవారంతా తలవంచుకునేవారు. ఆయన ఎందరెందరో వితంతువులకు, అనాథ బాలలకు ఆసరాగా నిలచారు. ఎందరెందరో పిల్లలను చదివించారు. వారిని పనులలో, వృత్తులలో ప్రవేశపెట్టారు. ఆయన వివిధ స్థలాలలో బావులు త్రవ్వించారు. చెట్లు నాటించారు. గోశాలలు నిర్మింపజేశారు.

### సాధు సంత్‌లలో ఆడంబరాలు

కబీర్‌దాసు ఇలా ఆనందంగా పరోపకారం చేస్తూ ఉండగా – కొద్ది వ్యవధిలోనే రెండు విచారకర సంఘటనలు జరిగాయి. ఒకటి తల్లి మరణించడం, రెండవది ఆయన ఆత్మకు ప్రియతములు స్వామి రామానందజీ దివంగతులు కావడం.

ఈ సంఘటనల వల్ల అనాసక్తమైన కబీర్‌దాసు హృదయం సైతం చలించిపోయింది. కబీరు ఆత్మశాంతి కోసం గౌతమ బుద్ధుని వలే ఇల్లు వదలి బయలుదేరారు. సుమారు సంవత్సరం పాటు సాధుసంత్‌లను, మహాత్ములను, మహంత్‌లను కలిశారు. అయినా ఆయనకు ఎక్కడా శాంతి లభించలేదు.

సాధువుల ఆడంబరాలు, సమాజంలోని అజ్ఞానం – వీటిని సునిశితంగా పరిశీలించడంతో ఆయనలో అశాంతి మరింతగా పెరిగింది. సాధువుల జీవితాలలోని లోభం, తృష్ణ, మాయ మోహాలు మామూలు గృహస్థులలోని ఈ దుర్గుణాలను మించి పోయాయని ఆయన గమనించారు. ఇంటిలోనే ఉంటూ, తన కర్తవ్యాన్ని నిర్వహిస్తూ, భగవంతుని భజన చేస్తూ ఉండడాన్ని మించిన సాధన లేదని ఆయన తన అనుభవాల ద్వారా నిర్ణయించుకున్నారు. ఫలితంగా – ఆయన ఇంటికి తిరిగివచ్చి తన ఆధ్యాత్మిక సాధనను కొనసాగించారు.

### రామ్ - రహీం శిష్యులం మనమంతా

స్వామి రామానందజీ కుటీరంలో ఆయన పద్ధతిలోనే కబీర్‌దాసు సత్సంగం చేయడం ప్రారంభించారు. స్వామి రామానందజీ పరమపదించిన తర్వాత మూగబోయిన ఆ పవిత్ర స్థలం తిరిగి జనంతో, జీవంతో తొణికిసలాడింది. కబీరు ఉపదేశాలను, భజనలను వినడానికి ప్రజలు వేలాదిగా వచ్చేవారు. కబీరు రచనలలో సమాజంలోని గ్రుడ్డి నమ్మకాలు, అనాచారాలు, దురాచారాలు ఆ వెల్లువలో కొట్టుకుపోసాగాయి. అంటరానితనం కులాల హెచ్చుతగ్గుల భేదభావాలు త్వరత్వరగా తొలగిపోసాగాయి. ఆధ్యాత్మికంగా ఒకరికొకరు సమానమేనన్న భావన ప్రజలలో నాటుకుపోయింది.

ఆనాటి సమాజంలో అది ఒక అభినవ విప్లవం. ఛాందస వాదులు, పురాతనవాదులు, ఆధిక్యవాదులు దీనిని సహించలేక పోయారు.

మీవంటి వాళ్ళ మధ్య ఉంటే ఎవరికయినా ఆధ్యాత్మిక ప్రయోజనం కలుగుతుందా? – అని వారు ప్రశ్నించేవారు.

కబీరు వారికిలా సమాధానం చెప్పేవారు – మీవంటి వారికన్న మామూలు గృహస్థులు గొప్పవాళ్ళు. తాము సాధువులమంటు వారు గొప్పలు చెప్పుకోకపోవచ్చు. అయినా వారు తమ కుటుంబాలను నిర్వహిస్తూ పరంపరను కొనసాగిస్తున్నారు.

హిందూ – ముస్లిం, ఉన్నతులు – అధములు, ధనికులు – పేదలు, పెద్దలు – చిన్నలు – అనే భేదభావాలను మీ మనస్సుల నుండి తొలగించుకోండి. అంతా ఒకే రామ్ – రహీమ్ యొక్క శిష్యులు. కలసి మెలసి ప్రేమాదరాలతో సహాయ సహకారాలు ఇచ్చిపుచ్చుకోండి భగవానుని పట్ల భక్తి పెంచుకోండి. పవిత్ర జీవనం గడపండి. ఇదే నా సందేశం.

### స్వర్గ నరకాలు మనస్సులోనే

ఆ తర్వాత ఆయన తన కుమారుడు కమాల్‌కు జీవిత కర్తవ్యాన్ని బోధించి ఇలా చెప్పారు – నన్ను మగహర్‌కు చేర్చు. కాశీలో చనిపోవాలనే కోరిక నాకు లేదు.

కమాల్ ఆశ్చర్యచకితుడై ఇలా అన్నాడు – తండ్రీ! మరణించడం కోసం జనం దూరదూరాల నుండి కాశీకి వస్తున్నారు. మరి మీరు కాశీ వదిలిపెట్టి మగహర్ వెళ్ళాలని అనుకుంటున్నారు. కాశీలో చనిపోతే స్వర్గం లభిస్తుందని, మగహర్‌లో చనిపోతే నరకం లభిస్తుందని విన్నాను.

కబీరు నవ్వి, ఇలా వివరించారు – నిజమే బేటా! కాశీ, మగహర్‌ల విషయంలో వచ్చిన ఈ భ్రమను తొలగించాలన్నది నా ఉద్దేశ్యం. స్వర్గ నరకాలు మనిషికి తన మంచి చెడు కర్మలు ఆధారంగా లభిస్తాయి. నా పనుల పవిత్రతపై నాకు పూర్తి

**గాయత్రి భారతీయ ధర్మానికి వెన్నెముక**

నమ్మకం ఉంది. మగహర్‌లో చనిపోయినా నేను స్వర్గాన్ని పొందుతాను.

వాస్తవానికి నాకు స్వర్గ నరకాల మీద నమ్మకం లేదు. స్వర్గ నరకాలు మనిషికి మానసిక స్థితిలో నివసిస్తాయి.

**ప్రపంచంలో సత్కర్మల నుండి లభించే ఆత్మశాంతి స్వర్గం. పాపకర్మల నుండి లభించే యాతన నరకం.**

### మనసులోని మాలను త్రిప్పు

కబీరు మతపరమైన గ్రుడ్డి నమ్మకాలను తీవ్రంగా వ్యతిరేకించారు. మతగురువులు అమాయక ప్రజలను దోచుకోవడం ఆయన ఏవగించుకున్న విషయం. కనుకనే ఆయన హిందు, ముస్లిం వృత్తిపర మతగురువులను తీవ్రంగా విమర్శించారు. వారి ఉచ్చుల నుండి బయటపడవలసిందిగా ఆయన ప్రజలను హెచ్చరించారు. ఇందువల్ల హిందూ, ముస్లిం మతాలకు చెందిన గుత్తాధిపతులు ఆయనపై ఆగ్రహించారు. ఆయనకు రకరకాలు ఇబ్బందులు కలిగించారు.

ఎదుటివారికి తాము ధార్మికులుగా కనిపించాలని చేసే మత కర్మలను, పూజా పునస్కారాలను, కర్మకాండను ఆయన వ్యతిరేకించారు. సౌశీల్యం, నైతికత కలిగి ఉండాలని ఆయన ప్రజలకు ఉపదేశించారు. ముస్లింలతో ఆయన ఇలా చెప్పేవారు – మీరు ఎత్తయిన మీనార్ ఎక్కి బిగ్గరగా కేకలు వేస్తారు. మరి ఖుదా (దేవుడు) చెవిటివాడు అయిపోయాడా? ఇలా అరిస్తేనే కాని ఆయనకు వినబడదా?

ఆయన హిందువులకు ఇలా చెప్పేవారు – మీరు జప మాలలు త్రిప్పి యుగాలు గడిచాయి. కానీ, పరమాత్మ జ్ఞానం ఇంతవరకు మీకు కలుగలేదు. కనుక చెక్కతో చేసిన మాలలోని పూసలు త్రిప్పడానికి బదులు మనసులోని మాలలో ఉన్న పూసలు త్రిప్పితే మీకు భగవత్ ప్రాప్తి తప్పక కలుగుతుంది. ఎందుకంటే – భగవంతుడు అంతర్యామి. భక్తి ప్రదర్శనకు, నిజమైన భక్తికీ మధ్య ఉన్న తేడాను ఆయన గ్రహిస్తాడు.

### ప్రజల భాషలో రచనలు

కబీరు అచ్చమైన అహింసావాది. ఏ ప్రాణికయినా బాధ కలిగించడం, ఏ ప్రాణినయినా చంపడం ఘోరపాపమని ఆయన బోధించారు.

మహాత్మా కబీర్‌దాస్ పేరున కబీర్‌పంథ్ ఇప్పటికీ నడుస్తున్నది. ఆయన రచించిన భజనలను, గీతాలను ప్రజలు ఎంతో శ్రద్ధగా గానం చేస్తున్నారు. తద్వారా జ్ఞానం పొందు తున్నారు. ఆయన సాహిత్యం బీజక్, సాఖీ, ఉలట్ బాసయే అనే గ్రంథాలలో లభిస్తోంది. దాని భాష పూర్తిగా ప్రజల భాష. అయితే – దానిలో నిండి ఉన్న ఆధ్యాత్మిక రహస్యాలు ఏ మతగ్రంథంలోని రహస్యాలకు ఏమాత్రం తీసిపోవు.

★★★

### భారతీయుడు

*ఒక అమెరికా పౌరుడు లండన్ నగరంలోని ఒక రెస్టారెంటుకు వెళ్ళాడు. రెస్టారెంటు అంతా కలయజూచి, ఒక మూల కుర్చీలో కూర్చొని ఉన్న భారతీయుని గమనించాడు. ఆ రెస్టారెంటులోని సర్వరును దగ్గరకు పిలిచి, రెస్టారెంటులో కూర్చొని ఉన్న వారందరికీ రెస్టారెంటులో ఉన్న తినుబండారాలనందించు, ఆ మూలగా కూర్చొని ఉన్న భారతీయునికి తప్ప అని చెప్పి దాని బిల్లు చెల్లించాడు. దీనిని ఆసక్తిగా గమనించుచున్న భారతీయుడు బాధపడకపోగా, ప్రేమపూర్వకంగా నవ్వుతూ అమెరికా వాసికి ధన్యవాదాలు తెలిపాడు. దీనిని చూచి, అమెరికా వాసి మరింతగా రెచ్చిపోయి, రెస్టారెంటు సర్వర్‌ను ఈసారి గొంతెత్తి పిలుస్తూ అందరికి వైన్‌ను అందించమని కోరుచూ ఆ బిల్లు చెల్లిస్తూ, ఆ మూలనున్న భారతీయునికి మాత్రం ఇవ్వవద్దన్నాడు. దీనిని కూడా ఆసక్తిగా చూస్తున్న భారతీయుడు సంతసిస్తూ మరింతగా చిరునవ్వు చిందిస్తూ "ధన్యవాదాలు మిత్రమా" అన్నాడు అమెరికన్‌ను చూస్తూ. భారతీయుని చిరునవ్వుకు, అమెరికన్ మరింతగా విద్వేషాన్ని పెంచుకొని ఏమిటి? వాడు పిచ్చివాడా? అని ఏహ్యాభావంతో సర్వర్‌ను అడుగగా "లేదయ్యా! అతను పిచ్చివాడు కాదు, ఈ రెస్టారెంటు యజమాని" అని బదులు పలికాడు సర్వర్.*

*అనువాదం: ఎ. వేణుగోపాలరెడ్డి*

**బ్రాహ్మణత్వాన్ని నింపే అమృతం గాయత్రి**

21వ శతాబ్ది-ఉజ్జ్వల భవిష్యత్తు - 7

# ధర్మగ్రంథాలలో వర్ణింపబడిన భవిష్యత్కథనాలు

ధర్మగ్రంథాలను అపౌరుషేయాలు అంటారు. వీటిని ఈశ్వరీయ వాణిగా కొలుస్తారు. దివ్యద్రష్టలు, భవిష్యద్వక్తల వలే వీటిలోకూడా రానున్న సమయము గురించి చాలా చెప్పబడి ఉన్నది. ఇవన్నీ 20వ శతాబ్దము యొక్క అంతము, 21వ శతాబ్దము యొక్క ప్రారంభము రెండు యుగాలసంధి వలే ఏర్పడి రానున్న యుగము మానవజాతికి ఉజ్జ్వల భవిష్యత్తుగా రూపొందుతున్న విషయములో ఏకాభిప్రాయముతో ఉన్నాయి. ఈ సందర్భములో విభిన్న ధర్మగ్రంథాలు ఈవిధంగా చెప్తున్నాయి.

**శ్రీమద్భాగవతము :** కలియుగముయొక్క అంతము దగ్గరలోనే ఉన్నది. ఈ కాలము యుగసంధి కాలము. అంతేకాక భాగవతముయొక్క ద్వాదశ స్కంధము యొక్క రెండవ, మూడవ అధ్యాయములలో కలియుగము, దానిముందు, దానితర్వాత కాలముల లక్షణాలను విస్తారముగా వర్ణించారు. ఏవిధంగా మధ్యయుగము తర్వాత అశ్రద్ధ పెరిగి, సంస్కారశూన్యత ఏర్పడి ఆచార వ్యవహారాలు ఎలా భ్రష్టుపట్టాయో మొదటి అధ్యాయాలలో వర్ణించబడ్డాయి. 2వ అధ్యాయములో కలికాలాన్ని విశ్లేషిస్తూ శుకమహర్షి క్రొత్తక్రొత్త రోగాలు ఆవిర్భవించుట, సాంప్రదాయవాదము పెరుగుట, వ్యక్తుల మధ్య పరస్పరము అసహనము పెరుగుట ఈ కాలము యొక్క ముఖ్య లక్షణాలుగా తెలిపారు. ఈనాడు మన మందరము ఇవన్నీ చూస్తున్నాము కదా! సత్యయుగము గురించి తెలుపుతూ కలియుగాంతములో నిష్కళంకసత్తాయొక్క అవతరణ వల్ల సద్భావనలు, సాత్వికత సర్వదా అభివృద్ధి చెందుతాయి అని తెలిపాడు.

**వాల్మీకి రామాయణము :** యుద్ధకాండలో 95వ శ్లోకము నుండి 160వ శ్లోకము వరకు సత్యయుగావతరణ సునిశ్చితమని తెలుపుతూ ఆ కాలములో లోకుల వ్యవహారము, దృష్టికోణము, పరిస్థితుల గురించి వర్ణింపబడి ఉన్నది.

**హరివంశపురాణము :** ఇందు భవిష్యపర్వములో కలియుగమునకు ముందు సంధికాలం సమాప్తమగుటకు ఈ కాలమే సరైన సమయముగా చెప్పబడినది.

**మహాభారతము :** మహాభారతము యొక్క వనపర్వములో ఒక యుగము సమాప్తమై రెండవది ప్రారంభించబడేముందు ప్రపంచములో అనేకరకాల ఉత్పాతాలు జరుగుతాయని చెప్పబడినది. చంద్రుడు, సూర్యుడు, బృహస్పతి పుష్యమి నక్షత్రములో ఒకే రాశిలో కలిసినప్పుడు సత్యయుగముయొక్క శుభారంభము జరిగి సుఖప్రదమైన భవిష్యత్తు రూపొందుతుంది.

**ఓల్డు టెస్టిమెంట్‌లో :** డేనియల్ మరియు 'రెవలేషన్' అధ్యాయములలో 20వ శతాబ్దపు సమాప్తి నుండి నూతన యుగము వస్తుందని దానిముందు ప్రాకృతిక విపత్తులు మరియు మానవుల మధ్య అవగాహనారాహిత్యము చరమోత్కర్షకి చేరుకుంటుంది అని చెప్పబడి ఉన్నది. 'సెవెన్‌టైమ్స్' లో వర్ణించబడిన ఈ భవిష్యత్కథనాలను విశేషజ్ఞులైన పురాతత్త్వవేత్తలు మరియు హిబ్రూభాషా విశారదులైన డా॥ విలియం ఆల్‌బ్రైట్ మరియు జేమ్స్‌గ్రాంటులు విశ్లేషించి ఇవి సరిగ్గా 1980-2000 మధ్యకాలంలో జరుగుతాయని చెప్పారు. ఈ భవిష్యత్కథనాలలో 21వ శతాబ్దపు చివరిలో స్వర్ణయుగస్థాపన కూడా జరుగుతుందని చెప్పబడి ఉన్నది. నోస్ట్రాడేమస్ యొక్క భవిష్యద్వాణులతో ఇవి పూర్తిగా ఏకీభవిస్తాయి.

**ఇస్లాం ధర్మము :** ఈ ధర్మములోకూడా 20వ శతాబ్దము అత్యంత కష్టకాలముగా చెప్పబడినది. ఇవికూడా నేటి పరిస్థితులకు పూర్తిగా సరిపోతాయి. 'ఖురాన్ సారము' అను పుస్తకములో 'ప్రళయము తర్వాత పృథ్వీమీద ఎల్లప్పుడు పగలే ఉంటుందని, రాత్రిపూట చీకట్లు ఆవరించవని' వ్రాశారు. వీరి ప్రకారము ఈ దివ్యప్రకాశముతో విశ్వాత్మకు అద్భుతశాంతి లభిస్తుంది.

'ఇస్లాం భవిష్యకీ ఆశా' అనే పుస్తకములో శ్రీసయ్యద్‌కుల్ ఇలా అంటున్నారు. '21వ శతాబ్దపు ప్రారంభంలో విజ్ఞానము - ధర్మముల మధ్య అద్భుత సమన్వయము జరుగుతుంది. డా॥ కైరేల్ వ్రాసిన 'అజ్ఞాతమానవుడు' గురించి ఉటంకిస్తూ రానున్న కాలములో విద్యా ప్రణాళిక పూర్తిగా మారిపోతుందని భావ ప్రధానమైన విద్య ఏర్పడుతుందని చెప్పారు. ఈ శిక్షణ వలన ఆధ్యాత్మిక వాతావరణము ఏర్పడి క్రొత్త మానవజాతిగా పృథ్విపైన మహానుభావుల ప్రాదుర్భావము జరిగి తద్వారా సర్వత్రా ఏకత మరియు సమతల రాజ్యము స్థాపించబడుతుంది.

ఈవిధంగా దివ్యదృష్టి గల మహామానవులేకాక, విభిన్న ధర్మగ్రంథములు కూడా ఒకే తథ్యాన్ని సూచిస్తున్నాయి.

**గాయత్రి పరబ్రహ్మ యొక్క క్రియారూపం**

అదేమిటంటే నవయుగముయొక్క అరుణోదయ సమయ మాసన్నమైనది. ఇప్పుడు సమయప్రవాహానికి అనుగుణ్యంగా వ్యక్తి తన ఆలోచనలను మార్చుకోవాలి. లేకపోతే పరబ్రహ్మ చేతనసత్తా యొక్క దండవ్యవస్థ అతనిని దారిలోకి తెచ్చుకో గలదు. అది అలా చేస్తుందికూడా.

## ఉజ్జ్వల భవిష్య సంరచన కొరకు సంకల్పిత ప్రయత్నాలు

అవాంఛనీయతలను తొలగించి, వాంఛిత వికాసము కొరకు రాజనీతిక, ఆర్థిక, సామాజిక సంస్థల ప్రయత్నము జరిగి తీరవలసినదే! కానీ ఒక విషయము మరచిపోగూడదు. ఇటువంటి ప్రయత్నాలలో అదృశ్య జగత్తుయొక్క పాత్రకూడా చాలా మహత్త్వపూర్ణమైనది. నీటి ప్రవాహంతోపాటు చిన్ని చిన్ని పుల్లలు తదనుగుణ్యంగా కొట్టుకుపోతాయి. గాలివాటంతో నడిచేవారు తక్కువశక్తిని ఉపయోగించి తీవ్ర వేగమును పొంద గలరు. ఇందువల్లనే మహత్త్వపూర్ణకార్యముల శుభారంభము దైవీ ఆవాహనతోపాటు అదృశ్యశక్తుల సాక్షిగా చేయబడుతుంది.

ఈరోజులలో ప్రగతిపేరుమీద స్వచ్ఛందంగా చేయబడు తున్న అనేక అవాంఛనీయతల, దుష్ప్రవృత్తుల నిర్మూలన జరుగ వలసి ఉన్నది. వాటిబదులు సత్ప్రవృత్తుల సంస్థాపనకూడా జరగాలి. ఈ రెండు గొప్ప మార్పులకు ప్రత్యక్ష పురుషార్థముతో పాటు అదృశ్యసంకల్పము, సాహసము, ముందుచూపుతో కూడిన కుశలత కూడా కలసి ఉండాలి. ఇదే ఈనాటి ఆవశ్యకత. ఏవిధమైన ఆలస్యము, అసాధారణమైన అడ్డంకులు లేకుండా విశ్వవ్యాప్తంగా సంఘర్షణతో కూడిన పరివర్తన ఈ రెండింటి ఆధారంగానే జరుగుతుంది.

కాలము ప్రచండమైన వేగాన్ని సంతరించుకున్నది. వేలాది సంవత్సరాలలో జరుగనటువంటి పనులు ఈనాడు కొన్ని దశాబ్దాలలోనే జరిగిపోతున్నాయి. వంద సంవత్సరాల క్రిందట ఉన్న వ్యక్తి ఈరోజు వాతావరణాన్ని అప్పటి పరిస్థితులతో పోల్చిచూస్తే ఒక అద్భుతలోకానికి వచ్చానా? అని అనుకుంటాడు. ఇది యుగపరివర్తనలో అసాధారణ వేగము వచ్చినది అన్నదానికి ప్రతీక. రాబోయే రోజులలో ఈ ప్రవాహము ఇంకా ఎక్కువ వేగము పుంజుకుని క్రిందటి శతాబ్దాలలో వచ్చిన మార్పులకంటే రానున్న 21వ శతాబ్దిలో ఇంకా ఎక్కువ చమత్కారాలు అసాధారణరీతిలో జరుగుతాయి. అందువల్ల ఈ ఇరవై ఒకటవ శతాబ్దిలో పతనము దిశగా సాగిపోతున్న ప్రవాహం ఆగి, ఉజ్జ్వలభవిష్య నిర్మాణకార్యము తీవ్రవేగముతో జరుగుతుంది అని ప్రజాభిప్రాయము ఏర్పడినది. ఇది మహా కాలుని ప్రేరణ – ఈశ్వరేచ్ఛ – కాలము యొక్క కోరిక. దీనినే యుగధర్మము యొక్క పాంచజన్య శంఖారావము అనవచ్చు. దీనితో ప్రచండ మైన మానవీయ పురుషార్థము పెల్లుబుకుతుంది. గుర్తుంచు కోవలసిన విషయము ఏమిటంటే – దీని వెనకాతల నియంత యొక్క ప్రచండమైన ప్రేరణ మరియు సునిశ్చిత ప్రణాళిక పనిచేస్తుంది. మానవుడు స్వయముగా అల్పుడు, కానీ ఈశ్వరేచ్ఛను పాటించినప్పుడు హనుమంతుడు, అంగదుడు, నలుడు, నీలుడు మరియు భీమార్జునులు లాంటి పాత్రలు నిర్వహిస్తూ సర్వత్రా ఆశ్చర్య జనకమైన సాఫల్యములు పొందుతూ కనిపిస్తాడు. గీతాకారుడు అర్జునునితో ఇలా చెప్పాడు. 'కౌరవ సమూహమును నియతి ఎప్పుడో చంపేసింది. రాజ్యసుఖము, అక్షయయశస్సు పొంద టానికి ఎందుకు వెనుకాడుచున్నావు? సదవకాశము లభించి నప్పుడు దానిని ఉపయోగించుకునే తెలివితేటలను ఎందుకు ఉపయోగించవు? ఇటువంటి ప్రచండ ప్రేరణలు అనేకులకు లభిస్తాయి. వీరు అంతఃస్ఫురణ ఆధారంగా అసాధారణ ప్రలోభములనిచ్చి కూడా ఎవ్వరు చేయటానికి ఒప్పుకోని పనులను అతిసహజంగా చేసేస్తారు.

ఈ 12 సంవత్సరాలు గడిచేలోపల ఉజ్జ్వలభవిష్యత్తు అనే ఆకాశము నుండి వర్షించుచున్న మేఘమాలికల సమూహం అందరిని ఆశ్చర్యపరచే పరిస్థితులు, వనరులు సమకూరుస్తాయి. ఈనాడు శ్రేష్ఠప్రతిభాశాలియైన వ్యక్తియొక్క మనస్సులో ఒక ఆదర్శవంతమైన పురుషార్థము చేయుటకు ఏర్పడుతున్న ఉత్సాహాన్ని చూసి పైన చెప్పిన మాట యొక్క సత్యమును గుర్తించవచ్చు, జరుగబోయేదానిని తేలికగా ఊహించవచ్చు.

ఈ సందర్భములో ప్రపంచముయొక్క మూలమూలల నుండి తమదైన శైలిలో ఆవిర్భవిస్తున్న సృజనాత్మక తరంగాలతో పాటు అత్యంత మహత్త్వపూర్ణమైన కార్యప్రణాళిక శాంతికుంజ్ – హరిద్వార్ నుండి ప్రకటితమవుతుండగా చూడవచ్చు. ఈరోజులలోనే ఆరంభింపబడిన యుగసంధి మహా పురశ్చరణ మనే ఒక అద్భుత ప్రయోగము గమనించదగినది. దీనిని ఇదివరకు ఎన్నడు జరుగని సామూహిక సాధనా ప్రయోగమని అనవచ్చు. ఒక విశాలమైన సామూహిక ప్రయత్నము ద్వారా మాత్రమే ఉత్పన్నమయ్యే శక్తి ఈ తపశ్చర్యవల్ల ప్రకటిత మవుతుంది. **భిన్న భిన్న క్షేత్రాలలో వ్యక్తియొక్క శ్రమ మరియు సామూహిక మనోబలముయొక్క ఆశ్చర్యజనక పరిణామాలకు అనేక ప్రమాణాలున్నాయి.** ఆధ్యాత్మిక క్షేత్రములో దీని ఉదాహరణ

**గాయత్రీ సాధన సర్వశ్రేష్ఠ తపశ్చర్య**

శాంతికుంజ్ నుండి నిర్వహింపబడుతున్న యుగసంధి మహా పురశ్చరణ. యుగసంధి యొక్క ఈ 12 సంవత్సరాలలో సుమారు 24 లక్షలమంది ఇక్కడ లేక ఇక్కడినుండి సంకల్పము తీసికొని తమ తమ స్థానాలలో పురశ్చరణ ప్రక్రియను కార్యాన్వితము చేస్తారు.

**క్రొత్తగా స్థాపించబడుతున్న ప్రజ్ఞామండలాల సాప్తాహిక సత్సంగములు ఈ యుగసాధనతో జోడింపబడిన ప్రయత్నాలుగా గుర్తించాలి.**

శాంతికుంజ్‌ను యుగచేతనయొక్క గంగోత్రి అనవచ్చు. సూర్యుడు మొట్టమొదట తూర్పుదిశ వైపు బయలుదేరి అచ్చటి నుండి ముందు ముందుకు వెళ్తూ సమస్త ప్రపంచానికి వెలుగును అందిస్తాడు. గంగోత్రినుండి ప్రారంభమైన ధార బెంగాలు చేరుకునేసరికి సహస్రధారలుగా పరిణతి చెందుతుంది. ఈ యుగసాధనయొక్క శుభారంభము శాంతికుంజ్ నుండి మొదలై దాని విస్తారము దేశముయొక్క మూలమూలలకు మరియు ప్రపంచము యొక్క ప్రతిప్రాంతానికి విస్తరించడము చూడ వచ్చు. దీని ప్రభావము యుగపరివర్తనయొక్క పృష్ఠభూమిలో ఆంశిక స్థాయిలో అసాధారణ పాత్ర వహించడముగా చూడ బడుతుంది. గోవర్ధనపర్వతాన్ని ఎత్తటమనే గొప్ప పనిని అనేక మంది గోపబాలకులు తమ కఱ్ఱల సహాయంతో ఎలా చేయగలి గారో అలాంటి ఒక సామూహిక సాధనవల్ల సృజనాత్మక క్రియాకలాపాల వెల్లువగా మన ముందుకు అనేకవైపులనుండి వస్తాయి.

**ఇలాంటి కార్యక్రమానికి సరియైన స్థానమును కనుగొని అక్కడ శాంతికుంజ్ నిర్మింపబడినది. గంగఒడి, హిమాలయాల యొక్క ఛాయ, సప్తఋషుల తపోభూమి, దివ్యచేతనల సాన్నిధ్యము, అఖండదీపము, నిత్యయజ్ఞము, నిరంతరము జరిగే సాధనలయొక్క సువర్ణావకాశములు ఒకేసారి, ఒకే స్థలములో శాంతికుంజ్‌లో తప్ప ఇంకెక్కడా కనిపించవు.**

స్థలము-కాలము యొక్క నిర్ణయము ఒక అసాధారణ మహత్యమును కలిగి ఉంటుంది. మహాభారతము కొరకు కురుక్షేత్రము ఎన్నుకొనబడినది. భుసావల్ యొక్క అరటిపళ్ళు, లక్నో యొక్క జామకాయలు, నాగపూర్ కమలాలు, మైసూర్ యొక్క చందనము ప్రసిద్ధము. ఎక్కడపడితే అక్కడ వీటిని పండించగలిగినా ఆ స్థాయి రాదు. విత్తనాలు నాటేటప్పుడు సమయమును గమనించుకొనుట మంచి పంట పండుటకు అవసరము. వర్షాకాలము, వసంత ఋతువులకు అసాధారణ దృశ్యములను ఉత్పన్నము చేయుటకు తమతమ కాల అవధు లున్నాయి. ఈ ఋతువుల యొక్క విశేషతలు అన్ని కాలాలలో చూడలేము. శానిటోరియములు తగిన గాలి, నీరు ఉండే స్థలము, వాతావరణములోనే నిర్మింపబడతాయి. బ్రహ్మాండ మును అధ్యయనము చేయుటకు కోణార్క్‌లోని సూర్య దేవాల యము వంటి స్థలము చాలా ప్రత్యేకముగా ఎన్నుకోబడినది. అక్కడికి ప్రపంచములోని వైజ్ఞానికులందరు సూర్యగ్రహణముల గురించి అన్వేషించుటకు, పరీక్షించుటకు వస్తూ ఉంటారు. ఇదేవిధంగా ప్రపంచములోని అనేక స్థలాలు వాటి విశిష్టతవల్ల ప్రసిద్ధి గాంచాయి. తపస్సు చేయుటకు అనాదిగా హిమాలయ క్షేత్రము ఉపయుక్తస్థలముగా గుర్తించబడినది. శాంతికుంజ్ నిర్మించబడిన స్థలము కూడా అనేక సూక్ష్మపరీక్షల తర్వాత ఎన్నుకోబడినది.

**ఇక్కడకు వచ్చిన ప్రతి ఒక్కరు తమతమ పాత్రత మరియు అవసరములకు అనుగుణ్యముగా శక్తి, సాహసము, ప్రకాశము, ప్రేరణ పొంది తిరిగి వెళ్తారు.**

ఈ ఆధారములతో ఒక అదృశ్య ప్రేరణయొక్క సంకేతం మీద శాంతికుంజ్ చేతనయొక్క ఉద్గమకేంద్రముగా నిర్మించ బడినది. దీనిని యుగచేతనయొక్క గంగోత్రిగా గుర్తించి దాని యొక్క విశ్వవిస్తరణ ప్రక్రియ క్రియాన్వితమగుచున్నది.

దివ్యచేతన లోకకళ్యాణముకొరకు అత్యవసర వ్యవస్థను ఏర్పరచినపుడు సామాన్య సామర్థ్యము గల వ్యక్తుల ద్వారా కూడా అసాధారణ కార్యములు జరుగుట గమనిస్తాము. యుగ చేతన కనుగుణ్యముగా **సంకల్పిత ప్రయత్నాలు** చేసే వ్యక్తులకు శక్తిసామర్థ్యముల అదృశ్యధారలు వాటంతటవే జోడింప బడతాయి. గ్రద్ద-ఉడుత, కోతులు-ఎలుగుబంట్లు మొదలగు వానికి ఇదేవిధముగా జరిగింది. గోపబాలకులు, పాండవులు కూడా ఇటువంటి ప్రవాహముతోనే జోడింపబడ్డారు. బుద్ధుని యొక్క పరివ్రాజకులనుండి గాంధీగారి సత్యాగ్రహుల వరకు యీ సిద్ధాంతము వర్తిస్తుంది. **వారి సామర్థ్యములు సామాన్య మైనవి, కానీ వారి నిష్ఠలు అసామాన్యమైనవి.** నిష్ఠ ఆధారంగా దివ్యచేతనత్వము వారిని తన మాధ్యమంగా ఏర్పరచుకొని లోకకళ్యాణముకొరకు అసాధారణ పనులను చేయిస్తుంది. శాంతికుంజ్‌కు కూడా ఇటువంటి శ్రేయసౌభాగ్యములు లభించాయి.

– *అనువాదం: డా॥* మారెళ్ళ శ్రీరామకృష్ణ

**గాయత్రీ మంత్రంలోని ఒక్కొక్క అక్షరం ఒక్కొక్క దేవతాశక్తి**

సమయదానమే యుగధర్మము - 6

# ప్రభావితం చేయగల సామర్థ్యం

ఈనాడు ఏం చెప్తుంటారంటే మేము చెప్తున్న సిద్ధాంతాలను ఎవరు స్వీకరించడం లేదు. ఈ చెవితో వింటారు, ఆ చెవితో వదిలేస్తారు. ఈ సిద్ధాంతాలను ఆచరణలో పెట్టేందుకు ఎవరు సిద్ధంగా లేరు.

ఈ ఫిర్యాదు తప్పు కాదు. ఈనాడు ఉన్న ధర్మోపదేశకుల కంటే గడచిన రోజులలో ఉన్న ధర్మోపదేశకుల సంఖ్య తక్కువ కాదు, వారు కూడా ఏమి చేయలేకపోయారు, సమాజాన్ని మార్చలేకపోయారు. ఒకప్పుడు ఈ దేశంలో ప్రధానంగా ఏడుగురు ఋషులు ఉండేవారు. ఈ సంఖ్య చిన్నదైనప్పటికీ వారు ఎంత ప్రభావశీలురంటే వారు సప్తద్వీపాలనే కాక ప్రపంచమంతా ధర్మధారణ అనే గాలిని ఎలా నడిపించారంటే దానివలన ప్రభావితం కాకుండా ఎవరు ఉండలేదు. దేశములో సాధుబ్రాహ్మణుల సంఖ్య పరిమితంగానే ఉండేది. కానీ వారు స్థానికమైన సమస్యల పరిష్కారం కొరకు దేశం నలుమూలలకు వెళ్ళి కర్మ, నిష్ఠ సద్భావనలతో అనుప్రాణితం చేసేవారు. ప్రాచీన కాలంలో ధర్మప్రచారకుల చమత్కార ప్రభావం చూడగలిగి నప్పుడు, ఇప్పుడు ఆ పని చేయలేనప్పుడు దానికి పెద్ద కారణం ఉండి ఉండాలి. మొదట నీరు ఇస్తున్నటువంటి మేఘాలు ధూళిని కురిపిస్తున్నాయి. మరి ఈ ఫిర్యాదులు ఎంత సత్యమైనవి?

ఇక్కడ అర్థం చేసుకోవలసిన విషయం ఏమంటే ఉన్నతమైన వ్యక్తిత్వమే సామాన్య జనులను ప్రభావితం చేయగలదు. మామూలు మనుష్యులకు ఇంత సామర్థ్యం ఉండదు, వారి మాట ఎవరు వినరు. ఎందుకంటే వారే వారు చెప్తున్నటువంటి విషయాలు పాటించరు. అందువల్ల వారి మాటలను ఎవరు పట్టించుకోరు.

వక్త ఎత్తుగా ఉన్న స్థానంలో కూర్చుంటాడు. వినేవారు క్రింద కూర్చుంటే వినడానికి వీలుగా ఉంటుంది.

కానీ వక్త క్రింద గోతిలో కూర్చుని, వినేవారు పైన ఉంటే వినడానికి ఇబ్బంది అవుతుంది. ఆదర్శాల గురించి మాట్లాడు తున్నప్పుడు అతను వాటిని ఆచరించి ఉండాలి. లేకపోతే వారి మాటలు గాలిలో కొట్టుకుపోతాయి.

కళాకౌశలం నేర్పించేవారు ఆ విషయంలో నిష్ణాతులై ఉండాలి. స్కూలులో అధ్యాపకులు కూడా విద్యార్థుల కన్నా ఎక్కువ చదువుకుని ఉండాలి. సంగీతం నేర్పేవారి యోగ్యత కూడా అసందిగ్ధంగా ఉండకూడదు. అధ్యాపకుడికి విద్యార్థికి మధ్య ఈమాత్రం తేడా ఉంటే సరిపోతుంది. కానీ ఆదర్శాల గురించి, మార్పు గురించి, జీవితంలో పరివర్తన తీసుకు రావాలనే ప్రసంగముల ప్రస్తావన వచ్చినప్పుడు **ఇతరులకు చెప్పే మాటలు, నీతులు ముందు వారు తప్పనిసరిగా ఆచరించ వలసి వస్తుంది.** సంస్కారముల గురించి మాట్లాడుతున్నప్పుడు వక్త మాట్లాడే మాటల కన్నా అతని నిత్యజీవితంలో అతను చెప్తున్న మాటలు ఎంతవరకు ఆచరిస్తున్నాడో అని చూస్తారు. ఆడంబరంతో కాక భావన, శ్రద్ధ, నిష్ఠతో కూడిన జీవనచర్యతో కూడిన వ్యక్తిత్వమే ఇతరులను ప్రభావితం చేయగలదు. దీనిపైనే దేశం, ధర్మం, సమాజం, సంస్కృతిల అభ్యుదయం ఆధారపడి ఉంటుంది.

చెడ్డవారు పలుకుబడి ఉన్నవారయితే, సాధారణ స్థాయిగల అనేకమందిని తమ దుర్వ్యసనములలో పాలుపంచుకునేటట్లు చేస్తారు. త్రాగుబోతుల మండలులు తయారవుతాయి. దొంగలు, తిరుగుబోతులు కూడా కలుస్తారు. ఎందుకు వీరు ఇలా కలుస్తారంటే ఇక్కడ సూత్రసంచాలకుడి మాటలు, చేతలు ఒకే విధంగా ఉంటాయి, అవి చెడువి అయి ఉండొచ్చుగాక!

విద్యుత్తు యొక్క రెండు తీగలు కలిస్తే కరెంటు ప్రవహిస్తుంది. చెప్పేది, చేసేది ఒకటి అయినప్పుడు మన ఉపదేశాలకు శక్తి వస్తుంది. లేకపోతే అతను చెప్పే మాటలు పాటించవలసిన అవసరం లేదని ప్రజలు భావిస్తారు. వక్త అనేక విషయాలలో మార్పులు తెచ్చుకోవాలని, వాటిని పాటించడం వలన జీవితంలో మంచి మార్పులు వస్తాయని చెప్తున్నప్పుడు, అతని ఆచరణలో అవి ఎందుకు రావడం లేదు? ఈ ప్రశ్నకి సమాధానం నాలుగు మాటలలో చెప్పవచ్చు. ఈ కథనం వ్యావహారికమైనది అయి

**గాయత్రీమంత్ర సాధన మనిషిని ఋషిగా మారుస్తుంది**

ఉండదు, మార్పు సంభవం కాదు. సామాన్య జనులు పాటిస్తున్న రీతిరివాజులు సరియైనవే. మార్పు రావాలనేవాడు, దానికి మార్గదర్శనం చేసేవాడు వాటిని స్వయంగా ఆచరించక పోయి నప్పుడు ఆ చెప్పున్నవాడిని దొంగ అని అనవచ్చు. ఇతరుల చేత గౌరవించబడాలని కానీ స్వయంగా నికృష్ట జీవనం జీవిస్తూ స్వార్థపరులు పొందాలనుకునే లాభాలను పొందాలని చూస్తారు. ఇలాంటివారి ఉపదేశాలపై సాధారణ జనులకు నమ్మకం ఉండదు.

లాయర్లవలే వాదించడం వలన ఆలోచనలలో క్రాంతి (విచారక్రాంతి) సాధ్యం కాదు. మహాఅయితే భ్రాంతులు తొలగిపోవచ్చు కానీ ఆచరణలోకి ఇవేవి రావు. వారి వెనుక వ్యక్తిగత స్వార్థం, ఇతరులను పట్టించుకోకపోవటం వంటి గుణాలు కూడా మారువేషంలో పనిచేస్తుంటాయి. తమ కూతురి పెళ్ళి సమయంలో కట్నాలు తీసుకోకూడదంటారు. కానీ తమ కొడుకు పెళ్ళిసందర్భమున వీలయినంత గుంజాలని చూస్తారు. "ఖర్చుతో కూడిన ఆడంబర వివాహాలు మనలను దరిద్రులుగా చేస్తాయి, సమాజానికి చేటు చేస్తాయి" అని ఉద్ఘోషించేవారు కూడా సమయం వచ్చినప్పుడు మాట మార్చేస్తారు. మహత్త్వపూర్ణమైన కార్యక్రమం నవ్వులపాలవుతుంది.

**ధర్మోపదేశకులు వారు చెప్పే విషయాలను పాటిస్తుంటే వాటిని అనుసరించేవారికి కొదవ ఎందుకు ఉంటుంది?** నానక్, కబీర్ వంటి సంతుల ప్రామాణికత, ప్రఖరత భావనాశీలురని అసాధారణ రూపంలో ప్రభావితం చేశాయి, కష్టనష్టాల గీటురాయిపై నిలబడే అసంఖ్యాకులు వారి అనుయాయులు అయ్యారు.

ప్రస్తుతం ఉన్న కష్టాలను నివారించుకోవడానికి ముందుగా లోకమానసంలో ఉన్న భ్రాంతులను తొలగించి, వివేకశీలత కలిగించడానికి తర్కము, తథ్యము, అనుభవము ప్రమాణము లను ఉపయోగించాలి. ఇదే విచారక్రాంతి (విచార క్రాంతి అంటే ఆలోచనలలో క్రాంతి). దీని రెండవ చరణము క్రియాత్మ కమైన పరివర్తన. దీనిని దుష్ప్రవృత్తుల ఉన్మూలన, సత్ప్రవృత్తుల సంవర్ధనం అని కూడా అనవచ్చు. ప్రవాహాన్ని ఆపడానికి, దానిని తిరిగి వెనుకకు మళ్ళించడానికి సాహసంతో కూడిన పురుషార్థం అవసరమవుతుంది. ప్రతిభా పరిష్కారం అంటే ఇదే. (ప్రతిభా పరిష్కారం అంటే ప్రతిభను వికసింపచేయడం).

ఈ రెండు చరణాలతో మహాక్రాంతి లక్ష్యాన్ని సాధించవచ్చు. సత్యయుగం కొరకు తగిన వాతావరణాన్ని ఈ ఆధారాలపై తయారు చేసుకోవాలి.

దీనికొరకు ప్రాణవంతులైన సాహసవంతుల, ప్రతిభా వంతుల భావపూర్వకమైన సమయదానం అవసరమవుతుంది. సమయదానాన్ని సర్వోత్కృష్ట దానమని ఎందుకు భావిస్తారంటే – ఈశ్వర ప్రదత్త సమయము, శరీరగత పురుషార్థము, ప్రత్యక్ష రూపంలో శ్రమ, అంతఃకరణ యొక్క భావసంవేదనలు కలసి నప్పుడు ఈ ప్రక్రియ శక్తివంతంగా తయారవుతుంది. సమయం, శ్రమ, సంకల్పముల సమన్వయం ఉన్న సమయదానం యొక్క ప్రభావము అపారము. ఇటువంటి సమయదానం యుగ పరివర్తన అనే మహాప్రక్రియను సాధించగల సమర్థత కలిగి ఉంటుంది.

– *అనువాదం: ముక్కామల రత్నాకర్*

## స్వర్గ ద్వారాలు

*ఒక ఫకీరు కరుణాభరితమైన ప్రార్థనను చేస్తూ ఓ ప్రభూ! నీ ద్వారాలను తెరచి నేను నీ వద్దకు రాగలిగేటట్లు అనుగ్రహించమని కోరుతున్నాడు. ఈ ఆర్తనాదం అటుగా వెళుతున్న రబియా చెవిన పడింది. ఆమె ఫకీరును సమీపించి, సోదరా! ప్రభువు యొక్క ద్వారాలు వాస్తవానికి మూయబడి ఉన్నాయా? కొద్దిపాటి పారమార్థిక భావనలను వికసింప చేసికొని జాగ్రత్తగా చూడు. అతన్ని చేరుకొనే ద్వారాలు సదా తెరువబడి ఉన్నట్లు నీకే అర్థమవుతుంది. ఎవరైతే ప్రభు మందిరాన్ని చేరుకోవాలని కోరుకుంటారో వారు పారమార్థిక భావనలతో ఆయన్ని సునాయాసంగా చేరగలరు. ముందు ఆయన మందిరాన్ని చేర్చే ద్వారాలు మూయబడి ఉన్నాయనే భ్రమను వదలిపెట్టు. ఎవరి రోమ రోమంలో విశ్వకళ్యాణకారకమైన భావనలు సదా సంచరిస్తాయో, పరుల పట్ల ఎవరైతే ఉదారులై ఉంటారో వారి రాకకోసం ప్రభువు తెరువబడిన ద్వారం ముందు నిలబడి ఎదురు తెన్నులు చూస్తూ ఉంటారు" అని రబియా వాస్తవిక సత్యాన్ని ఫకీరుకు బోధ చేసింది.*

– ప్రజ్ఞాపురాణం నుండి
అనువాదం: *శ్రీమతి గౌరీ సావిత్రి*

**గాయత్రి భూలోకపు కల్పవృక్షం**

**అశ్వమేధ యజ్ఞం - దేవ సంస్కృతి దిగ్విజయ యాత్ర-4**



# పశుబంధ యజ్ఞములు

మన పూర్వీకులు, ఋషులు కనిపెట్టి మనకు వారసత్వముగా ఇచ్చిన దివ్యమైన యజ్ఞ విధానాలలో అనేక అపశృతులు మనం జ్ఞానవిహీనులమై కలిగించుకున్నాము. వాటిలో ఒకటి యజ్ఞములలో చేసే పశుహింస. వారిచే ఎంతో ఉచ్ఛభావాలతో, నిగూఢ సంకేతాలతో, సూక్ష్మబుద్ధిచే చెప్పబడిన ఎన్నో విషయా లను మనలో పరిపూర్ణ ఆధ్యాత్మికవిద్య అవగాహన లేని కారణంగా తప్పుగా అర్థం చేసుకున్న ఫలితమే యజ్ఞాలలో జరుగుచున్న, జరిగిన అనేక రకాల పశువధలకి కారణం.

పశుబంధ యజ్ఞాలలో జరిగేటటువంటి పశువుల వధ బాహ్య పశువుల వధ కాదు. మన సంస్కృతిలో జీవహింస మహాపాపం అని చెప్పారని మనం నిరంతరం గుర్తుంచుకోవాలి. యజ్ఞవిధానంలో చెప్పబడింది ఏమనగా, మన శరీరములో ఉన్నటువంటి అనేక పాశవీ ప్రవృత్తులను చంపేయాలని అర్థము.

పశువులను ఎప్పుడైతే యజ్ఞ విధానములో చంపివేయాలని చెప్పబడిందని తప్పుగా అర్థం చేసుకున్నారో, అప్పుడే **"వైదికి హింసా హింసా న భవతి"** అని అనడం మొదలుపెట్టారు. యజ్ఞములో హింస చేస్తే అది హింస కాదు అనేటటువంటి మూర్ఖత్వంలో పడినటువంటి మహాపండితులు ఉన్న దేశములో మనము ఉన్నాము.

అలాగే యజ్ఞములలో చెప్పబడిన **"అజమేధము" అంటే ఏదైతే సంయమము లేని కామవాసన ఉన్నదో, నియంత్రణ లేని ఇంద్రియలోలుకత ఉన్నదో దానిని తీసివేయడం** అని అర్థం. దానిని నియంత్రించడం అంటే దానిని చంపి వేయడమే.

అనేక కర్మకాండలలో కొన్ని జంతువులను బలి ఇచ్చేటప్పుడు వాటిని నెమ్మది నెమ్మదిగా కోస్తారు. ఒక్క వేటుతో చంపేస్తే వదిలిపోతుంది. మెల్లిమెల్లిగా కోయడంలో అంతరార్థం ఏమంటే – నీవు ఒక్క రోజులో నీ కోరికలను, నీ పాశవిక ప్రవృత్తులను వదిలించుకోలేవు, నెమ్మది నెమ్మదిగా వదల్చుకోమని చెప్తే, అది అర్థం చేసుకోకుండా నాలుక రుచి కొరకు తిండి తినే వ్యక్తులు–ధార్మికులము అని భ్రమించే స్థితిలో ఉన్నవారు దానిని వాళ్ళ పాశవిక ప్రవృత్తిని మార్చుకోలేక అలా చేసుకుంటూ వచ్చారు.

మనం ముఖ్యంగా గ్రహించవలసిన విషయం ఏమంటే **ఎక్కడ ఏ విధమైన పశువుని చంపమన్నా – అది మనలోని పాశవిక ప్రవృత్తులను నెమ్మది నెమ్మదిగా దూరం చేసుకోండి** అని అర్థం చేసుకోవాలి.

గొఱ్ఱెలను బలి ఇవ్వడం అనే దానిలో అంతరార్థము ఏమంటే సూర్యమార్గమును ఛేదించు అని. మేషము అంటే గొఱ్ఱె. మేషరాశి ద్వాదశరాశులలో మొదటి రాశి. మేషరాశికి అధిపతి సూర్యుడు. దక్షిణాయణ, ఉత్తరాయణ మార్గములో సూర్యుడు సంచరిస్తున్నప్పుడు ఆ సూర్యమార్గాన్ని ఛేదించాలి. భీష్ముడు తను ఉత్తరాయణ మార్గములో ప్రవేశిస్తే తప్ప ప్రాణములను వదలను అని భీష్మించుకున్నదానిలో అంతరార్థం ఏమిటి? మోక్షము యొక్క కామన ఉన్నవారు సూర్యమార్గము ద్వారా వెళతారు అని చెప్పబడింది. ఇదంతా ఆ గొఱ్ఱె యొక్క బలిలో సంకేతముగా గోచరిస్తుంది.

గోమేధ యజ్ఞము అనేది మన ఋషులు చెప్పిన యజ్ఞములలో ఒకటి. **గోమేధములో 'గో' అనగా వాక్కు, వాణి. గోమేధములో చెప్పబడినది ఏమనగా వాక్కు యొక్క దురుపయోగాన్ని నివారించండి అని.** వాక్‌శక్తిని దురుపయోగం చేసి మానవ జాతి ప్రస్తుతస్థితికి వచ్చింది. కానీ వాక్‌శక్తి కోరికలు తీర్చగలదు. నా వాక్కు ప్రపంచానికి ఔషధిగా పని చేయాలి అనేది వేదముల యొక్క వాక్కు. వేదవాణి ప్రపంచము మొత్తానికి ఔషధముగా పని చేస్తుంది.

అందుచేత వాక్కు మీద కఠోర సంయమము ఉండాలి. మౌనంగా ఉండండి అంటే ఉండలేకపోతున్నారు. ఇతరులను ఏడిపించటానికి మౌనంగా ఉంటాడు. **అందముగా, మృదువుగా మాట్లాడడం గోమేధం.** వాక్కు యొక్క సంయమము. అంతకంటే ముఖ్యం విశుద్ధిచక్రముపై పరిపూర్ణ ఆధిపత్యం. అంటే 16 సంయమములు, 16 స్వరాల మీద ఆధిపత్యం. అ నుండి అః వరకు. ఈ అర్థము వదిలేసి గోమేధయజ్ఞములో ఆవుని

**గాయత్రి భూలోకపు కామధేనువు**

చంపుతామంటే ఎట్లా? స్వర్గీయ వాతావరణం కావాలనుకునే వారు ఆవులను చంపుతారా? వాక్ సవ్యంగా ఉంటే, **వాక్కు మృదుమధురంగా ఉంటే అదే స్వర్గం. వాక్కు స్వర్గీయ వాతావరణాన్ని నిర్మిస్తుంది.** గోమేధ విజేత అంటే వాక్కు మీద విజేత. యజ్ఞకర్మకాండ అంతగా తెలియకపోయినా, మాటలు తేనెల మూటలు అవ్వాలనే కోరికను ఆ వేదమంత్రాలలో పట్టుకుంటే నిజంగా ప్రపంచము స్వర్గంగా మారుతుంది.

యజ్ఞములలో హింస అసలు జరుగదు. యజ్ఞమునకు ఇంకొక పేరు అధ్వరము. అంటే హింస జరుగనటువంటి స్థలము అని. కానీ ఎక్కడో దెబ్బతిన్నాము. గోమేధము అంటే ఆవుని చంపాలని, నరమేధం అంటే మనిషిని చంపాలని, అశ్వమేధం అంటే గుఱ్ఱాన్ని చంపాలని...

**"అశ్వమేధం అంటే బాహుబల బుద్ధిబల సమ్మిశ్రణము."** దానిని గురించి దేవీరామ్‌జీ అనే మహానుభావుడు, సాత్విలేకర్ అనే వేదపండితుడు ఇలా చెప్పారు. మానవ శరీరములో సత్ప్రవృత్తులు అనే దేవతలు, దుష్ప్రవృత్తులు అనే రాక్షసులు ఎప్పుడు కలిసే ఉంటారు. మానవ శరీరములో ఈ ప్రవృత్తులు రూపరహితంగా ఉంటాయి. అవే బాహ్యజగత్తులో సాకారం అయినప్పుడు దుష్ప్రవృత్తులు రాక్షసులుగా, పశువులుగాను; సత్ప్రవృత్తులు దేవతలుగా, దేవతాశక్తులుగా మూర్తీభవిస్తాయి. ఈ దుష్ప్రవృత్తులే మనలను తిరిగి పశుయోనులలోకి తీసుకు వెళతాయి. దీనికి షిరిడి సాయి చరిత్రలో మంచి ఉదాహరణ కనిపిస్తుంది. **ఎప్పుడెప్పుడు ఇంద్రియాలకి లొంగిపోతారో అప్పుడప్పుడు పశువులుగా జన్మించే పరిస్థితులు వస్తుంటాయి.** ఈరోజు ఎన్నిసార్లు పశుప్రవృత్తితో తిన్నాను, ఎన్నిసార్లు పశు ప్రవృత్తితో ఆలోచించాను, ఎన్నిసార్లు పశుప్రవృత్తితో మాట్లాడాను? మనలో ఎన్ని పశుప్రవృత్తులు ఉన్నాయి? ఎక్కడెక్కడ స్వలాభాపేక్ష ఉన్నదో, ఎక్కడెక్కడ మన లాభాన్ని మనసులో ఉంచుకుని ఇతరులకు సలహా ఇచ్చినా అది పశుప్రవృత్తియే.

చదువుకోవాలని ఉన్నది, చదువుకోలేకపోతున్నాను. జపం చెయ్యాలని ఉన్నది, చేయలేకపోతున్నాను. ప్రొద్దునే లేవాలని ఉన్నది, లేవలేకపోతున్నాను. ఆహారము మార్చుకోవాలని ఉన్నది, మార్చుకోలేకపోతున్నాను. దీని అంతరార్థం ఏమిటని ఎవరికివారు సీరియస్‌గా ప్రశ్నించుకుంటే, లభించే జవాబు మనల్ని సరియైన మార్గములోకి తీసుకువెళ్తుంది. అన్ని పరిస్థితులకు నీవే కారణము. **చెడు జరిగినా, మంచి జరిగినా నీవే కారణము.** ఫలానా వానివల్ల ఈ కష్టాలు వచ్చాయి. ఎవరివల్ల రావు. నీ కర్మఫలమే నీకు లభిస్తుంది. కొడుకుకి ఉద్యోగం లభించలేదు. వాడికి అదృష్టం లేదు. వీడు అదృష్ట వంతుడు అయినట్టు. వీడు అదృష్టవంతుడైతే ఆ దురదృష్ట వంతులు వీడికి ఎందుకు పుడతారు అనే ప్రశ్నకూడా రాదు. ఇవే దుష్ప్రవృత్తులు. దుష్ప్రవృత్తులే చాలా సరియైనవిగా కనిపిస్తాయి. అత్తగారి వల్ల బాధపడుతున్నాను. ఈ కొడుకు వల్ల బాధపడుతున్నాను. **నీవు ఎవరి వల్ల బాధపడడం లేదు. జీవించడం చేతకాక బాధపడుతున్నావు.** ఎప్పుడైతే నేనే ఇదంతా చేసుకున్నానని అర్థం అవుతుందో మీరే సవ్యమైన మార్గములో పడడానికి ప్రయత్నిస్తారు. కర్మసిద్ధాంతం ఇదే చెప్తుంది.

బాహ్య జగత్తులో కనిపించే పశువులన్నీ కూడా మన శరీరములో ఉన్న పశుప్రవృత్తులే. గ్రద్ద గర్వానికి ప్రతీక. ఇది జాగ్రత్తగా గుర్తుంచుకోవాలి. దానిని తరవాత ఆసనము లలో ఉపయోగించుకుంటాము. ఎలా పశుప్రవృత్తులని దాటాలి? డేగ లోభానికి ప్రతీక. కాకా పట్టడం వలన కుక్కగా పుడతారు. అజ్ఞానములో ఉన్న వ్యక్తి మరుజన్మలో గుడ్లగూబగానో, గాడిద గానో పుడతాడు. ఎప్పుడైతే ఇలాంటి పశు ప్రవృత్తులన్నీ కూడా గుఱ్ఱం వలే శక్తివంతం అవుతాయో, దానిని సవరించడానికి అశ్వమేధం చేయబడుతుంది. **అశ్వమేధం వల్ల మానవ శరీరము లోని పశుప్రవృత్తులు, సమాజములోని పశు ప్రవృత్తులు క్షీణించిపోతాయి.**

**మేధా అనే శబ్దానికి మూడు అర్థాలు ఉన్నాయని గురువు గారు చెప్తున్నారు. 1) ఏకతా 2) ప్రేమను పెంపొందించడం, 3) హింస.** కానీ హింస అనే పదానికి విలువ ఇవ్వకుండా ఏకీకరణ, ప్రేమను పెంపొందించుకొనుటకు ప్రాముఖ్యత నివ్వాలి. మేధా అనే శబ్దానికి ఇన్ని అర్థాలు ఉండగా హింస అనే అర్థము తీసుకుని బుఱ్ఱ పాడుచేసుకొనటమే తప్పు మానవ త్వాన్ని పెంపొందించే అర్థాలకు విలువ ఎందుకు ఇవ్వడం లేదు?

గురువుగారు ఉదాహరణ ఇచ్చారు. రాజుగారు రాజ మహిషిని కలుసుకుని సభకి విచ్చేశారు. మహిషి అంటే గేదె అని అర్థం ఉన్నది, భార్య అనే అర్థము ఉన్నది. ఇంతకు రాజు గారు గేదెను కలుసుకుని వచ్చారని చెప్పుకోవాలా లేక భార్యను

**గాయత్రి భూలోకపు పరశువేది**

కలుసుకుని వచ్చారని చెప్పుకోవాలా? అది మీ బుద్ధికే వదలి వేస్తున్నానని అంటున్నారు. అక్కడి పరిస్థితిని బట్టి అర్థాలు తీసుకోవాలి. యజ్ఞం లాంటి ప్రాణశక్తిని పెంచే కార్యక్రమములో హింస అనే పదానికి విలువ ఎందుకు ఇస్తున్నారు? హింస అనే అర్థముతో మేధా శబ్దాన్ని ముడిపెట్టకండి. అజమేధం అనగానే మేక అనే జంతువుని బలి ఇస్తున్నారు. 'అజ' అనేది ఒక విశేషమైన వనస్పతి. ఒక గడ్డి లాంటిది. దాని విత్తనము లతో యజ్ఞం చేయమని చెప్తే మేకను తెచ్చి చంపుతున్నారు. సంస్కారమున్న వ్యక్తి ఏ ప్రాణికి హింస తలపెట్టడు. యజ్ఞం జరుగుతున్నప్పుడు పశువులకే కాదు, ఏ ప్రాణికి కూడా హింస జరగరాదని యజ్ఞకుండం చుట్టూ నీళ్ళు పోస్తాము, ఏదైనా పురుగు పొరపాటున దీనిలోకి వస్తుందేమోనని. అంత జాగ్రత్త తీసుకునేవాళ్ళు ఒక జంతువుని బాగా మేపి, తీసుకువచ్చి చంపమని ఋషులు చెప్పారు అనే అవగాహన మన కుసంస్కార మని మహాభారతం చెబుతుంది. అందువల్ల అశ్వమేధం అనగానే గుఱ్ఱాన్ని తెచ్చి బలి ఇచ్చే యజ్ఞముగా భావించకూడదు.

**అశ్వము :** శతపథబ్రాహ్మణములో అశ్వము అనే పదానికి అర్థము ఈవిధముగా చెప్పబడింది. పరాక్రమమే అశ్వము. రాష్ట్రమే అశ్వము. **రాష్ట్రమును (దేశమును) పరాక్రమవంతముగా చేయుటయే అశ్వమేధము. రాష్ట్రములో శక్తిని పెంచడం అశ్వమేధం. వీర్యాన్ని పెంపొందించడం అశ్వమేధం.**

ఓ విద్యుత్ మోటారు మీద 1/2 హార్స్ పవర్ అని ఉంటుంది. అంటే సగం గుఱ్ఱం కోసి పెట్టామా? ధర్మం దగ్గరకు వచ్చేటప్పటికి మామూలు కామన్‌సెన్స్ కూడా ఉండదు. కొన్ని సందర్భాలలో గోదానం ఇమ్మంటారు. గోదానం చెయ్యాలని ఉంది. రూపాయి పావలా ఇచ్చేసి ఆవుని దానం చేశాను అని తృప్తి చెందితే ఎలా? ఇస్తే ఆవుని కొని దానం చెయ్యి. లేకపోతే లేదు అని ఊరుకోవాలి. అంతేకానీ రూపాయి పావలాతో ఆవుని దానం ఎలా చేయగలవు? పెళ్ళి జరుగుతున్న సందర్భములలో, గృహప్రవేశ సందర్భాలలో సత్యనారాయణ వ్రతం చేస్తుంటారు. చాలా అద్భుతమైన కర్మకాండ. అవిచ్ఛిన్నంగా మన జీవిత విధానముతో ప్రతి మంచి పనితో లింక్ అయి ఉన్నది. ఋషుల యొక్క గొప్పతనం ఏమంటే మీకు తెలిసినా తెలియకపోయినా ఆటోమాటిగ్గా లింక్ అయిపోతుంది. పురోహితుడు మంత్రాలు చదువుతూ పోతుంటాడు. వీళ్ళు చీరల గురించి, రాజకీయాల గురించి మాట్లాడుకుంటుంటారు. పురోహితుడు ఎందుకంటే మనకి ఎలా చేయాలో తెలియకపోతే చెప్పడానికి. అతను దానిలో నిపుణుడు కనుక. అది పురోహితుడి పాత్ర. మరి పురోహితుడి చేత చేయిస్తారేమిటి? ఎంత సిల్లీగా (వెర్రిగా) ఆలోచిస్తున్నామా అని అనుకుంటే మనకే నవ్వు వస్తుంది. సత్యన్నారాయణస్వామి వ్రతం ఫలితం తెలిస్తే అన్నవరంలో రద్దీ పెరుగుతుంది, ఈ అవగాహన అశ్వమేధం. ఇప్పుడు మనము ఈ యజ్ఞ ప్రక్రియలోని భాగంగా సవ్యమైన మార్పు, దిశ ఇచ్చుకోకపోతే ఇవన్నీ ఎగిరిపోతాయి. ఇప్పటికే పోతున్నాయి. చేసుకోవడం లేదు. కారణం ఏమంటే పురోహితుడు చెయ్యడం. నువ్వు చేసుకుంటే బాగానే చేసుకుంటావు. మేధా అంటే మన పరాక్రమముతో కలిసి చేయుట.

యజ్ఞం చేస్తున్నప్పుడు హింస చేస్తున్నారు. పశువులను చంపుతున్నారు. నెత్తురు ప్రవహింపచేస్తున్నావు. చెట్లను పీకి అందులో వేస్తున్నావు. దీని వల్ల స్వర్గం వస్తుందని నమ్మితే నరకం దేని వల్ల వస్తుంది అని అడుగుతున్నాడు ఋషి. నూనె, ఎండు మిరపకాయలు, చింతపండు అవి లేకపోతే ఇక బ్రతుకు ఎందుకంటున్నాము. ఇవి మంచివి కావు అని అర్థం అయిన తరవాత మార్చుకోలేని హీనస్థితిలో ఉన్న మానవజాతి చేతనత్వాన్ని అశ్వమేధముతో మార్చగలుగుతాము అంటున్నారు గురువులు. వేదములలో అశ్వమేధమును మహాక్రతువుగా వర్ణించారు. ఇది ఒక విరాట్ ప్రయోగము. చాలా విశాలమైన ప్రయోగము. ఇది ఏ రాష్ట్రములో జరుగుతుందో ఆ రాష్ట్రము లోని సమస్త మానవులను అందులో ఏదోవిధముగా పాలు పంచుకునేటట్టు చేసే ప్రయోగములో అందరు పాలు పంచుకోవాలి.

ఈ సామూహికముగా పాల్గొన్న వ్యక్తులు ఆ రాష్ట్రానికి ఏ దైవీ శక్తుల అవతరణ జరగాలో ఆ దైవీ శక్తులను సామూహి కముగా క్రిందకు దింపే ప్రయత్నం చేయాలి. దీని కొరకు గాయత్రీ మంత్ర ఉపాసన చేయిస్తున్నాము. సూర్యశక్తి ఉపాసన చేయిస్తున్నాము.

దేవత అంటే వెలుతురు ఇచ్చేది అని, శక్తినిచ్చేదని అర్థము. కానీ మనం దానికి ఐదు శిరస్సులు ఉన్నాయా, ఒక శిరస్సు ఉన్నదా, రెండు చేతులున్నాయా, పది చేతులున్నాయా అని అనుకుంటున్నాము తప్ప సరియైన అవగాహన రావడం లేదు.

**గాయత్రీ మంత్రం మనిషిని దేవతగా మారుస్తుంది**

భగవంతుడి గురించి మాట్లాడుతున్నప్పుడు గానీ, ధర్మం గురించి మాట్లాడుతున్నప్పుడు గానీ వ్యక్తులను గురించి మాట్లాడడం లేదు. ఒక విశేషమైన చేతనత్వ స్థాయి గురించి మాట్లాడుకుంటు న్నాము. ఉదాహరణకి - అతను నిద్రాదేవి ఒడిలోకి జారు కున్నాడు. అంటే బొమ్మ ఎలా వేస్తాము? ఒక అందమైన స్త్రీ బొమ్మ వేయాలి. ఆవిడ ఒడిలో వీడు శిరస్సు పెట్టి పడుకోవాలి. కానీ అదా జరిగేది. నిద్రాదేవి ఒడిలోకి వెళ్ళేటప్పుడు చేతనత్వం మారుతుంది. చేతనత్వం మారేటటువంటి పదములను మేధా అంటాము.

**మేధా అంటే చేతనత్వములో మార్పు.** నరమేధము -వ్యక్తి చేతనత్వములో మార్పురావాలి. సర్వమేధము-అన్ని రకాల చేతనత్వములలో మార్పు రావాలి. గోమేధము- ఇంద్రియములు, సూర్యకిరణాలు, వాక్కుని చేతనత్వములో ఉపయోగించుకొనుట. శ్రీకృష్ణుని మొత్తం జీవితము గోమేధమే. దత్తాత్రేయునిది కూడా గోమేధమే. గోమేధము అంటే వాక్కు యొక్క చేతనత్వము. వాక్కు యొక్క చేతనత్వములో మనం జీవించుట లేదు. మాటలు మాట్లాడుతున్నాము కానీ మాటల ఆవిర్భావం ఎలా జరుగు తున్నది? వాక్కు యొక్క చేతనత్వ స్థాయిలు అర్థం చేసుకోవాలి. అవి 1) వైఖరి, 2) మధ్యమ, 3) పశ్యంతి, 4) పరా. వైఖరీ వాణిలో ఈ నాలుగు చేతనత్వాల గురించి చెప్పు కుంటాము. నోటితో వైఖరీవాణితో చెప్తున్నాను. మీ యొక్క భౌతికమైన కర్ణేంద్రియాలతో వింటున్నారు. మిగిలిన మూడు స్థితుల గురించి తెలుసును అనే అపోహ వస్తుంది. అవగాహన లేదు. అవగాహన ఉంటే ఉపయోగించుకోగలగాలి. అదే తప్పు మేధాశబ్దములో కూడా జరుగుతున్నది.

మేధా అంటే చేతనత్వములో మార్పు. చేంజ్ ఆఫ్ కాన్‌ష్యస్‌నెస్. చేతనత్వములో మార్పుని యజ్ఞ విధానం అంటున్నాము. తల్లి గర్భములో ఉన్న వ్యక్తి భౌతిక జగత్తులోకి ప్రవేశించి 60, 70 ఏళ్ళు జీవించి శరీరాన్ని వదిలివేస్తాడు. కానీ శరీరము చనిపోయినా వ్యక్తి చనిపోలేదు.

**వాసాంసి జీర్ణాని యథా విహాయ**
**నవాని గృహ్ణాతి నరోపరాణి**
**తథా శరీరాణి విహాయ జీర్ణా**
**న్యన్యాని సంయాతి నవాని దేహీ** *- (భ.గీ 2-22)*

**అర్థము:** మానవుడు జీర్ణవస్త్రములు త్యజించి నూతన వస్త్రములు ధరించినట్లు జీవాత్మ పాత శరీరములను వీడి నూతన శరీరములను పొందును. శ్లోకం చదువుతాము. కానీ శరీరము లేని చేతనత్వము గురించిన మేధ లేదు. ధారణ లేదు, అవగాహన లేదు. మేధ అనేది శరీరము మీద ఆధారపడకుండా ఉండేటటువంటి అనుభూతి. యజ్ఞప్రక్రియ ద్వారా మాత్రమే చేతనత్వములో మార్పులు వస్తాయి. వేరే విధానంలేదు. ఇప్పుడున్నటువంటి మానవజాతి చేతనత్వములో మార్పు రావడానికి కావలసిన స్థితికి వచ్చింది. కానీ నేర్చుకోవడం లేదు. ప్రమాదం అక్కడ జరుగుతున్నది. చేతనత్వం గురించి మాట్లాడుకునే స్థాయికి మనిషి వచ్చినప్పటికి జంతు స్థాయి నుండి ఎదగలేకపోతున్నాడు.

యజ్ఞం యొక్క విశేషత ఏమంటే వ్యక్తిగత చేతనత్వమే గాక సమాజము యొక్క చేతనత్వాన్ని మార్చగలమా? దిశ మార్చగలమా? అశ్వమేధయజ్ఞ ప్రణాళిక వేసినటువంటి ఋషులు ఏమి చెప్పారంటే అశ్వమేధ యజ్ఞాన్ని మూడు స్థితులలో ఉపయోగించుకుంటే కచ్చితముగా ప్రపంచాన్ని మార్చి వేయవచ్చు. అవి

1) ప్రయాజ: యజ్ఞము ముందు చేయవలసిన పనులు.
2) కర్మకాండ: యజ్ఞం యొక్క కర్మకాండ ఐదు రోజుల పాటు చేసేది.
3) అనుయాజ: కర్మకాండ అయిపోయిన తరవాత చేయవలసిన పనులు.

వర్షం కురిపించడానికి యజ్ఞమే. పిల్లలు కావాలంటే యజ్ఞమే. రోగాణువులతో యుద్ధం నివారించాలంటే యజ్ఞం తప్ప ఇంకో మార్గం లేదు. ఈ యజ్ఞ విధానానికి విస్తృతమైన ప్రచారం ఇచ్చి ఇంటింట సంక్షిప్త గాయత్రి హవన విధిని గురుదేవులు చేయించారు. వారి మనస్తత్వం ఎలా ఉంటుందంటే మానవజాతి ఎంత చెప్పినా ఇంత మేధతో యజ్ఞాలు చేయలేరు. కర్మకాండ ఇచ్చాము. మంత్రం ఇచ్చాము. యజ్ఞములు జరుగుతూ ఉంటాయి. ఇలా దాదాపు 50 సంవత్సరాల నుంచి జరుగుతున్నది. ఇప్పుడు కొంతమందైనా యజ్ఞములను అవగాహనతో చేయాలి అని గురువులు కోరుకుంటున్నారు. యాంత్రికంగా చేయకండి.

*- డా॥ మారెళ్ళ శ్రీరామకృష్ణ మాస్టారుగారి ఉపన్యాసముల నుండి*
*సేకరణ: ముక్కామల రత్నాకర్*

**సర్వసిద్ధులకు జనని గాయత్రి**

## మాతా భగవతీదేవిశర్మ దివ్యచరిత్ర-3

# బాల్యలీలలు



స్వజనులతో గడిపిన ఈ చిన్నతనపు ఘడియలు చాలా తియ్యటి గుర్తులు. అప్పుడప్పుడు ఈ సంఘటనలలో అలౌకికత్వము తొంగిచూసేది. భగవతి తన తల్లికే కాక అన్నదమ్ములందరికి చాలా ముద్దు. అతి సామాన్యమైన రూపము, రంగు ఉన్నప్పటికీ ఆమెలో ఒక దైవత్వంతో కూడిన ఆకర్షణ ఉండేది. చుట్టుప్రక్కలవాళ్ళు, బంధువులు, మిత్రులు ఈ దైవీ ఆకర్షణకు లోనయ్యేవారు. ఆమె వీరందరికి అతి ప్రియమైన 'లాలి!' వ్రజ క్షేత్రంలో ఆ శబ్దము అత్యంత ప్రేమాస్పదమైన చిన్న పిల్లలకి వినియోగించేవారు.

జన్మనిచ్చిన తల్లి రామప్యారీ, తండ్రి జస్వంతరావు, అన్నలు దీన్‌దయాల్ మరియు సున్‌హరిలాల్, అక్క ఓంవతీ అందరు ఆమెను లాలీ అనే పిలిచేవారు. చుట్టుప్రక్కలవాళ్ళ నాలికల మీద ఈ సంబోధనే ఆడుచున్నది. లాలి అందరిది. అందరి ప్రేమ సహజంగానే ఆమె మీద కురిసేది. చిన్నపిల్లలు సాధారణంగా అల్లరిచేస్తూ, చంచలంగా ఉంటారు. కానీ ఈ లక్షణాలేవీ ఆమెలో లేవు. అత్యంత అమాయకత్వంతో కూడిన అత్యంత శాంత ప్రవృత్తి ఆమెది. చిన్న చిన్న అడుగులు వేస్తూ మాట్లాడటము మొదలుపెట్టగానే అమ్మను అమ్మ అని, తండ్రిని పితాజీ అని పిలవడము నేర్చుకున్నది. చిన్ని అడుగులు వేస్తూ వచ్చే తమ ప్రియమైన లాలిని జస్వంతరావు అత్యంత ప్రేమతో ఎత్తుకునేవారు. ఆమె ప్రతీ కోరికను తీర్చడము తన అదృష్టంగా భావించేవారు. ఆయనకు ఆమె-ఆయన యొక్క దివ్య అనుభూతుల సాకారరూపంగా కన్పించేది.

కాలము అనే రథము మీద స్వారీ చేస్తున్న భగవతి యొక్క చిన్నతనము నలువైపులా వాతావరణంలో జీవితము యొక్క మధుర సంగీతము సృష్టిస్తూ ముందుకు సాగుతున్నది. ఈ మాధుర్యములో హఠాత్తుగా ఒక విషాదస్వరము పలికింది. జన్మధాత్రిమాత తన ప్రియమైన లాలిని నాలుగు సంవత్సరముల వయస్సులో వదిలేసి కన్నుమూసింది. కేవలము జ్వరము వలన మాత్రమే ఆమె అసువులు బాసింది. భగవతి యొక్క బాలనేత్రములలో కన్నీళ్ళొచ్చాయి. ఆ చిన్ని హృదయంలో భావనల తుఫాను రగిలింది. మాతృ వియోగం యొక్క ఆ ఘడియలు ఆమెకు చాలా దారుణంగా ఉన్నాయి. నాలుగు సంవత్సరాల పిల్లకు తల్లే కదా అంతా. ఆ తల్లే లేక పోతే? కానీ నిజము నిజమే కదా! తన తల్లి యొక్క జ్ఞాపకాలలో ఆమె చాలా రోజులు ఏడ్చింది. కానీ ఈ అత్యంత బాధాపూరిత సమయంలో కూడా ఆమె ఆంతరిక చేతన సక్రియముగా, సచేతనంగా ఉన్నది. అక్కకి, అన్నలకి ఇది చాలా ఆశ్చర్యముగా ఉండేది. ఎందుకంటే అప్పుడప్పుడు ఈ చిన్న లాలి వాళ్ళను ఓదార్చేది.

అప్పుడప్పుడు ఆమె ఏమీ మాట్లాడకుండా మఠము వేసుకుని కూర్చునేది. ఆమెను ఇటువంటి భావమగ్నదశలో చూసిన కుటుంబసభ్యులకు ఆశ్చర్యంగా ఉండేది. వారికి ఈమె యొక్క ఆంతరిక పరిస్థితిని గురించి ఏమీ తెలియదు. ఇంత చిన్నపిల్ల ఎందుకు ఏకాంతములో ఇంత శాంతముగా కూర్చుంటున్నదో అన్నది. వారి ఆలోచనలకు అందేది కాదు. ఒకరోజు పెద్దన్న దీన్ దయాల్ ఆమె ఇలా కూర్చుండుట చూసి అడిగాడు – 'లాలి! నీవెందుకు ఇంత శాంతముగా కూర్చుని ఉంటావు? మిగతా పిల్లలతో పాటు ఎందుకు ఆడుకోవు? ఎప్పుడు ప్రపంచ భారము మొత్తము నీమీదే ఉన్నట్టు కూర్చుంటావు?' శాంతి నిండిన పెద్ద పెద్ద కళ్ళతో పెద్దన్నను చూస్తూ ఆ ప్రశ్నకి ఆమె ఇలా జవాబిచ్చింది. "నిజమంతే కదా! మొత్తము ప్రపంచ భారము నామీద కాక ఇంకెవరి మీద ఉంటుంది?" ఈ మాటలు దీన్‌దయాళ్ కేమీ అర్థము కాలేదు. కానీ ఈ వాక్యాలు ఆమెకు చిన్నతనమునుంచే ఆమె భవిష్యత్తు బాధ్యతలను గురించి పరిపూర్ణ జాగరూకతతో ఉన్నది అనే సత్యాన్ని తెలుపుతున్నాయి.

ఈరోజుల్లోనే దీన్‌దయాళ్‌కు పెళ్ళయ్యింది. అతని భార్య అనగా భగవతీ యొక్క పెద్ద వదిన చాలా స్నేహశీల స్వభావము

**గాయత్రీ మంత్రం ఒక సామూహిక ప్రార్థన**

కలది. మరియు ప్రేమపూర్ణ హృదయము కల స్త్రీ. తన చిన్నారి మరదలిని చాలా ప్రేమతో పెంచింది, జాగ్రత్తగా చూసుకుంది. ఆమె హృదయానికి నిరంతరము నా చిన్నారి మరదలు ఒక దేవి అని అనిపించేది. తన మరదలు యొక్క పారదర్శక కళ్ళలో ఆమెకు అలౌకికమైన పారలౌకికమైన కాంతి కనిపించేది. తన మరదలు అనే మాటలతో ఆమె యొక్క ఈ విశ్వాసము ఇంకా సుదృఢమయ్యేది. అలాంటి ఒక సంఘటన ఆమె (వదిన) తండ్రి ఆమెను తీసుకువెళ్ళేటప్పుడు జరిగింది. 10, 15 రోజుల క్రిందట వ్రాయబడిన ఉత్తరము అందినది. దానిలో ఆయన సునిశ్చయంగా వచ్చి తీసుకువెళ్ళే తారీఖు ఇవ్వబడినది. కానీ ఆరోజు ఆయన రాలేకపోయారు. ఏ విధమైనటువంటి కబురు రాలేదు. అందువల్ల ఆమె(వదిన) చాలా బెంగగా ఉండేది. ఎవరికీ ఏమీ చెప్పకపోయినా చాలా ఉదాసీనంగా ఉండేది. ఇంటి పనులను, బాధ్యతలను నిర్వహిస్తూ ఆమె ప్రతిక్షణము ఆవేదన చెందుతుండేది. మనస్సులోని ఈ బాధ ముఖములో ప్రతిబింబించేది. ఒకరోజు భగవతి ఆమెను మెల్లగా అడగనే అడిగింది "ఏమి వదినా! ఈ మధ్య మీరు ఇంత ఉదాసీనంగా ఉన్నారు?' అని. ఆమె ఏమీలేదు లాలి అని జవాబు ఇచ్చింది. అప్పుడు భగవతి నవ్వుతూ ఇలా అన్నది. 'ఏమీ లేకపోవడమేమిటి, చెప్పమంటావా?' మెల్లిగా గంభీరంగా ఇలా అన్నది – 'మీ నాన్నగారు రాలేదని నీవు బాధపడుతున్నావు కదా! కానీ మీరు బాధపడవద్దు. ఆయనకి చాలా తీవ్రజ్వరము రావడము వల్ల రాలేకపోయారు. ఆయన ఉత్తరము వ్రాశారు కానీ సకాలంలో మనకి అందలేదు. ఇవ్వాళ ఆయన రావడానికి బయలుదేరుతున్నారు. రేపు వచ్చేస్తారు. ఉత్తరము కూడా ఇవ్వాళ మీకు అందుతుంది'.

తన చిన్నారి మరదలి మాటలు విని ఆమె చాలా ఆశ్చర్యం చెందింది. ఎందువల్లనంటే తన మనస్సులోని మాటలు ఆమె ఇంటిలో ఎవ్వరికి చెప్పలేదు. ఆమె ఆశ్చర్యము నిజంగానే పోస్టుమాను వచ్చి ఉత్తరము ఇవ్వడం వల్ల ఎక్కువయింది. ఉత్తరములో లాలి చెప్పినట్టుగానే అన్నీ వ్రాసున్నాయి. రెండవ రోజు ఆమె తండ్రి ఆమెను తీసుకువెళ్ళుటకు వచ్చారు. ఆయన వస్తూనే ఇంట్లోవారికి తన ఆరోగ్యం గురించి తెలిపారు. అవన్నీ కూడా ఆమెకు ప్రేమపాత్రురాలైన చిన్నారి మరదలు చెప్పినట్లే ఉన్నాయి. అప్పటినుంచి ఆమెకు మామగారి వలే భగవతీ ఒక దైవీశక్తి అవతారమని దృఢపడినది. ఆమె హృదయంలో తన మరదలి మీద ప్రేమ మొదటినుంచి ఉండేది. ఇప్పుడు గౌరవము, శ్రద్ధ కూడా పెరిగాయి.

భగవతి మనస్సులో తన వదిన మీద విశేష ప్రేమ ఉండేది. తన వయస్సుకి తగినట్టు ఆమెకు ఇంటిలోని చిన్న చిన్న పనులలో సహాయపడేది. అప్పుడప్పుడు వదినతోను, అక్క తోను కలిసి బొమ్మలాట ఆడేది. ఇది ఆమెకు చాలా ఇష్టమైన ఆట. అబ్బాయిబొమ్మ, అమ్మాయిబొమ్మ చేసి అలంకరించే బాధ్యత వదినది. దానికొరకు ఆమె ఎప్పుడు రంగురంగుల గుడ్డముక్కలని సమకూరుస్తూ ఉండేది. వాటితో ఆమె తన లాలి యొక్క బొమ్మల్ని అందంగా తీర్చిదిద్దేది. అబ్బాయిబొమ్మకి జ్వర మొస్తే వైద్యుడిని పిలిచేవారు. మూలికలు అరగతీసి మందు తయారుచేసేవారు. ఈవిధంగా మందు తిని పత్యము చేసి పెళ్ళికుమారుడు ఆరోగ్యవంతుడు అయ్యేవాడు. దానితోపాటు చిన్నారి భగవతి యొక్క నవ్వు మళ్ళీ వినిపించేది. బొమ్మ పెళ్ళిళ్ళ ఆట ఆమె చిన్నతనపు నిజమైన సహచరి. ఈమె ఈ ఆటలో ఇంటిలోని ప్రతివారు తప్పనిసరిగా పాలుపంచుకొన వలసి వచ్చేది. ఒకసారి పెండ్లికుమారునికి అనారోగ్యము వస్తే మందు ఇప్పించటము, ఇంకోసారి అమ్మాయి పెండ్లి, మరొక సారి నూతన గృహానికి కావలసిన ఏర్పాట్లు... ఈవిధంగా అనేక పనులు చేసి, చేయించుటలో ఆమె చిన్నతనము ఆటలలో ఉల్లాసంగా గడిపేది. మహాశక్తి యొక్క ఈ లీలలో ఆమె దివ్య లీల కూడా అప్పుడప్పుడు బహిర్గతమయ్యేది. ఆటలలోనే అనేకానేక దివ్యభావాలు అంకురించి, పెరిగి ఈ సృష్టి యొక్క విశాల ప్రాంగణంలో వెదజల్లబడేవి. క్రీడామయి శాంత భావనతో వాటిని చూస్తూ ఉండేది.

## బాలక్రీడలో తొంగి చూసే దివ్యభావనలు

భగవతి యొక్క బాలక్రీడలలో ఆమె దివ్యభావనలు తొంగి చూసేవి. ఆమె ఆడే అనేక ఆటలలో ఆమెకు ఇష్టమైనది "శివ పూజ". ఈ ఆట ఆవిడ రోజుకి కనీసము ఒక్కసారైనా ఆడవలసి నదే. అప్పుడప్పుడు ఆమె కిష్టమైన ఈ ఆట రోజుకి రెండు, మూడుసార్లు కూడా ఆడేది. ఆటకి ప్రారంభము భగవాన్ మహాదేవుని ప్రతీక చిహ్నము తయారుచేయడం ద్వారా మొదలయ్యేది. తన అక్క ఓంవతి మరియు చిన్ననాటి స్నేహితురాలు సుఖమతితో కలిసి మట్టితో శివప్రతీక తయారు

**గాయత్రి బ్రహ్మవర్చస్సును ప్రసాదిస్తుంది**

చేసేది. దానిని విధిపూర్వకముగా స్థాపించిన తరువాత దానికి పుష్ప, దీప, నైవేద్య మరియు బిల్వపత్రాలతో పూజ చేసే క్రమము మొదలయ్యేది. ఈ పూజ చాలా భక్తిగా, ప్రేమగా చేసేవారు. పూజైన తరువాత అందరూ భగవాన్ శివుని యొక్క పంచాక్షరీమంత్రము "ఓం నమః శివాయ" జపము చేసేవారు.

ఆటలో పాలుపంచుకునే మిగతా బాలికలు చేసే జపము చాలా తొందరగా సమాప్తమైపోయేది. కానీ భావసమాధిలో మునిగిపోయిన భగవతి చాలాసేపు 'ఓం నమఃశివాయ' మంత్ర జపము చేసేది. ఒకొక్కసారి గంటలు గంటలు గడిచేవి. ఆటలో పాల్గొనే మిగతా బాలికలకు విసుగొచ్చేది, అలసిపోయే వారు. ఒకొక్కసారి ఆమెనలాగే ఒంటరిగా వదిలేసి మౌనంగా వెళ్ళిపోయేవారు. ఆరోజు లేక మరుసటిరోజు మళ్ళీ కలిసినప్పుడు వాళ్ళు భగవతిని అడిగేవారు 'శివపూజ చేస్తూ ఉంటే ఏమవుతుంది'? జపము చేయడానికి కళ్ళు మూసుకున్న నీవు లేచే ప్రసక్తే లేదా? మేము కూడా నీతోపాటు పూజకి కూర్చుంటున్నాము కదా! ఇలా మైమరిచిపోవడము లేదే.' జవాబుగా భగవతీ యొక్క చిన్నారి మొహము మీద ఒక రహస్యాత్మకమైన చిఱునవ్వు వెలసింది.

ఈ చిఱునవ్వులో దాగి ఉన్న రహస్యాలు ఆమెతో పాటు ఆడే బాలికలకు  తెలియదు. ఎవరికి ఈ పూజ మహాశక్తి యొక్క ఆరాధ్యదైవమైన ఆ మహాశివుని కొరకు ఉన్న ఆంతరిక అనురాగము యొక్క అభివ్యక్తి అని తెలిసేదికాదు. అప్పుడప్పుడు ఆమె పెద్ద వదిన ఆమెను అడుగుతూ ఉండేది– "లాలి! నువ్వు ఇంతసేపు పూజలు ఎందుకు చేస్తున్నావురా? ఎప్పుడు చూసినా శివుని యొక్క చిత్రము, ప్రతిమ ముందు కళ్ళు మూసుకుని కూర్చుని ఉంటావు." వదిన యొక్క ఈ ప్రశ్నలకు జవాబుగా ఆమె నవ్వేది. పిమ్మట ఇలా జవా బిచ్చేది. 'అరే! నేను ఏమీ పూజలు చేయుట లేదు. ఇది ఆట మాత్రమే. కానీ అన్ని ఆటలలో ఈ ఆట నాకు చాలా ప్రియమైనది'. ఆమె యొక్క ఈ మాటలకు ఎవరు ఏమీ అనేవారు కాదు. ఇలాగే రోజు ఈ ఆట కొనసాగుతూ ఉండేది.

ఈ ఆటలో క్రొత్తదనము కలపడానికి తన నాన్న జస్వంత రావు సహాయము తీసుకునేది. ఆమె ఆయనను శివపురాణం లోని గాథలు వినిపించమని కోరేది. శివుని లీలాచరిత్ర వినడము ఆమెకు చాలా ఇష్టము. ఆమె భగవాన్ మహాకాలుని దివ్యచరిత్ర వింటున్నప్పుడు అది ఆమె మనోప్రాణాలకు, అంతరాత్మకు చాలా సుఖాన్నే చేకూర్చేది. ఆమె మళ్ళీ మళ్ళీ వాటిని వినిపించమని అడిగేది. జస్వంతరావుగారు కూడా తన గారాబుపట్టికి చాలా రసవంతముగా శివుని లీలలు వినిపించేవారు. ఆయనకి ఎప్పటికీ ఆ లీలామయి ఆయన ముందే స్వయముగా బాలరూపములో ఉండి తన యొక్క ఆరాధ్యదైవము మరియు తన సర్వస్వమూర్తియైన శివుని చరిత్ర చెప్తున్నది. ఈ ఆంతరికమైన భావసత్యము ఎవరికీ తెలిసేది కాదు. ప్రత్యక్షముగా తెలిసే సత్యమేమిటంటే వినేవారు, చెప్పేవారు ఇద్దరు భగవంతుని లీలలు వినేవారు. వింటూ, చెప్పుకుంటూ భక్తిరసంలో మునిగిపోయేవారు.

ఈ శివలీలలలోని ఏదో ఒక అంశము శివపూజలో జోడించబడేది. ఒకసారి శివరాత్రి యొక్క ప్రసంగము కలప బడితే, ఇంకోసారి శివ వివాహ కథ కలపబడేది. ఈవిధంగా ఆటలో నూతనత్వము వచ్చేది. తనతోకూడా ఆడుకునే బాలికలలో ఉత్సాహము వచ్చేది. అందరు ఆటకి కావలసిన వాతావరణము పూర్తిగా కష్టపడి తయారుచేసుకునేవారు. ఆమె చిన్ననాటి స్నేహితురాలు సుఖమతి ఆమె సహచరే కాక, అనుచరి కూడా. ఆమెను మాతాజీ చాలా ప్రేమతో "సుఖమన్" అని పిలిచేవారు. తన ప్రాణప్రియ సఖి భగవతికి ఏది ఇష్టమో సుఖమన్ అదే చేసేది. భగవతీ సాన్నిధ్యం వల్ల ఆమెకు కూడా శివపూజలో పరిపూర్ణమైన విశ్వాసము ఏర్పడినది. శివపూజకి సంబంధించిన ఏ పని నైనా ఆమె చాలా ఆనందంగా చేసేది.

భగవతికి ఈ ఆటలో అనేక దివ్యానుభూతులు వచ్చేవి. కానీ వాటి రహస్యము, అర్థము పూర్తిగా ప్రకటితము అయ్యేవి కావు. శివపూజ చేస్తూ భావమగ్నమైనప్పుడు ఆమె అంతః చేతనలో అనేక దృశ్యాలు కనిపిస్తూ ఉండేవి. ఆమెకు ఇలా అనిపించేది. శివుడు ఒక తెల్లని పొడుగైన సన్నని శరీరధారి యువకునిగా రూపము దాల్చినట్టు కనిపించేవారు. మొదట ఈ యువకుని రూపము అస్పష్టంగా కనిపించేది. కానీ తరువాత చాలా స్పష్టంగా రూపము కనిపించేది. ఈ యువకుడు సాధారణంగా ఆమెకు ఒక చిన్న గదిలో పూజా వేదిక మీద ప్రజ్వలితమైయున్న సాధన వేదిక మీదున్న దీపము ముందు ధ్యానస్థితిలో ఉండి కనిపించేవాడు. అతని ముఖ మండలము మీద ఆమెకు అపూర్వమైన తేజస్సు కనిపించేది. ఈ దృశ్యము

**స్థూల, సూక్ష్మ శరీరాలను క్షాళన చేస్తుంది గాయత్రి**

ఆమెకు అంతర్‌మనస్సులో మళ్ళీ మళ్ళీ కనిపించేది.

మళ్ళీ మళ్ళీ ఈ దృశ్యాన్ని చూసి ఆమె ఆశ్చర్యచకితురాలు అయ్యేది. శివపూజ చేస్తుంటే ఈ విచిత్రానుభూతి ఎందుకు వస్తుంది అని ఆలోచించుకునేది. అప్పుడప్పుడు మనస్సులో శివుడు స్వయంగా అవతరించాడా అని ఆమెకు అనిపిస్తూ ఉండేది. ప్రభువు స్వయంగా తన సృష్టిలో యుగప్రత్యావర్తనము చేయుటకు ఒక నూతన యుగ ప్రవర్తన చేయుటకు వచ్చాడా అనిపించేది. తన ఈ ఆలోచనల గురించి ఆవిడ మళ్ళీ మళ్ళీ ఆలోచిస్తే ఇది నిజమే అని అనిపించేది. ఆమెకు ఆ మహా యోగి యువకుని రూపములో శివుని స్వరూపము ప్రత్యక్ష మయ్యేది. మనస్సులోనే అతనిని శివశివా అనుకుంటూ నమస్కారము చేసుకునేది. పంచాక్షరీమంత్రమైన ఓం నమః శివాయ జపము చేస్తూ ఆమె ప్రగాఢ భావదశలోకి వెళ్ళినప్పుడు ఆమె మనోపటలము మీద ఈ దృశ్యము ప్రత్యక్షమయ్యేది.

రోజురోజు తన అంతఃచేతనలో వచ్చే సాధనలో లీనమైన ఈ యువకునకు ఆమె పేరు కూడా పెట్టారు. "మహాయోగి శివుడు". ఇది ఆమె తన భావసమాధిలో సాక్షాత్కరించిన సత్యానికి ఇచ్చిన పేరు. ఈ "మహాయోగి శివుడు" ప్రతిరోజు ఆమె అంతర్భావనలలో ప్రత్యక్షమైనప్పటికీ ఇతను ఎవరు? ఎక్కడ? మరియు ఏమి చేస్తాడు? అనేది ఆమెకు తెలియలేదు. కానీ ఎప్పుడు ఆమె ధ్యానంలోకి వెళ్ళినా లేక తన శివపూజలలో ధ్యాన నిమగ్నమయినా ఆమె హృదయంలో మహాయోగి శివుడు ఎవరైనప్పటికీ కచ్చితంగా ఈయన భగవాన్ శివుడే అన్న తీవ్ర స్ఫురణ ఆమెకు కలిగేది. అంతేకాక ఏదోవిధంగా తన భవిష్యత్తు కూడా ఈయనతో తప్పనిసరిగా జోడింపబడి ఉన్నది అని స్పష్టమయ్యేది. వీరిద్వారా చెయ్యబడే ఏదో ఒక పనిలో సహకరించడానికే తాను జన్మించిందేమో అని అనుకునేది.

ఆటలాటలలోనే ఆమె శివపూజ మొదలుపెట్టింది. ఆ పూజ ఆమెను దివ్య భావానుభూతులలో ముంచేస్తోంది. ఈ అనుభూతులు ఆమెను జీవితము మరియు భవిష్యత్తు గురించి జాగరూకము చేశాయి. ఆమె బాలక్రీడలో దివ్యత్వము యొక్క తత్త్వములు ఘనీభవిస్తున్నాయి. ఈవిధంగా ఆమె క్రీడామయ మగు చిన్నతనము మెల్లగా కిశోరావస్థకు వెళ్తున్నది. ఆటల లోనే యోగసాధన యొక్క ఏ తత్త్వములు అంకురించాయో అవి ఇప్పుడు పల్లవిస్తున్నాయి. ఆమె హృదయంలో సాధనా మయ జీవితం కొరకు తీవ్ర అభిలాష ప్రారంభము అయ్యింది. తన ఆరాధ్యదేవుడిని కలవడానికి పిలుపు తీవ్రమగుచున్నది. ఈ పిలుపులో భక్తి యొక్క పరాకాష్ఠ, ప్రేమ యొక్క తరళత మరియు అనురాగము యొక్క సజలత ఉండేది. బాలిక భగవతి ఒక ప్రఖర యోగసాధకురాలిగా రూపాంతరము చెందుతున్నది. ఆమె ప్రభువు గురించి భావమయి పిలుపులో తన యోగసాధన యొక్క స్వరసంగీతము మారుమ్రోగుతోంది.

*– అనువాదం: డా॥ మారెళ్ళ శ్రీరామకృష్ణ*

## బుద్ధ భగవానుడు

*ఒకరోజు బుద్ధ భగవానుడు అరణ్య మార్గం గుండా వెళుతున్నారు. అకస్మాత్తుగా ఒక దొంగ వచ్చి ఆయనను పట్టుకొన్నాడు. దొంగచేతిలో కత్తి ఉంది. వాడు ఆయనను చంపేందుకు సిద్ధంగా ఉన్నాడు. బుద్ధుడు దొంగతో ఇలా అన్నాడు 'నన్ను చంపుదామని అనుకుంటున్నావా? తప్పక చంపు. చంపబోయేముందు ఒక చిన్న కోరిక ఉంది. దాన్ని నెరవేర్చు'*

*'వెంటనే చెప్పు? ఏమిటి ఆ కోరిక' ఆ ఎదుట ఒక చెట్టు ఉంది కదా. దాని కొమ్మను ఒకదానిని విరిచి తీసుకొనిరా?'*

*'ఓస్ ఇంతేనా' అని దొంగ చెట్టుకొమ్మని విరిచితెచ్చాడు. 'నా కోరిక ఇంకా తీరలేదు మిత్రమా' అంటూ బుద్ధుడు, 'దయచేసి ఈ కొమ్మను చెట్టుకు మళ్ళీ అతికించు' 'ఇదెలా వీలవుతుంది?' దొంగ ఆశ్చర్యపడుతూ అన్నాడు. 'ఒక పిల్లవాడు సైతం నీలాగానే చెట్టు కొమ్మను విరువగలడు. కాని మళ్ళీ కొమ్మను చెట్టుకు అతికించలేడు. నీవు ఆ పిల్లవానికంటే ఏమిగొప్ప?' కావాలంటే నీవు చంప గలుగుతావు. చంపటం అంటే విరవటమే. కలపటం కాదు కదా' దొంగ ఆలోచనలో పడిపోయాడు. అంతర్మథనం మొదలయింది. అతని నోటి నుండి ఈ మాటలు వెలువడ్డాయి.*

*'ఇప్పటిదాకా నాకు విరవటమే తెలుసు. చంపటమే తెలుసు. అదే గొప్ప పని అని అనుకుంటూ ఉన్నాను' అని దొంగ శిరస్సు వంచాడు.*

**మనిషిని సిద్ధపురుషునిగా మార్చే మహామంత్రం గాయత్రి**

అంతర్యాత్ర - 6

# చాలా అద్భుతమైనవి మనస్సు యొక్క ఐదు వృత్తులు

ఈ సూత్రంలో పతంజలి మహర్షి ఈ తత్త్వాన్ని మరింత స్పష్టంగా ఇలా చెప్పారు. సూత్రంలో వారు ఇలా అంటారు.

**వృత్తయః పంచతయః క్లిష్టా అక్లిష్టాః ॥ 1/5**

అనగా మనస్సు యొక్క వృత్తులు ఐదు. క్లేశానికి, అక్లేశానికి కూడా మూలకారణాలు కావచ్చు.

యోగసూత్రకారుడైన మహర్షి యొక్క ఈ సూత్రము మొదటిసారి చూస్తే ఒక సమస్యగానే అనిపిస్తుంది. మనస్సుకున్న ఐదు వృత్తులు ఏవిధంగా ఎందుకు తమ రూపాన్ని మార్చు కుంటాయి? అనేది ఒక్కసారిగా అర్థం కాదు. అవి ఎలా క్లేశానికి అనగా దుఃఖానికి, పీడకు జన్మనిస్తున్నాయి, అవి ఎలా మనల్ని అక్లేశానికి అనగా దుఃఖము, పీడ అనేవి లేని స్థితికి తీసుకువెళ్తున్నాయి? ఈ సత్యాన్ని తెలుసుకోవాలంటే మనం సత్యము యొక్క లోతులని తీవ్రంగా అన్వేషించాల్సిన అవసరం ఉన్నది. తత్త్వము యొక్క లోతుల్లోకి ప్రవేశించక తప్పదా? అంటే తప్పదు. అప్పుడే ఎక్కడో ఒకచోట అర్థం చేసుకోగలిగే విశ్వాసం స్థిరం అవుతుంది.

ఎక్కడైనా ఏది వెతికితే అదే దొరుకుతుంది. ఈత రావాలంటే 'నీళ్ళల్లోకి చొచ్చుకుపోవాలి' అనేది తెలియాలి. ఈ షరతుని నెరవేరుస్తేనే మహర్షి యొక్క అభిప్రాయం ఏమిటో తెలుసు కోవటం సాధ్యమవుతుంది. అయితే ఈ నీళ్ళల్లోకి చొచ్చుకు పోవటం అనేది మనం ఒడ్డు నుండే ప్రారంభించాలి. ఆ ఒడ్డే మన శరీరం. దీని గురించి అందరికీ తెలుసు. చాలామందిలో తాము వేరు, శరీరం వేరు అనే భావన చాలా దృఢంగా నాటుకుపోయింది. మనకు కనిపించే ఈ శరీరానికి ఐదు ముఖ్యమైన అవయవాలు ఉన్నాయి. వాటిని మనం ఐదు కర్మేంద్రియాలు అని అంటాము. ఈ శరీరంతో ముడిపడి ఉన్న మరో ఐదు సమూహాలు ఇంకా ఉన్నాయి. వాటిని ఐదు జ్ఞానేంద్రియాలు అంటారు. ఈ ఐదు జ్ఞానేంద్రియాల ద్వారానే మన అంతఃచేతన బాహ్యజగత్తుతో సంబంధాన్ని స్థాపించు కుంటుంది. బాహ్యజగత్తులో ఉండే అనుభూతులను ఆస్వాదిస్తూ ఉంటుంది. చూడడానికి బాహ్యజగత్తు మొత్తం ఒకేలాగా అనిపించినప్పటికీ, దాని నుండి పొందే అనుభూతులు-రసా స్వాదనల నుండి వచ్చే సుఖాలు మాత్రం ఎవరివి వారివే. ఈ వాస్తవికత మనస్సుపైన మరియు దాని వృత్తులపైన ఆధారపడి ఉంటుంది. ఈ వృత్తులు కూడా కర్మేంద్రియాలు, జ్ఞానేంద్రియాల వలే ఐదే ఉంటాయి.

ఇక మనస్సు సంగతికి వస్తే పూజ్యగురుదేవులు ఇలా అంటారు. 'మనస్సు, శరీరము అంత వేరుగా ఉండవు. ఇది చాలావరకు శరీరంతో కలిసిపోయి, అతుక్కున్నట్టుగానే ఉంటుంది. శరీరము మనస్సుల కలయిక ఎంత దగ్గరగా ఉంటుందంటే ఈ మనస్సును శరీరము యొక్క సూక్ష్మభాగము అన్నా కూడా తప్పేమీ కాదు. ఇందువల్లనే ఇది సామాన్యంగా శరీరమునకు కలిగే దుఃఖానికి, సుఖానికి కూడా చాలా ఎక్కువగా ప్రభావితమవుతుంటుంది. ఇది కూడా ఒకరకంగా శరీరమే! అయితే యోగసాధన అనేది లేకుండా దీనికి విడిగా జీవముండదు (ఉనికి ఉండదు). అందుచేత ఈ యోగసాధన చేసేవారంతా – కనిపించేది స్థూలశరీరము అని, తన యొక్క శక్తులతో కూడిన మనస్సే సూక్ష్మశరీరము అనే సత్యాన్ని చాలా సులభంగా తెలుసుకోగలుగుతారు. మనస్సు యొక్క వికాసము దానికుండే వృత్తులను ఎలా ఉపయోగిస్తున్నావు అనేదానిపై ఆధారపడి ఉంటుంది.

ఈ మానసిక శక్తులనన్నింటినీ కేవలం క్షణిక ఇంద్రియ భోగాలకు, నీచమైన స్వార్థప్రయోజనాలు తీర్చుకునేందుకు అర్థం లేని, పనికిరాని అహంకారాన్ని తృప్తిపరచుకునేందుకు వాడుకుని వృథాగా దురుపయోగం చేస్తూ అదే జీవనసారంగా, జీవన సర్వస్వంగా భావించకూడదు. అలా చేస్తే కనుక ఐదు మనోవృత్తులు క్లేశానికి మూలకారణంగా మారటంలో ఎలాంటి సందేహం లేదు. ఇందుకు భిన్నంగా మనస్సును స్వాధీన పరచుకొని, సదుపయోగం చేసుకొని, మనస్సును యోగ సాధనలో లీనం చేసుకుంటే కనుక మనస్సుకున్న ఈ ఐదు వృత్తులు అక్లేశానికి మూలస్థానాలుగా నిర్ధారించబడతాయి. ఐదు వృత్తులు మనస్సు కంటే ఎక్కువగా జీవితంలో క్లేశములు

**యుగ నిర్మాణానికి మూలాధారం గాయత్రి**

అనే తుఫానును సృష్టించగలవు. అది మనలో ప్రతి ఒక్కరికి అనుభవమే! అయితే వీటిని అక్లేశానికి ఉద్గమ కేంద్రాలుగా మార్చాలనుకుంటే కనుక గురుదేవులు ఇచ్చిన జీవన సాధనకు స్వర్ణిమ సూత్రాల ద్వారానే సాధ్యమవుతుంది. ఈ వృత్తులు మనతో ఆడే ఆట కనుక మనకు అర్థం కాకపోతే చేసిన జపతపాలు, శ్రమ అన్నీ వృథా అయిపోతాయని గురుదేవులు అంటుండే వారు. రావణ-కుంభకర్ణులు, హిరణ్యాక్ష-హిరణ్యకశిపులు కూడా చాలా తపస్సు, సాధనలు చేశారు. వీరు చేసిన ఘోర తపస్సుకు సంబంధించిన కథలతో పురాణాల పేజీలు నిండి పోయాయి. పురాణ కథలననుసరించి వీరి తపస్సు యొక్క ప్రభావానికి తప్పని పరిస్థితులలో విధాతే వరాలు ఇచ్చేందుకు దిగిరావలసి వచ్చింది. కానీ వృత్తులను సరిగ్గా సంస్కరించుకోని కారణంగా వారి సమస్త తపస్సుకు ఫలితము చివరకు క్లేశములకు మూలకేంద్రంగా మిగిలిపోయింది. వారు తమ వయస్సునంతటినీ వాసనలను తృప్తిపరచటమనే అగ్నిలోనే కుమిలిపోయేలా చేసుకున్నారు. అందువల్లనే వారికి వరాల వల్ల లభించింది, వారు తపోసాధనతో ఆర్జించుకున్నది అంతా వారికున్న అసంతృప్తి అనే వ్యథను చరమస్థితికి తీసుకెళ్ళేందుకే ఉపయోగ పడింది.

ఇంకొక రకమైన ఉదాహరణలు కూడా కొన్ని ఉన్నాయి. సంత్ కబీర్, సంత్ రైదాస్‌లకు అతి సాధారణ జీవితం గడిపేందుకు కూడా వనరులు లభించని స్థితిలో గడుస్తుండేది. వీరి జీవితము చాలా కష్టంగానే గడుస్తుండేది. వీరి జీవితములో చాలా భాగము బట్టలునేయటం, చెప్పులు కుట్టటంతోనే గడిచిపోయేది. వీరిలో గగుర్పొడిచేటంతటి అద్భుతమైన తపస్సులెవ్వరూ చెయ్యలేదు. కానీ ఒక పనిని మాత్రం వారు తమ ప్రతిశ్వాసలోను చేశారు. నడిచే ప్రతిశ్వాసతోపాటు మనస్సులను, వృత్తులను సంస్కరించు కోవటంలో నిమగ్నమైనారు. ప్రగాఢమైన భక్తితో తమ యొక్క మానసిక వృత్తులన్నింటిని సరిచేసుకున్నారు. తదుపరి జీవితము నకు ఇది చాలా మంచి ఫలితాల నిచ్చింది. ఈ ఐదు వృత్తులు వీరి జీవితమునకు అక్లేశములను, ఆనందమును అందించాయి. వృత్తుల యొక్క నిర్మలత్వమును అనుభూతి పొందిన మహాత్ము లైన కబీర్ ఇలా గానం చేశారు.

**కబిరామన్ నిర్మల్ భయా జైసా గంగా నీర్ ।**
**పాఛే పాఛే హర్ ఫిరై కహత్ కబీర్‌కబీర్ ॥**

వృత్తులకుండే దుర్గంధమును తీసివేసి, వాటికి మంచి సౌరభాన్ని, సుగంధాన్ని ఇచ్చి సంస్కరించే వాయువు ఈ విరాట్ విశ్వము నుండే వస్తుంది. ఈ గాలి మన జీవితంలో కూడా వీచాలనుకుంటే మనలో ఉన్న స్వార్థ, అహంకారములను విడిచి పెట్టాలి. ఆనందము సమస్త సృష్టిలోను, విరాట్ బ్రహ్మాండమంతటా వ్యాపించి ఉన్నది. ఇది తిరిగి తిరిగి మనలోకి ప్రవేశించవలెనని ఆరాటపడుతున్నది. మనం మాత్రం తలుపులు మూసుకుని కూర్చుని ఉన్నాము. సూర్యోదయమైన తరువాత కూడా మనం కిటికీ తలుపులు, వాకిలి తలుపులు తెరవకపోతే రావాలని ఉన్నా కూడా సూర్యకిరణములు ఇంటి లోపలికి రాలేవు. కిటికీ తలుపులు అలా తెరవగానే వేలవేల కిరణాలు ఒకేసారి వెలుగు విరజిమ్ముతూ లోపలికి ప్రవేశిస్తాయి. కిటికీ తెరవక ముందు కూడా ఆ కిరణాలు అలానే ఉన్నాయి. కిటికీలనే అవరోధాలను తొలగించిన మరుక్షణం అంధకారం కాంతిగా రూపాంతరం చెందింది. వృత్తులు కూడా ఇలానే రూపాంతరం చెందుతాయి. స్వార్థము, అహంకారములనే కవాటాలను తెరచి వాసన, తృష్ణల స్థానములో భక్తిని, అనురక్తిని నిలుపుకుంటే వృత్తులు మారటం మొదలవుతుంది. ఇంతకు ముందు కేవలం దుఃఖమును, పీడను, సంతాపాన్ని, అసంతృప్తిని మాత్రమే మిగిల్చే ఆ వృత్తులే ఇప్పుడు ఆనందాన్ని, తృప్తిని, సుఖాలను కూడా ఒక తుఫాను వలే ప్రసాదిస్తాయి.

*– అనువాదం: శ్రీమతి వల్లీశ్రీనివాస్*

## గాయత్రీ వల్ల భయరాహిత్యం

*అంపశయ్యపై పడి ఉన్న భీష్మ పితామహుణ్ణి యుధిష్ఠిరుడు అడిగాడు – ఏ మంత్రాన్ని జపిస్తే మనిషికి శాంతి, పుష్టి, రక్షణ, నిర్భయత్వం లభిస్తాయని. భీష్మ పితామహుడు ఇలా జవాబిచ్చాడు – "ఓ యుధిష్ఠిరా! గాయత్రి జపం చేసే వ్యక్తికి ధనం, గృహం, ఇతర భౌతిక వస్తువులన్నీ లభిస్తాయి. దుష్టులు, రాక్షసులు, అగ్ని, జలం, వాయువు, సర్పాలు – వేటివల్లా అతడికి భయం ఉండదు. నాలుగు వర్ణాలవారు, నాలుగు ఆశ్రమాలవారు దీనిని జపించి సఫలత పొంద వచ్చు. ఈ మంత్ర జపం జరిగే చోట పిల్లల అకాల మరణం ఉండదు; ఎవరికీ ఎలాంటి కష్టము ఉండదు."*

*(మహాభారత అనుశాసన పర్వం, 150వ అధ్యాయం)*

**గాయత్రి - పాపనాశిని, మోక్షదాయిని, కళ్యాణకారి**

గాయత్రీ జయంతి ప్రత్యేకం

# విస్తరించు దశదిశలా గాయత్రి వెలుగును

## పంచడంలోనే సార్థక్యం

సూర్యుని వెలుగు చంద్రునికి అందుతుంది. చంద్రుడు దానిని తన కోసం వాడుకోడు. అందిన వెలుగును భూగోళం లోని ప్రాణులకు అందిస్తాడు. వారికి రాత్రిపూట వెన్నెలను, చల్లదనాన్ని ఇస్తాడు. సముద్రం ఇచ్చిన నీటిని మేఘం తాను వాడుకోదు. ఆ సంపదను వర్షంగా కురిపిస్తుంది. భూఖండాల దాహాన్ని తీర్చుతుంది. అలా చేయడం తన అదృష్టంగా భావిస్తుంది. చెట్ల నుండి నదులు సరోవరాల వరకు అన్నీ ఇదే సంప్రదాయాన్ని పాటిస్తాయి. దేవుడు ప్రసాదించిన అనుగ్రహాన్ని తమవరకు పరిమితం చేసుకోవు. ఇతరులకు పంచుతాయి. అలా–ఇచ్చిపుచ్చుకునే విధానాన్ని కొనసాగిస్తాయి.

క్రమబద్ధమైన కుటుంబవ్యవస్థకు ఆధారం ఇది. సంపాదించే వ్యక్తి తన శక్తిసామర్థ్యాలతో సంపాదించిన దానిని కుటుంబ సభ్యులందరికీ ఇస్తాడు. సంపాదించే వ్యక్తి ఆ సంపాదనను తనకోసమే వాడుకుంటే – కుటుంబపు బండి సాగదు. ఆశ్రయం ఇచ్చే వ్యక్తికి, ఆశ్రితులకు మధ్యగల ఇచ్చిపుచ్చుకునే పద్ధతి వారిని కలపడానికి, సన్నిహితం చేయడానికి ఆధారం అవుతుంది. ఇరుసు విరిగిపోతే చక్రంలోని ఆకులు వేటికవిగా విడిపోతాయి. బండి ఆగిపోతుంది. ఆధ్యాత్మిక ఫలితాల విషయంలో కూడా ఈ పద్ధతి వర్తిస్తుంది. ఆ ఫలితాలను పొందిన వ్యక్తులు వాటిని ఇతరులకు పంచాలి. అందులోనే వారి సార్థకత ఉంది.

గురువు శిష్యునికి చదువు చెప్తాడు. ఆ శిష్యుడు పెద్దవాడైన తర్వాత ఆ జ్ఞాన సంపదను తనకన్నా చిన్నవారికి అందిస్తాడు. పిల్లవాడు పెద్దవాడైన తర్వాత తన సంపాదనతో ఇతరులను పోషిస్తాడు. తండ్రి కొడుకుకు చదువు చెప్తాడు. కొడుకు తన కొడుకుకు చదువు చెప్తాడు. తల్లి తన పిల్లలను పోషిస్తుంది. వారు పెద్దవాళ్ళయి, తమ పిల్లలను పోషిస్తారు. ఈ సృష్టిక్రమం ఆధ్యాత్మిక రంగానికి కూడా వర్తిస్తుంది. ఆధ్యాత్మిక ఫలితాలను పొందిన వ్యక్తులు వాటిని ఇతరులకు పంచే ప్రయత్నం చేయాలి. నిప్పు దీపాన్ని వెలిగించింది. ఆ తర్వాత తన పరిసరాలను వెలిగించడం ఆ దీపం బాధ్యత.

## పంచకపోవడం ప్రగతినిరోధకం

వెలుగును పొందినవారు ఇతరులను వెలిగించకపోతే, తమకు అందిన వెలుగును తమ వద్దనే నిల్వ ఉంచుకుంటే ప్రగతిచక్రం ఆగిపోతుంది. దానివల్ల కలిగేది నష్టమే నష్టం. మధ్యయుగంలో మహత్తరమైన విద్యలను దాచి ఉంచుకునే సంకుచితత్వం ప్రబలింది. ఫలితంగా మానవాళికి ప్రయోజనం కలిగించే జ్ఞానం నశించిపోయింది. ఆయా శాస్త్రాలలో నిష్ణాతులు ఆ జ్ఞానాన్ని తమ వద్ద దాచుకుని చనిపోయారు. పిసినారుల ధనం భూమిలో పాతిపెట్టబడి ఉండిపోతుంది. పనికిరాకుండా పోతుంది. ప్రవహించే సంపద మాత్రమే సార్థకం అవుతుంది. దానివల్ల పలువురికి బ్రతుకుతెరువు ఏర్పడుతుంది.

గాయత్రీ జ్ఞానం విషయంలో కూడా పంచే పద్ధతిని అనుసరించాలి. ఆ వెలుగు అందినవారు దానివల్ల తాము ప్రయోజనం పొందాలి; ఇతరులకు ప్రయోజనం కలిగించాలి. రైతు పొలంలో పండించే పంట అతడి ఇంటిలోనే ఉండిపోదు. పలువురి ఆకలి తీర్చుతుంది. పరిశ్రమలో వస్తువులు తయారవు తాయి. వాటివల్ల పరిశ్రమ యజమాని ప్రయోజనం పొందు తాడు. ఆ వస్తువుల వల్ల ఇతరులకు కూడా సౌకర్యం కలుగు తుంది. ఉదారభావంతో కూడిన ఈ సహకారమే ప్రగతికి పునాది. అన్ని రంగాలలో ఈ ప్రక్రియ అమలు జరుగుతు న్నప్పుడు – ఒక్క ఆధ్యాత్మిక రంగంలో దీనికి ఆటంకం ఎందుకు ఉన్నది? సాధకులు తమ సాధనా పరాయణత్వాన్ని ఇతరులకు ఎందుకు రుచిచూపకూడదు?

పెక్కు కుటుంబాలకు బ్రతుకుతెరువు లభించేవిధంగా తమ సంపదను వినియోగించడం ధనవంతుల కర్తవ్యం. అజ్ఞాన అంధకారాన్ని తొలగించడం జ్ఞానం పొందినవారికి సముచిత మైన పని. వైద్యుడు తాను ఆరోగ్యంగా ఉంటాడు. తమ నైపుణ్యాన్ని వినియోగించి పలువురి రోగాలను నయం చేస్తాడు. ఇది మామూలు విషయం. విశిష్ట వ్యక్తులు విశిష్టత అనే తమ వెలుగును దశదిశలా పంచిపెట్టాలి. సాహిత్యవేత్తలు, కళాకారులు, సంగీత నిపుణులు తమ కళాసాధనలో నిమగ్నులు అవుతారు.

**గాయత్రి మనిషికి ఆధ్యాత్మిక కాయకల్ప చికిత్స చేస్తుంది**

ఆ నైపుణ్యాల వల్ల పలువురు ఇతరులు కూడా ప్రయోజనం పొందుతారు.

శాస్త్రవేత్తలు విద్యుచ్ఛక్తి, రేడియో వంటి క్రొత్త విషయాలను కనుగొన్నారు. దానితోపాటుగా – అవి సామాన్య ప్రజానీకానికి ప్రయోజనం కలిగించేందుకు కూడా కృషి చేశారు. అవి వారికి మాత్రమే ఉపయోగపడితే, వాటి ప్రయోజనం ఇతరులకు అందకపోతే – అది దురదృష్టమే అవుతుంది. వారి ప్రతిభకు కీర్తికి బదులు అపకీర్తి వస్తుంది. పిసినారులు తమ సాధన సంపత్తిని ఇతరులకు ఉపయోగపడనివ్వరు. కనుక వారు నిందలకు గురి అవుతారు. మామూలు వ్యక్తులు మామూలుగా, ప్రత్యేక వ్యక్తులు ప్రత్యేకమైన పద్ధతిలో తాము పొందిన ఫలితాల ప్రయోజనాన్ని ఇతరులకు అందించాలని ప్రజలు ఆశిస్తారు. ఆ ఆశ తీరకపోతే, ఆ వైభవం – భౌతికం కానీ, ఆధ్యాత్మికం కానీ – నిందలపాలవుతుంది.

## లోకకళ్యాణానికే ఋషుల తపస్సులు

ప్రాచీనకాలంలో ఋషులు, మనీషులు తమ సాధన ద్వారా, తపస్సు ద్వారా సంపాదించిన మహత్తర విషయాలను సామాన్య ప్రజలకు బోధించేవారు. ఫలితంగా ఈ దేశపౌరులు దేవ మానవులు అయ్యారు. అంతటా కృతయుగపు స్వర్గ వాతావర ణాన్ని నిర్మించడానికి వారు నిర్విరామంగా కృషి చేశారు. ఋషులు ఏర్పరిచిన ఈ సత్ సంప్రదాయం మహత్తరమైన భారతీయ సంస్కృతికి వెన్నెముక. ఈ సంప్రదాయమే మన దేశాన్ని జగద్గురువుగా, చక్రవర్తిగా, వైభవశాలిగా చేసింది. ఋషులు పిసినారులై ఉంటే, తమ సిద్ధికోసం, స్వర్గం కోసం, ముక్తి కోసం మాత్రమే ఆలోచించి ఉంటే – వారు అద్భుతాలు సాధించి ఉండేవారు కాదు, వారికి ప్రజల ఆదరాభిమానాలు, శ్రద్ధాభక్తులు లభించేవి కావు. గారడీవాడు కూడా అద్భుతాలు చూపుతాడు. జనం వినోదిస్తారు. కాని ఎవ్వరు అతడిపట్ల శ్రద్ధ చూపరు. సామాన్యులకు పనికివచ్చే సిద్ధులే సార్థకం అవుతాయి. స్వంత లాభం కోసం సంపద గడించినా, సిద్ధులు పొందినా – వాటి గురించి చర్చ మాత్రమే జరుగుతుంది. కానీ, వాటిని ఎవ్వరు మెచ్చుకోరు.

బ్రాహ్మణులు, సాధువులు మానవ సమాజపు ఉత్కృష్టతకు ప్రతీకలుగా పరిగణించబడతారు. వారిని భూసురులని పిలుస్తారు. వారి జపతపాలు, జ్ఞాన అధ్యయనాలు అందుకు కారణాలు కావు. లోకకళ్యాణం కోసం వారు తమ జీవితాన్ని సమర్పించ డమే అందుకు కారణం. ఆత్మయొక్క పవిత్రత కోసం, ప్రజాసేవ కోసం, లోకకళ్యాణం కోసం వారు జప తపాలు చేసేవారు. తమకు అందిన సామర్థ్యంతో, ప్రత్యేక శక్తులతో వారు ప్రజలకు ప్రయోజనం కలిగించేవారు. వారు సంచారం చేసేవారు. ఇంటింటికీ వెలుగును అందించేవారు.

## తీర్థయాత్రల ఆంతర్యం

తీర్థయాత్రల ద్వారా ధర్మప్రచారకులు ప్రజలను కలుసు కునేవారు. వారికి నీతిసూత్రాలు, ధర్మసూత్రాలు బోధించేవారు. అందువల్లనే తీర్థయాత్రలు చేస్తే పుణ్యం వస్తుందనే సంప్రదాయం ఏర్పడింది. కనుకనే – తీర్థయాత్రలను, తీర్థయాత్రికులను గౌరవించేవారు. ఈనాడు పర్యటన వినోదం కోసం జరుగు తుంది. పర్యాటకులు లక్షల సంఖ్యలో దర్శనీయ స్థలాలను చూడడం కోసం ప్రయాణిస్తూ ఉంటారు. వారిపట్ల ఎవరికైనా శ్రద్ధాభక్తులు ఉంటాయా? లేడి పరుగులు తీస్తూ ఉంటుంది. పక్షులు ఎగురుతూ ఉంటాయి. వాటిని తీర్థయాత్రలని అనగలమా?

పుణ్యం, పరమార్థం ఒకే అర్థం ఉన్న రెండు మాటలు. లోకకళ్యాణం కోసం చేసే పనుల వల్లనే పుణ్యం వస్తుంది. దానధర్మాలు జంటపదాలు. మతపరమైన ప్రతిపనితో ఏదోవిధమైన పరమార్థ కార్యం జోడింపబడి ఉంటుంది.

## పూర్ణాహుతిలో భాగంగా బ్రహ్మ భోజనం

గాయత్రీ అనుష్ఠాన పూర్ణాహుతిలో యజ్ఞం, బ్రహ్మ భోజనం, ప్రసాద వితరణ అనే మూడు ప్రక్రియలు తప్పనిసరిగా కలసి ఉంటాయి. ఇవి జరగకపోతే, జపం మాత్రమే జరిగితే – అది అనుష్ఠానం కాదనీ, దానికి మహత్తర ఫలితం లభించదనీ శాస్త్రం చెపుతోంది. ప్రాయశ్చిత్తకాండలో పలువిధములైన తప–తితీక్షలు జరపవలసి ఉంటుంది. పాపచర్యవల్ల సమాజానికి జరిగిన నష్టాన్ని భర్తీ చేయడానికై పుణ్య–పరమార్థ కార్యాలు వాటితోపాటు చేయాలని నిర్దేశింపబడింది.

ప్రాచీన కాలంలో బ్రహ్మభోజనం అనగా బ్రాహ్మణులకు దానదక్షిణలు ఇవ్వడం అనే సంప్రదాయం ఉండేది. దానికి కారణం ఒక్కటే. సాధు–బ్రాహ్మణ వర్గాలు నిరంతరం లోక

**గాయత్రి మనిషిలో దైవీశక్తులను మేల్కొల్పుతుంది**

కళ్యాణం కోసం కృషి చేస్తూ ఉంటాయి. తమ బ్రతుకుతెరువుకు వారు ప్రాధాన్యం ఇవ్వరు. కనుక – వారి జీవితాలు గడవడానికై శ్రద్ధాభక్తులతో ఏర్పాట్లు చేయడం సమాజానికి కర్తవ్యం అయ్యేది. ఆనాడు సాధు–బ్రాహ్మణుల జీవన విధానం నూటికి నూరుపాళ్ళు సమాజసేవకే అంకితం అయ్యేది. ప్రజలు వారికి దానం ఇచ్చేవారు. తద్వారా – వారు ఆ జీవన విధానాన్ని కొనసాగిస్తారని నిశ్చింతగా ఉండేవారు ప్రజలు.

ఆవిధంగా బ్రాహ్మణులకు ఇచ్చే దానం పరోక్షంగా సత్ ప్రవృత్తుల అభివృద్ధికి ఇచ్చే విరాళమే అయ్యేది. ఆ డబ్బు ఎలా వినియోగం అవుతోందో దానం ఇచ్చేవాళ్ళు పట్టించుకునే వారు కారు. పూర్తి నీతి నిజాయితీలు కలిగిన బ్రాహ్మణ వర్గానికే ఆ నిర్ణయం వదిలేవారు. బ్రాహ్మణ వర్గం కూడా ఆ ధనాన్ని సద్వినియోగం చేసేది. బ్రాహ్మణుల అవసరాలు కనీస స్థాయిలో ఉండేవి. కనుక వచ్చిన దక్షిణను వారు స్వార్థానికి వాడుకుంటారనే అనుమానం కలిగేది కాదు. నేడు దాన దక్షిణలు సమర్థులకు ఉచితంగా ఇచ్చేవిగా మారిపోయాయి. ప్రాచీన కాలంలో ఇలా ఉండేది కాదు. వంశానికీ, వేషానికీ ప్రాముఖ్యత ఉండకూడదు. పరమార్థ ప్రయోజనాలను మాత్రమే గౌరవించడం నైతికం, విజ్ఞతాయుతం అవుతుంది.

ఆ వాస్తవాలన్నిటి ద్వారా ఒక విషయం స్పష్టమవుతోంది. ఆధ్యాత్మిక సాధనాలను పూజా పునస్కారాలకే పరిమితం చేయకూడదు. వాటితోపాటు పరమార్థ ప్రయోజనాలు తప్పనిసరిగా జోడించబడాలి.

## రామానుజాచార్యుల ఆదర్శం

రామానుజాచార్యులవారికి ఒక అద్భుతమంత్రం లభించింది. వారు ఆ మంత్రసిద్ధి పొందారు. తాను ఆ మంత్రాన్ని ఎవ్వరికీ చెప్పననీ, చెబితే నరకానికి పోతాననీ మంత్రదీక్ష తీసుకునే టప్పుడు వారు తమ గురువుగారికి మాట ఇచ్చారు. తన మంత్రసిద్ధి సార్థకం కావడంతో వారి మనసులో ఒక ఆలోచన వచ్చింది. ప్రయోజనకరమైన ఈ మంత్రాన్ని ప్రజలందరికీ చెప్పాలని వారు అనుకున్నారు. ఆ ప్రకారం – వారు ఇంటింటికీ వెళ్ళి దాన్ని ప్రచారం చేయసాగారు. గురువుగారికి ఈ సంగతి తెలిసింది. ఆయన తన కోపాన్ని వ్యక్తం చేశారు. అందుకు రామానుజాచార్యులవారు ఇలా జవాబిచ్చారు. మాట తప్పినందుకు నరకానికి వెళ్ళడం నాకు సమ్మతమే; కానీ, ఇంతటి ప్రయోజనకరమైన మంత్రాన్ని ప్రజానీకానికి అందించాలనే నా ఆలోచనను నేను చంపుకోలేను.

## గాయత్రి వజ్రాయుధం, బ్రహ్మాస్త్రం

గాయత్రి ఆత్మకు కలిగే ఆకలి దప్పులను తీర్చుతుంది. ఆత్మకు పూర్తి సంతృప్తి కలిగించే అమృతం అది. గాయత్రిని పొందితే – వ్యథా ఉండదు, వేదనా ఉండదు; దారిద్ర్యం ఉండదు, లోభగుణం ఉండదు. గాయత్రీ దేవత్వాన్ని ప్రదానం చేసే దేవమాత, సద్జ్ఞానాన్ని నిరంతరం కురిపించే వేదమాత; విస్తృతమైన వ్యవస్థను సర్వాంగసుందరంగా తీర్చిదిద్దే విశ్వమాత. గాయత్రీమాత కొంగును ఆశ్రయించిన వ్యక్తికి ఏ కొరత ఉండదు, ఏ ప్రమాదము ఉండదు. గాయత్రి భూలోకపు కామధేనువు. దాని పాలు త్రాగే వ్యక్తి వార్ధక్యం వల్ల బాధపడడు. అతడి అందం చెడదు. అతడు మృతుని వలే మూర్ఛ పొందదు. గాయత్రి అనౌచిత్యాన్ని చీల్చిచెండాడే వజ్రాయుధం. గాయత్రి అనే బ్రహ్మాస్త్రాన్ని పొందిన వ్యక్తి ఓటమి అన్నది ఎరుగడు. పొగరుబోతుతనంపై అంకుశాన్ని ప్రయోగించే సామర్థ్యం కలిగిన బ్రహ్మదండం గాయత్రి. అనుశాసనాన్ని, నియంత్రణను అమలు చేయడంలో గాయత్రి ఉపయోగం అసామాన్యం.

## నారదునిలా భక్తులను రూపొందించు

అలాంటి ఆదిశక్తి గాయత్రి తత్త్వజ్ఞానాన్ని, సాధనా విధానాన్ని తెలుసుకోవడం, అవలంబించడం దూరదర్శి అయిన ప్రతి వ్యక్తికీ కర్తవ్యం. ఈ వెలుగును తనకు మాత్రమే పరిమితం చేసుకోవడంతో ఆ కర్తవ్య నిర్వహణ పూర్తి కాదు. దానిని విస్తరించే బాధ్యత కూడా మన భుజస్కంధాలపై ఉంది. స్వయంగా భక్తుడు కావడం ఒక ఎత్తు. నారదమహర్షి వలె ఇతరులను భగవంతుని భక్తులుగా చేయడం ఒక ఎత్తు. తాను తింటూ సంతోషపడడం ఒక ఎత్తు; ఇతరులకు తినిపించి ఆనందించడం ఒక ఎత్తు.

ఆధ్యాత్మిక ప్రతిఫలం దేవత్వం. దేవత్వంలో పవిత్రత, తీక్షణత రెండూ కలసి ఉంటాయి. జీవితంలో పవిత్రతను పెంచుకోవడానికై జపతపాలు చేయడం ఆధ్యాత్మికతలోని తొలి సగం. తన సామర్థ్యాన్ని సత్ ప్రవృత్తులలో వినియోగించడం మలి సగం. రెండూ కలిసినప్పుడే ఒక సమగ్ర ప్రక్రియ

**గాయత్రి జన్మజన్మల దుష్ట సంస్కారాలను క్షాళన చేస్తుంది**

రూపొందుతుంది. పక్షి రెండు రెక్కలతో ఎగురుతుంది. బండి రెండు చక్రాలతో నడుస్తుంది. ప్రగతిపథంలో సుదీర్ఘయాత్రను పూర్తి చేయాలంటే – కాళ్ళు రెండు సక్రమంగా పనిచేయాలి.

గంగా యమునలు కలిస్తే సరస్వతి ఉదయిస్తుంది. ఫలితంగా – త్రివేణీ సంగమంలో స్నానం చేయడం వల్ల కాయకల్పం జరుగుతుందని అలంకారికంగా చెప్పిన ఫలితం కళ్ళముందు ప్రత్యక్షం అవుతుంది.

## స్వాధ్యాయం తప్పనిసరి

గాయత్రీ పరివార్‌లోని ప్రతి సభ్యుడు జప ఉపాసనలు జరపడంతో సంతృప్తి చెందకూడదు. గాయత్రి తత్త్వజ్ఞానపు ఆధారాన్ని, స్వరూపాన్ని, విధానాన్ని, ప్రగతిక్రమాన్ని కూడా అవగాహన చేసుకోవాలి. జపధ్యానాల ప్రక్రియను ఆరంభించడం, ఆరంభింపజేయడం సాగుతూనే ఉంటుంది. దానితోపాటు – గాయత్రీ విజ్ఞానాన్ని తెలుసుకోవడానికి, వివరించడానికి స్వాధ్యాయం, సత్సంగం, మనన–చింతనల ఆసరాతో వాస్తవాల లోతులలోకి ప్రవేశించే ప్రయత్నం కూడా చేయాలి. గాయత్రీ సాహిత్యాన్నీ, యుగశక్తి గాయత్రి పత్రికను అధ్యయనం చేయడం, బోధించడం కూడా సాధనలో విడదీయరాని అంగం.

సిద్ధాంతాన్ని అవగాహన చేసుకొనని వారి ఆచరణ అసంపూర్ణంగా ఉంటుంది. దాని ఫలితం కూడా సందిగ్ధంగానే మిగిలిపోతుంది. కనుక – సగం సగంగా ఉన్న, చెవిటిగా గ్రుడ్డిగా ఉన్న, పాక్షికమైన, అరకొరగా ఉన్న పూజా ప్రక్రియ చాలదు. గాయత్రీ తత్త్వజ్ఞానాన్ని అవగాహన చేసుకోవడం, దాని ప్రేరణను గుండెలో నింపుకోవడం, దానిలోని నిర్దేశాలను నిత్యజీవితంలో ఆచరణ లోనికి తేవడం అవసరం. తమ ఉపాసనా విధానంలో ఈ వాస్తవాలను అమలుచేసిన వ్యక్తుల సాధన ఫలిస్తూ వచ్చింది. అలాంటి సమగ్రసాధనలో నిమగ్నమైన నైష్ఠికులు ఏకగ్రీవంగా తమ అభిప్రాయాన్ని ఇలా వ్యక్తపరచారు – ఎవరి గాయత్రీ సాధనా ఎన్నడు నిష్ఫలం కాదు. గాయత్రీ మాత కొంగును ఆశ్రయించిన వ్యక్తికి శుభం జరిగి తీరుతుంది.

## సాధనకై పవిత్రత, ఆదర్శవాదం

సాధనకు విత్తనం నాటడంతోపాటు అది మొలకెత్తి పెరిగే ఏర్పాటు కూడా చేయాలి. సాధన సాఫల్యానికి ఇది అవసరం. అందుకోసం ఎరువు, నీరు కావాలి. జీవితంలో పవిత్రత ఎరువు. పరమార్థం యొక్క తీక్షణత నీరు. దృక్పథంలో ఉత్కృష్టత కలసి ఉండాలి. ఆచరణలో ఆదర్శవాదం మిళితమై ఉండాలి. స్వార్థాన్ని పరిమితం చేసే ప్రేరణ, పరమార్థ పరాయణత్వాన్ని పెంచే ప్రేరణ ఆదర్శవాదంలో ఉంది.

నీతి నియమాల పాలనకు ఆహార విహారాలలో సంయమనం అవసరం. అలాగే – ఉదారమైన పరమార్థ పరాయణత్వంతో కూడిన కార్యసరళి జీవనచర్యలో అంతర్భాగం కావాలి.

పరమార్థాన్ని వర్తమాన పరిస్థితులకు అనుగుణంగా నిర్వహించడానికి ఎన్నెన్నో మార్గాలు ఉంటాయి. ఆయా పరిస్థితులను బట్టి రకరకాల కార్యక్రమాలను రూపొందించు కోవచ్చు. అయితే శాశ్వతమైన, ఉన్నతస్థాయికి చెందిన పరమార్థం ఒక్కటే – శ్రేయ మార్గాన్ని అనుసరించాలనే ప్రేరణ. నిజమైన సాధకులు ఇందుకోసం అవకాశాలను వెదకడానికి నిరంతరం ప్రయత్నిస్తూ ఉండాలి.

## భక్తుడు భక్తులను తయారుచేయాలి

ఇష్టదైవానికి సమీపంలో కూర్చోవడం, క్రమంగా ఆ దైవానికి అనుగుణంగా మనల్ని మనం తీర్చిదిద్దుకోవడం – ఇదే ఉపాసన ఉద్దేశ్యం. మంచిగంధపు చెట్టు ప్రక్కన పెరిగిన మామూలు మొక్క కూడా సువాసన ఇస్తుంది. సదాశయాన్ని ఇలా విస్తరించ డమే నిజమైన భగవద్ భక్తి. భగవానుని సామీప్యంలో భక్తునికి వెలుగు లభిస్తుంది. అతడు ఆ వెలుగును విరజిమ్మకుండా ఉండలేడు. తన సంపర్కంలోనికి వచ్చే వారందరికీ అతడు భక్తి మహిమను బోధిస్తాడు. భక్తులుగా మారడానికి వారికి ప్రేరణ ఇస్తూ ఉంటాడు.

సంత్‌లు భక్తులు అసంఖ్యాకులైన వ్యక్తులను తమవంటి వారుగా మార్చారు. వారు తమ కృషిని ఆత్మకళ్యాణానికి పరిమితం చేయలేదు. చిన్న దీపం వెలుగును సంపాదించడంతో తృప్తిపడి ఊరుకోదు. చివరి వరకు వెలుగును విరజిమ్ముతూనే ఉంటుంది. అటువంటప్పుడు – భక్తుడు “స్వ” కే పరిమితమై స్వార్థపరుడనే అపఖ్యాతిని ఎందుకు తెచ్చుకుంటాడు? తాను స్వార్థపరుడు అయ్యాననే ఆత్మనింద ఎందుకు పొందుతాడు? భక్తిని విస్తరించనంతవరకు అతడికి విశ్రాంతి ఉండదు.

నిప్పు దగ్గరగా ఉన్న కర్ర వేడెక్కుతుంది. దగ్గరితనం, సాన్నిహిత్యం పెరిగితే అది కూడా నిప్పుగా మారుతుంది. ఆ

**గాయత్రీ మంత్రానికి దేవత సవిత**

ప్రక్రియ అంతటితో ఆగదు. ఇది తొలి సగం మాత్రమే. కాలుతున్న ఆ కర్ర తన పరిసర స్థలాన్ని వేడి చేస్తుంది. తన దగ్గరకు వచ్చిన దానిని తనవలే మండేటట్లు చేస్తుంది. ఇదే మహత్తర సంప్రదాయం. భక్తులు, సాధకులు ఈ సంప్రదాయాన్ని కొనసాగించాలి.

ఉపాసకులు తమ ఆరాధ్యదైవం యొక్క ఉపాసకులను తయారుచేయాలి. తాము పొందిన దానిని నిల్వ ఉంచుకోకుండా అందరికీ పంచిపెట్టాలి. పిల్లవాడు కాస్త పెరగగానే తల్లికి ఆమె పనులలో కొద్దికొద్దిగా సాయపడతాడు. తమ తల్లితండ్రులు ఇచ్చినదానికి బదులుగా వారికి ఎంతో కొంత తిరిగి ఇవ్వాలని పిల్లలు సైతం అనుకుంటారు. భక్తులకు అలాంటి అభిప్రాయం ఎలా కలగకుండా ఉంటుంది?

## గాయత్రి వెలుగును విస్తరించు

వెలుగును విస్తరించడం ఒక పెద్ద పని. ఉత్పాదనకు వలెనే వితరణకు ప్రాముఖ్యత ఉంది. కర్మాగారాలలో తయారయ్యే వస్తువులు, పొలాలలో పండే పంటలు ఉత్పత్తిదారుల గోదాముల్లో నిల్వ ఉండిపోవు. వాటిని పంపిణీ చేయడానికి కూడ తగు ఏర్పాటు జరగాలి. అలా జరగకపోతే కొత్త ఉత్పత్తుల తయారీ ఆగిపోతుంది. అమ్మకం జరగనందువల్ల గోదాములు నిండిపోతాయి. కొత్త ఉత్పత్తుల తయారీ ఆగిపోతుంది. అమ్మకం జరగనందువల్ల గోదాములు నిండిపోతాయి. కొత్త ఉత్పత్తుల నిల్వకు స్థలం ఉండదు. పెట్టుబడి కదలడం ఆగిపోతే, ముడిసరుకు కొనుగోలుకు డబ్బు మిగలదు. డైనమో తిరుగుతూ ఉంటే బ్యాటరీ పనిచేస్తుంది. సేవా సాధన అండదండలతోనే ఆత్మబలం పెరుగుతుంది; భక్తిభావన బలపడుతుంది. ఈ విషయంలో పిసినారితనం చూపితే – ఆ సంకుచిత స్వార్థం వల్ల లాభం తక్కువ, నష్టం ఎక్కువ కలుగుతుంది.

గాయత్రీ తత్త్వజ్ఞానం మరింత విస్తృతం కావాలి. సామూహిక ఉద్ధరణ, వ్యక్తిగత అభ్యుదయం – ఈ రెండింటి దృష్ట్యా ఇది అత్యవసరం. ఇతరుల చేతులకు గోరింటాకు పెట్టడానికి రుబ్బే చేతులు సునాయసంగా పండుతాయి. ప్రతి సాధకుడు ఆదిశక్తి గాయత్రి వెలుగును విస్తరించే పనిని తన పవిత్ర బాధ్యతగా పరిగణించాలి. సాధనవలెనే ఈ పని కూడా ఫలప్రదం అవుతుందని విశ్వసించాలి. ఈ పనికోసం వచ్చే అవకాశాలను జారవిడుచుకోకూడదు.

★★★

### ఐక్యత

*ఒక రోజున ధనుస్సు తన గురించి బాగా గొప్పలు చెప్పుకోసాగింది. అదేవిధంగా బాణం కూడా అసలు గొప్ప తనమంతా తనదేనంటూ, తన గురించి తాను చాలా ఎక్కువ చెప్పేసుకుంటోంది. ఇది విన్న ఒక పెద్దమనిషి విడివిడిగా ఎంత గొప్పతనమున్నప్పటికీ ఐక్యత అనేది లోపించినప్పుడు అన్నీ వ్యర్థమే. ఏదైనా ఒక ప్రయోజనాన్ని నెరవేర్చాలంటే మీ ఇద్దరు కలిస్తేనే సాధ్యమవుతుంది. విడివిడిగా ఎంత గొప్పలు చెప్పుకొన్నా మీరు చేయగలిగింది ఏమీలేదని ధనస్సుకు, బాణానికి వాటియొక్క వాస్తవిక స్థితిని తెలియజేశాడు. అవి వివేకంతో అహాన్ని వదలి ఐక్యతతో జీవిస్తూ అసాధ్యాలలో కెల్లా అసాధ్యాలను కూడా అవలీలగా సాధించసాగాయి.*

*– ప్రజ్ఞాపురాణం నుండి*

*అనువాదం: శ్రీమతి గౌరీ సావిత్రి*


**దైవీశక్తుల తోడ్పాటుకై**
**కష్ట నష్టముల నివారణకై**
**చేసిన కృషి సత్ఫలితములనిచ్చుటకై**
**జ్ఞానము, సంపదల ఆర్జన కొరకై**
**జీవితంలో స్థిరపడుటకై**

**యుగశక్తి**  **గాయత్రి**

**మాసపత్రిక చదవండి!**
**చదివించండి!!**

**ప్రతుల కొరకై సంప్రదించండి:**
**ఫోన్: 040-23700722, 9949111175**


**గాయత్రి సృష్టినిర్మాణ శక్తి**

గాయత్రీ జయంతి ప్రత్యేకం

# గాయత్రీ-గంగల మహత్తు

ఎండలు తగ్గుముఖం పట్టడంతో పాటు చల్లని చిరుజల్లులు కురవటం చేత శరీరము హాయిగా సేదతీరుతున్నది. గ్రీష్మ ఋతువులో పడుతున్న వానతో భూమి తడుస్తున్నది. సన్నసన్నని జల్లులు పడటంతో ఆ తాపమంతా ఆవిరైపోతున్నది. గాయత్రీ జయంతి రానున్నది. జ్యేష్ఠమాస శుక్లపక్షం నడుస్తున్నది. గ్రీష్మంలో మండుటెండలు స్వాభావికమే కదా! కానీ రెండు మూడు రోజుల క్రితం ఆకాశంలో మబ్బులు కమ్ముకుని చిన్నజల్లు కురవడంతో వాతావరణము ఒక్కసారిగా చల్లబడింది. గురు కటాక్షం కోసం శిష్యుని ప్రాణములు అంతులేనంతగా పరితపించి-అల్లల్లాడి పోతూ చరమదశకు చేరుకున్న స్థితిలో గురుకృప అనే శీతల మేఘము వర్షించి శిష్యుడిని తడిపివేసినట్లుగా భూమి చేసిన తపస్సుకు మెచ్చి ఆకాశము వర్షం రూపములో అభిషేకం చేసి ఆశీర్వదించినదా అని అనిపించినది. ఎలుగెత్తి పిలువనిదే ప్రత్యుత్తరము (జవాబు) రాదు. తపస్సుతో తపించనిదే శాంతిని ప్రసాదించే శీతలత్వము అనుభూతికి అందదు. కఠోరమైన సాధన జరుగకుండా సిద్ధులు హస్తగతమవ్వవు.

“జ్యేష్ఠశుక్ల దశమినాడు రెండు గొప్ప విశేషములు చోటు చేసుకుంటాయి. దశమినాడు గాయత్రీకి చెందిన జ్ఞానచేతన యొక్క అవతరణ అందులో ఒకటైతే- గంగ యొక్క పవిత్రత వర్షించుట రెండవది. ఒకదానితో మానవుడి వ్యక్తిత్వము నిర్మల మవుతుంది. రెండవదానితో ఆచరణ సంస్కరించబడుతుంది. వ్యక్తిత్వము నిర్మలంగా లేకున్నచో నడవడిక లోపభూయిష్టమై పోతుంది. దోషపూరితమైన అంతరంగము తన చుట్టూ ఉన్న వాతావరణమును పాడుచేస్తుంది. సాధనావిహీనమైన మానవ త్వము సాధనా సంపన్నతను పొంది ఉండొచ్చుగాక! కానీ అది సద్గుణముల రాశిగాబోదు. గాయత్రీ తత్త్వజ్ఞానము లేకుండా పావన జ్ఞానగంగా ధారలు వర్షించటానికి ఆటంకములు ఎదురవుతూనే ఉంటాయి. పుణ్యగంగానదీ జలాలు ప్రవహించ కుండా గాయత్రీ యొక్క జ్ఞాన ప్రవాహము అడ్డంకులు లేకుండా ముందుకు సాగలేదు.” పూజ్య గురుదేవుల నోటి నుండి వెలువడిన ఆ మాటలు ఈరోజున ఎందుకో హఠాత్తుగా గుర్తు కొస్తున్నాయి. మనస్సు నిరంతరము గురుదేవుల ఆలోచనలతో తడిసి ముద్ద అవుతున్నది. చల్లనైన సన్నని జల్లుతో శరీరము పులకిస్తున్నది.

అలా ముందుకు నడుస్తూ నడుస్తూ ఉండగా గురువర్యులను కలవాలనే కోరిక కూడా తీవ్రమైనది. నెమ్మదిగా మెట్లెక్కి పైన గురువుగారు ఉన్న గదిలోకి అడుగుపెట్టాను. ఆయన తమ సోఫాలో కూర్చుని వార్తాపత్రిక చదువుతున్నారు. ఈవేళప్పుడు వార్తలు చదవటం నియమబద్ధ దినచర్యలోని ఒక భాగం. గురుదేవుల జీవితములో సహజమైన ఒకానొక లయబద్ధత ఉన్నది. ఒక చక్కని పాట మంచి సంగీత స్వరముతో కూర్చబడి నటుల గురువుగారి దైనందిన జీవిత విధానము సమయమనే దారముతో క్రమపద్ధతిలో పొందికగా గుదిగ్రుచ్చబడి ఉంటుంది. ఆయన నిత్యజీవితములోని అన్ని కార్యక్రమములు నిర్ధారిత సమయములో పూర్తవుతాయి. వార్తలు చదివిన పిమ్మట ఉత్తరప్రత్యుత్తర కార్యక్రమమునకు సమయము కేటాయించబడుతుంది. తలుపు చప్పుడు విన్నమీదట గురువు గారు చేతిలోని వార్తాపత్రికను ప్రక్కనే ఉన్న ఒక చిన్న మేజాబల్ల మీద పెట్టారు. ఫ్యాన్ స్విచ్ ఆన్ చేసి మంచం మీద కూర్చుని నవ్వుతూ యోగక్షేమాలు విచారించి ఆపైన ఉత్తరాలు చదవ టానికి అనుమతిని ఇచ్చారు.

ఒక ఉత్తరము సాధనకు సంబంధించినది. ఉత్తరము చదవటం పూర్తయ్యాక జిజ్ఞాసతో గురుదేవుల వైపు దృష్టి సారించాను. ఉత్తరం ఆసాంతం విన్న తరువాత దానికి వివరణా త్మకంగా ఇచ్చిన తగిన జవాబు ఆ ఉత్తరం వ్రాసిన వ్యక్తికి మరియు ఆతని జీవితమునకు ఎంతో మహత్త్వపూర్ణమైనది. గురుదేవుల ముఖతః వెలువడిన ప్రతి అక్షరమునకు మహా మంత్రములోని ఒక్కొక్క బీజాక్షరము వలే అంతులేని మహిమ ఉంటుంది. ఈరోజు కూడా ఆ మాటలను ఆలకించగలిగే అద్భుత క్షణముల కోసము వేచి ఉన్నాను. అలా నిరీక్షిస్తున్న సమయములోనే గురువుగారు ఇలా అన్నారు. ‘పుత్రా! సాధన యొక్క సారమే గాయత్రి! గాయత్రీమంత్రములో తత్త్వజ్ఞానము మరియు దర్శనశాస్త్రము యొక్క సమస్త సారము ఇమిడి ఉన్నది. అందులోని ప్రతి అక్షరము జాగృత మంత్రబీజము! గాయత్రీసాధన ఆరంభమౌతూనే చక్రాలు-గ్రంథులు-ఉపత్యిక లను ప్రభావితము చేస్తుంది. దీనితో నాడులలోని మాలిన్యము తొలగిపోతుంది. జన్మజన్మాంతరముల నుండి చిత్తములో గూడు కట్టుకుని ఉన్న సంస్కారములు మరియు కర్మరాశికి చెందిన చెడు పొరలు ఒక్కొక్కటిగా విచ్ఛిన్నమైపోతాయి. ఆవరణలు

**గాయత్రీ సాధనతో ఇంటిని తపోవనంగా మార్చుకోవచ్చు**

మెల్లమెల్లగా తెరుచుకుంటాయి. గాయత్రీసాధన ప్రారంభమవు తూనే తేజోపుంజమైన సూర్యదేవుని ఆధ్యాత్మిక చేతన అంతః కరణలో, చిత్తములో అవతరించుట మొదలౌతుంది.'

పరమపూజ్య గురుదేవులు సాధన యొక్క మహత్తును వివరిస్తున్నారు. మనస్సు ఆయన చెప్పిన విషయమును హృదయంగమం చేసుకోవటానికి ప్రయత్నిస్తున్నది. గురువర్యుల నోటి నుండి వచ్చిన ప్రతి అక్షరము అమృతబిందువుల వంటివి. ఆ మాటల వెల్లువ అంతశ్చేతనను ముంచెత్తుతుంది. ఇంతలో అకస్మాత్తుగా మనస్సులో ఒక శంక తలెత్తి అది ప్రశ్న రూపములో నోటి నుండి వెలువడినది. ఆయనను ఇలా ప్రశ్నించాను. 'గురుదేవా! గాయత్రీ శాపవిమోచనము మరియు కీలితము అంటే ఏమిటి? వాటిని వివరించి చెప్పగలరు.' నా సందేహమును విన్న గురువుగారు ఒకింత నవ్వి ఇలా సెలవిచ్చారు. 'గాయత్రీ శపించబడలేదు. కీలితము చెయ్యబడలేదు. ఆ మహామంత్రము జనులను శాపవిముక్తులను గావిస్తుంది. ఉత్కీలితులను చేస్తుంది. (అనగా పీటముడి విప్పుతుంది లేదా తాళం తీస్తుంది) అరే! ఆదిశక్తి జగన్మాత యైన గాయత్రీని శపించగల-కీలితము చెయ్యగల సామర్థ్యము ఎవరికైనా ఉంటుందా!! ప్రజలు తమ దుష్కర్మలు మరియు దుష్ప్రవృత్తుల శాపం నుండి, చిక్కుముళ్ళ నుండి బయటపడతారు. చెడుపనులు చేసేవారికి మరియు దుర్మార్గపు ప్రవృత్తి గల వ్యక్తులకు గాయత్రి ఫలించదు. గాయత్రీ మంత్రము యొక్క మంచి ఫలితాలను, సత్పరిణామములను పొందాలంటే సాధకుడు తాపసి, సంస్కారవంతుడు మరియు సద్గుణాల రాశి అయ్యుండాలి. సాధకుడు తన కుకర్మల శాపం నుండి విమోచనుడవ్వటానికి మరియు తన కుసంస్కారముల యొక్క పీటముళ్ళను విప్పుకుని బంధనముక్తుడవ్వటానికి ఏదైతే చెయ్యబడుతుందో అదే గాయత్రీ శాపవిమోచనము మరియు ఉత్కీలనము.

విషయము అద్భుతమైనది. ఈ దృష్టికోణము పూర్తిగా క్రొత్తది. బహుశః ఇప్పటివరకు ఈవిధముగా ఎవ్వరు ఆలోచించలేదేమో! ఇలాంటి వివరణ ఏ పుస్తకములోను చదివినట్లు లేదు. గురుదేవుల ఈ మాటలు మరియు ఆలోచనలు మనస్సులో అనాయాసముగానే ఎన్నెన్నో కాంతిధారలను ప్రసరింపజేశాయి. ఐనా ఆయన పలుకులను ఆలకిస్తున్న మనస్సు ఇంకా ఏదో వినాలని ఉవ్విళ్ళూరుతున్నది. ఆ ఉత్సకతను ఆపుకోలేక మరో ప్రశ్న వేశాను. 'గురుదేవా! గాయత్రీ అవతరణ మరియు గంగావతరణ జరిగిన శుభతిథి ఒక్కటే కదా! గంగ మరియు గాయత్రీల మధ్య అంతర్గతముగా ఏదైనా సంబంధమున్నదా?' ఈ ప్రశ్నను విన్న గురువర్యులు ఇలా జవాబిచ్చారు. 'కుమారా! గాయత్రి మరియు గంగల మధ్య అంతర్గత సంబంధమున్నది. అది చాలా లోతైనది. మూడు చరణములు గల గాయత్రిని త్రిపదా అంటారు. అదే విధముగా మూడు మార్గములు గల గంగను త్రిపథ అని పిలుస్తారు. త్రిపదా గాయత్రి 'ఇడ-పింగళ-సుషుమ్న' నాడులను శుద్ధిచేస్తుంది. అలాగే గంగ 'స్వర్గము-పాతాళము-భూమి'లను పావనము చేస్తుంది. గాయత్రి ద్వారా సద్గుణము లను అలవరచుకున్న తరువాతనే గంగను పవిత్రముగా ఉంచుకొనగలుతాము.'

ఇలా అంటూ గురువుగారు కొంతసేపు గంభీరమైన ఆలోచనలలో మునిగిపోయారు. కొద్దిపాటి మౌనం తర్వాత 'పుత్రా! 21వ శతాబ్ది ఉజ్జ్వల భవిష్యత్తు యొక్క మార్గము గాఢమైన అంధకారము నుండి ముందుకు సాగుతుంది. మానవుడి అంతఃకరణలోను మరియు ప్రకృతిలోని పర్యా వరణములోను దట్టమైన చీకటి అలముకుంటుంది. సత్యయుగ పునరాగమనమునకు ముందు కలియుగము తన చరమస్థితికి చేరుకుంటుంది. ఎన్నడు జరుగనిది అప్పుడు జరుగుతుంది. గాయత్రీసాధన నిష్ఫలమవుతున్నది అని అనిపిస్తుంది. అదే విధముగా గంగానదిలో కాలుష్యము విపరీతముగా పెరుగు తుంది. గంగానది ఎన్నో చోట్ల ఎండిపోయింది అన్న సమాచారము అంతటా వినవస్తుంది. పరిస్థితులు ఇలా కొనసాగుతున్నప్పుడు త్రిపదా గాయత్రీ మరియు త్రిపథ గంగల మహిమను పునఃస్థాపించటానికి అకస్మాత్తుగా ఒక దైవీప్రవాహము ప్రాదుర్భవిస్తుంది. గాయత్రీ సాధన ఎన్నడు నిష్ఫలము కాబోదు మరియు గంగ యొక్క పవిత్రత ఎన్నడు చెదరిపోదు అని ప్రజలు అనుభూతిచెందుతారు. నియతి లేదా ప్రకృతి ద్వారా మానవుడి సాధన మరియు సంఘర్షణ పరీక్షించబడుతుంది అంతే!' అని సెలవిచ్చారు.

గంగ మరియు గాయత్రిల మహత్తును మళ్ళీ అందరు తెలుసుకుంటారు. దైవీశక్తులు ఉద్భవించి భూమిని స్వర్గముగా మారుస్తాయి. అంతరంగపు లోతులలో దాగి ఉన్న ఈ మాటలు అప్పుడప్పుడు తిరిగి చెవులలో ప్రతిధ్వనిస్తూ ఉంటాయి. ఆ మాటల ప్రేరణతోనే శాంతికుంజ్-హరిద్వార్ 'నిర్మల గంగా అభియాన్' చేపట్టి గంగను శుద్ధి చేసే పనిలో తలమునకలై ఉన్నది. గత కొన్ని సంవత్సరములుగా ఇంటింటికి గాయత్రిని చేర్చుతున్నది. గంగ మరియు గాయత్రిల మహిమ ప్రజలను దైవీమానవులుగా మారుస్తుంది. ఇదే భారతదేశమునకు గల నియతి!!

*- అఖండజ్యోతి, జూన్ 2016*

*అనువాదం: శ్రీమతి లక్ష్మీరాజగోపాలు*

**గాయత్రీ సాధన సమస్త కోరికలు తీరుస్తుంది**

పూజ్య గురుదేవుల అమృతవాణి

# ఆధ్యాత్మిక యొక్క అసలైన సంపదలు-1

*పరమపూజ్య గురుదేవుల ప్రవచనములలో ఒక అద్భుతమైన ప్రత్యేకత ఉంది. అదేమిటంటే వారు అతి తీక్షణమైన అంశమును కూడా ఎంతో తేలికగా సహజముగా, సాధారణమైన భాషలో అందరికీ సులువుగా అర్థమయ్యేవిధముగా వివరిస్తారు. ప్రస్తుత ప్రవచనములో వారు 'సృష్టిలో అత్యంత విలువైన వస్తువులు లేదా పదార్థములు అన్నీ అట్టడుగున ఎంతో లోతుగా నిక్షిప్తం చేయబడి ఉంటాయి' అని చెప్తూ 'సముద్రము పైన ఉప్పునీళ్ళు ఉంటాయి. కానీ లోతుకుపోయిన కొద్దీ చమురు మొదలుకొని మంచిముత్యాల వరకు ఎన్నో విలువైన వస్తువులను మనము పొందగలము. అలాగే మానవ శరీరములో ఉన్న స్థూలశరీరము, సూక్ష్మశరీరములను శ్రమకు, బుద్ధికి ప్రతీకలుగా మనము తెలుసుకొనవచ్చు. ఆ మానవ శరీరములోనే మనిషి యొక్క ఆధ్యాత్మిక ఉన్నతికి ప్రతీకగా భావించబడే అన్నింటికన్నా లోపలిపొర అత్యంత విలువైనది మరొకటున్నది. భగవంతుడు మానవుడి సర్వతోముఖ వికాసము కొరకు అవసరమైన సమస్త సంపదలను ఈ పొరలలోనే దాచి ఉంచాడు. ప్రాచీనకాలములో భారతదేశవాసులు మానవ శరీరములోని ఈ కోణమును వికసింపజేసే ప్రయత్నములను బాగా చేశారు. కాబట్టే భారతదేశం యావత్ ప్రపంచమునకు జగద్గురువు అని పిలువబడింది' అని తమ వాక్కులను సోదాహరణముగా వివరిస్తున్నారు. రండి! వారి అమృతవాణిని మరింతగా హృదయంగమము చేసుకుందాం!*

### విలువైన వస్తువులు దుర్లభమైనవి

ఒక పెద్ద చెక్కపెట్టె... ఆ పెట్టె లోపల లోహపు పెట్టె... దాని లోపల విలువైన బంగారు, వెండి నగలు భద్రపరచి ఉండటము మనము సాధారణముగా చూస్తుంటాము. విలువైన వస్తువులను మూడంచెలలో జాగ్రత్తపరచడము తెలివిగలవాళ్ళు సహజముగా చేసే పని. అలాగే మన అందరికన్నా తెలివికలిగిన భగవంతుడు కూడా విలువైన ప్రతి వస్తువును ప్రకృతిలో ఎంతో జాగ్రత్తగా దాచి ఉంచాడు. తక్కువ వెల కలిగినవాటిని బయటనే ఉంచి అత్యంత అధిక వెల కలిగినవాటిని ఇంకా ఇంకా లోపల భద్రం చేసి ఉంచాడు. మట్టి, ఇసుక, కంకరరాళ్ళు... ఇలాంటివన్నీ భూమి పైపొరలోనే ఉంటాయి. నేలను కొంచెం త్రవ్వితే రాళ్ళు, కంకర కన్నా విలువైన నీళ్ళు దొరుకుతాయి. ప్రాణికోటికి జీవనాధారమైన నీరు పైనుండే మట్టికన్నా విలువైనది కదా! ఇంకా కొంచెం లోపలికి త్రవ్వితే చమురు ఇంకా వాయువు (గ్యాస్), బంగారము, వెండి, ఖనిజాలు



వగైరాలన్నీ ఒకదాని తర్వాత ఒకటి మనిషికి ఉపయోగపడే వస్తుసముదాయములెన్నో ఉన్నాయి. సముద్రం పైపైన ఉప్పునీరు, ఖాళీ ప్రదేశము ఉంటాయి. లోలోపలికి వెళితే మంచిముత్యములు, ఆల్చిప్పలు లభిస్తాయి. అదేవిధముగా మానవ శరీరములో మూడు అరలు అంటే మూడు శరీరములు ఉన్నాయి. విలువైన ఈ మూడు శరీరములను భగవంతుడు ఒకదానిలోపల మరొకటి ఏర్పాటు చేశాడు.

### మానవీయ వ్యక్తిత్వములోని మూడు తలములు

మన లోపల మానవ శరీరము లోపల ఎన్నో పొరలున్నాయి. మనము 'శరీరము' అని పిలుచుకునేది అందులో ఒక పొర. పైకి కనిపించే ఈ శరీరము చర్మంతో తయారైన శరీరము. ఈ శరీరము కష్టపడుతుంది. ఆ కష్టమునకు ప్రతిఫలముగా సాధనోపకరణములను సంపాదించుకుంటుంది. చెమటోడ్చి తనకు కావల్సిన వస్తువులను సమీకరించుకుంటుంది. శారీరిక శ్రమతో వ్యవసాయము చెయ్యవచ్చు, ఇల్లు కట్టవచ్చు, పరిశ్రమలు నడుపవచ్చు. అటువంటి ఈ శరీరము విలువైనదా

**గాయత్రీ మంత్రం వంటి మహామంత్రం ఇంకొకటి లేదు**

అంటే నిస్సందేహముగా విలువైనదే. దీనిని స్థూలశరీరము అంటున్నాము. ఈ స్థూలశరీరము శ్రమ మాత్రమే చెయ్య గలదు. కాబట్టి దీని విలువ కొంచెం తక్కువే!

## ఆలోచనలు, జ్ఞానంతో నిండిన శరీరము - సూక్ష్మశరీరము

స్థూలశరీరము తరువాత మన లోపల ఇంకా విలువైన 'సూక్ష్మశరీరము' అనబడే మరియొక శరీరమున్నది. ఇది ఆలోచనలతో నిండినది, జ్ఞానపూరితమైనది. దీని వెల, విలువ ఎక్కువే కాబట్టి భగవంతుడు దీనిని అందరికీ కనిపించేటట్లు బయటకు పెట్టలేదు. కళ్ళు, చెవులు, నోరు... మున్నగు ఇంద్రియాలన్నీ బయటికే కనిపిస్తాయి. కానీ సూక్ష్మశరీరము ఎవరికీ కనిపించకుండా, ఎవరు తెలుసుకోలేని విధముగా ఎంతో జాగ్రత్తగా భద్రపరచబడి ఉంటుంది. అదే మనిషి 'మెదడు'. ఇది పుర్రె లోపల నిక్షిప్తం చేయబడి ఉంటుంది. చర్మమును పైకి ఒలిస్తే రక్తము వస్తుంది. కానీ మెదడును అసలు బయటకు తియ్యటమే సాధ్యం కాని పని. ప్రపంచములో గొప్పగొప్ప వస్తువులన్నీ మన మెదడు నుండి ఆవిర్భవించినవే కాబట్టి మన సూక్ష్మశరీరము ఎంతో విలువైనదిగా మనం తెలుసు కోవాలి.

విజ్ఞానము, సంగీతము, సాహిత్యము.....ఇంకా ప్రపంచ ములో అత్యంత ప్రశస్తమైనవన్నీ మెదడు నుండి ఉత్పన్నమైనవే. మనిషి మెదడు క్రియాత్మకముగా ఉండక స్తబ్ధుగా ఉండిపోతే ఏమవుతుంది? ఆదిమకాలము నాటి మనిషి అప్పటినుండి ఇప్పటివరకు అలాగే ఉండి ఉండేవాడేమో? అదే జరిగి ఉంటే ఈనాడు పరిస్థితి ఎంత ఇబ్బందికరముగా ఉండేదో అసలు ఊహించలేము కూడా!

కానీ మనిషి తెలివి ఎంతో గొప్పది. ఆ తెలివే గనుక లేకపోతే రైళ్ళు నడిచేవా? న్యాయవాదులు వాదించేవారా? అధ్యాపకులు పాఠములు చెప్పేవారా? వ్యాపారస్థులు ఇంతింత వ్యాపారములు చేసి సంపన్నులయ్యేవారా? శరీర కష్టము చేస్తే మహాయైతే రోజుకు రెండు మూడు వందలు సంపాదిస్తారేమో! కానీ తెలివితేటలతో సంపాదిస్తేనే సంపన్నులు కాగలరు.

## శరీరము కన్నా బుద్ధి ఎంతో విలువైనది

ప్రపంచములో బుద్ధి (తెలివి) చాలా విలువైనది. శరీరము కేవలము శారీరిక శ్రమచెయ్యటానికి మాత్రమే ఉపకరిస్తుంది. కానీ ఆలోచనలతో కూడిన బుద్ధి ఎంతో శక్తివంతమైనది. ఈ రెండు శరీరములు, వాటిలోని తేడా గురించి మీకు అందరికీ తెలుసు. తెలుసు కాబట్టే మీరు మీ శరీరమును అందంగా, ఆరోగ్యంగా ఉంచుకొనటానికి ప్రయత్నిస్తుంటారు. తెలివిని వృద్ధిచేసుకొనటానికి సమయమును, ధనమును కేటాయిస్తుం టారు. శరీరము గురించి అవసరమైనంత దృష్టిని ఉంచు తున్నారు. ఈ విషయమై మనకున్న అవగాహన జంతువులకు ఉండదు. భగవంతుడు ప్రసాదించిన ఈ సంపద, ఈ శారీరిక వ్యవస్థ పట్ల మీరు తగినంత శ్రద్ధ ఉంచుతున్నారు....చాలా సంతోషం!

బుద్ధి యొక్క విలువను గుర్తించారు. అది కూడా సంతోషించదగ్గ అంశము. స్వయముగా మీరు చదువుకొనటమే కాక ఇతరులను చదివిస్తున్నారు కూడా. చదువుకోకపోతే, సంస్కృతిని గురించిన జ్ఞానం లేకపోతే, తెలివితేటలు లేకపోతే, దూరదృష్టి-అవగాహనాశక్తి లేకపోతే... ఇక మీ విలువ చిల్లిగవ్వ కూడా చెయ్యదు. అందుచేతనే ప్రతి వ్యక్తి తమ తెలివితేటలని సానబెట్టుకొనటానికి చెయ్యదగిన ప్రతి ఒక్క ప్రయత్నమును విధిగా ఆచరించాలి. చదువుకొనటము, అనుభవములను సమీకరించుకొనటము, ప్రయోగాలు చెయ్య డము, సత్సంగము... మొదలైన ప్రయత్నాలుగా చెప్పుకొన వచ్చు.

## ఆధ్యాత్మికత-అన్నింటికన్నా అట్టడుగున ఉన్న పొర

చదువు గురించి, తెలివితేటల గురించి తగినంత శ్రద్ధ వహిస్తున్నారు. మంచిదే. కానీ మీ దృష్టి అసలు ఇంతవరకు స్పృశించని మరొక అంశమున్నది. అదే ఆధ్యాత్మికత! దానిని గురించిన జ్ఞానము మీకు కొంచెము కూడా లేదు. దానికోసం మీరు దృష్టిసారించలేరు. శ్రమ చెయ్యలేరు. మెదడును సమ తుల్యము చెయ్యటానికి, దానిని సంతోషముగా, ఆరోగ్యముగా ఉంచుకొనటానికి శ్రమించాలి, ఖర్చుచెయ్యాలి. ఎందుకంటే మీ మెదడు ఏమాత్రము సమతౌల్యమును కోల్పోయినా పరిస్థితి చిందరవందరైపోతుంది. కనుక ఈ రెండింటినీ మించిన మరొక శరీరమున్నది. దాని గురించి మీకు తెలియచెయ్యవలసి ఉన్నది.

మీ లోలోపల మరొక పొర ఉన్నది. అదే 'ఆధ్యాత్మికత!'

**ఆత్మబలాన్ని పెంపొందించే అద్భుత సాధన గాయత్రీ సాధన**

ఇంతకుముందే మనము చెప్పుకున్నాము కదా! చెక్కపెట్టె లోపల అనుసంధానితమై ఉన్న లోహపుపెట్టెలో వేల రూపాయిల విలువైన నగలను మనము భద్రపరచుకున్నట్లు, అన్నింటికన్నా ఎక్కువ విలువైన ఈ ఆధ్యాత్మికత అనే పొరను భగవంతుడు మనలో నిక్షిప్తం చేశాడు. మీరు దీనిపై శ్రద్ధవహించి జాగ్రత్తగా సంబాళించుకున్నట్లైతే మీలో ప్రతివారు ఈనాడు మీరున్న స్థితి కన్నా ఇంకా గొప్పస్థితిలో ఉంటారు. కూలివానికన్నా అక్షరాస్యుడైన తెలివిగలిగిన వ్యక్తి పరిస్థితి ఎప్పుడు గొప్పగానే ఉంటుంది.

## మీ ఆధ్యాత్మిక స్వరూపమును మరింత సానబెట్టి పరిపుష్టం గావించుకోండి

ఆధ్యాత్మికతకు సంబంధించిన ఈ పొరను గురించి మన పూర్వీకులకు బాగా తెలుసు. వారు తమ తెలివితేటలన్నీ, యావత్ జ్ఞానమును 'మానవులలోని ఈ ఆధ్యాత్మిక పొరను ఏవిధముగా శక్తివంతము చెయ్యగలము?' అన్న విషయము మీదనే కేంద్రీకరించి ప్రయత్నించారు. దీనిని మరింత తీక్షణం గావించి దీనికి పరిపుష్టిని చేకూర్చేదెలా? అని ఆలోచించేవారు. వారి ప్రయత్నము సఫలమైనది.

ఈనాడు రైలుబండ్లు ఉన్నాయి. కానీ మన తాతముత్తాతల కాలములో ప్రయాణించటానికి కేవలము ఎద్దుబండి ఉండేది. లేదా గాడిదను ఉపయోగించేవారు. అలా ప్రయాణం చేసి ఢిల్లీ నుండి శాంతికుంజ్ రావటానికి ఒక నెల సమయము పట్టేది. మరి ఇప్పుడో? పొద్దున బయలుదేరి మధ్యాహ్నానికి లేదా సాయంత్రానికల్లా ఇక్కడకు చేరుకోవచ్చు. ఎలా సాధ్య మైంది? మానవుని బుద్ధి వికాసం చేతనేకదా! ఇప్పుడు మన వద్ద ఎన్నో సాధనాసంపత్తులున్నాయి. పది సంవత్సరముల క్రితము మేము చెప్పే మాటలు మీ చుట్టూ కూర్చున్నవారిలో 10,15 మంది మనుష్యులు మాత్రమే వినగలిగేవారు. మరి ఈనాడు మా ముందు పెట్టబడిన మైకు ద్వారా ఒకటి కాదు, రెండు కాదు... 15 లక్షలమంది వినగలిగేటంత సౌలభ్యము అందుబాటులోకొచ్చింది. కాబట్టి మన ప్రాచీనులకన్నా మనము తెలివితేటలపరంగా కానీ, సాధనోపకరణములపరంగా కానీ సంపన్నులమనే చెప్పుకోవాలి. మన పూర్వీకులకు జ్ఞానము, సాధనాసంపత్తి లేకపోయినప్పటికీ వారు ఆధ్యాత్మికముగా గొప్ప సంపన్నులయ్యారు. ఇక్కడ సుఖసంతోషములు, ఆనందము చూసి దేవతలు కూడా ఈర్ష్యపడేవిధముగా వారు ఆధ్యాత్మిక ఉన్నతిని సాధించారు. ఈ నేలమీద నివసించేవారిని దేవ మానవులని పిలవసాగారు.

## దేవత ఎవరు? మానవుడు ఎవరు?

**కళ్ళు, చెవులు, ఇతర ఇంద్రియములు ఉన్నంతమాత్రమున మానవులు కాలేరు. మంచి ఆలోచనలు, ఉన్నతస్థాయి ఆలోచనావిధానము ఉన్నవారినే 'మానవులు' అని చెప్పగలము.** ప్రస్తుతము మీరు నేలమీద, ఇంకా చెప్పాలంటే ఏదో 'కందకం' లోపల కూర్చుని ఆలోచిస్తున్నట్లుగా ఉంటుంది. కానీ **మన ప్రాచీనుల ఆలోచనావిధానమైతే 'విమానం' లో సాగుతున్నట్లుగా ఉండేది.** వారికీ-మనకు ఆలోచనావిధానపు ఔన్నత్యములో అంత తేడా ఉన్నదని మీరు అర్థము చేసుకోవాలి. దేవతలు స్వర్గములో ఉంటారని పెద్దలు అంటుంటారు. స్వర్గం ఎలా ఉంటుందంటే ఆకాశములో పయనించే విమానం లాగా ఉంటుందని అనుకుందాము. **ఒకానొక కాలములో మన ప్రాచీనుల ఆలోచనా శైలి, దృష్టికోణము, జీవనక్రమము... అన్నీ కూడా విమానములో పయనించేవారు ఎంత ఎత్తున ఉంటారో అంత ఉన్నతముగా ఉండేవి. అటువంటి మానవు లనే 'దేవతలు' అని పిలుస్తారు.**

## మానవుడికి ఉన్న అతి పెద్ద సంపద

ఆనాటి మానవులకు సంతోషము, తృప్తి, శాంతి, ఇతరుల పట్ల సోదరభావము ఉండేవి. ఈ భావనలను వారు ప్రపంచము నలుమూలలా వ్యాప్తిచెందించేవారు, పంచి పెట్టేవారు. మన పూర్వీకులు ఆధ్యాత్మికసంపన్నులు. కాబట్టే ప్రపంచ దేశము లలో భారతదేశము 'గ్రేటర్ ఇండియా' అని, 'బృహత్ భారత్' అని కీర్తిగాంచినది. ప్రపంచములోని జనులంతా భారతదేశ వాసుల్ని 'దేవమానవులు' అని కీర్తించేవారు. విదేశీయులు భారతీయ ప్రజలను జగద్గురువులుగా భావిస్తూ వారిని దర్శించ టానికి వస్తుండేవారు. కాబట్టి మనము మన ప్రాచీనుల ఆధ్యాత్మికత పైన దృష్టిసారించి, దానికి వన్నె తెచ్చే విధముగా మన జీవనవిధానమును మలచుకోవాలి. *(సశేషం)*

*- అఖండజ్యోతి, అక్టోబరు 2016*

*అనువాదం: శ్రీమతి కృష్ణకుమారి*

గాయత్రీ మంత్రం ఒక దివ్యజ్ఞానం

నావారితో నా మాట

# తొమ్మిది సంవత్సరాల మాతృశక్తి శ్రద్ధాంజలి నవసృజన మహాపురశ్చరణ



**9 జులై 2017 గురుపౌర్ణమి నుండి 21 జులై 2026 గురుపౌర్ణమి వరకు**

మన విరాట్ గాయత్రీ పరివార్‌ను ఉద్దేశించి ఈ సంవత్సరం ఒక విలక్షణమైన పురుషార్థం విషయమై సూక్ష్మజగత్తు నుండి ఒక ప్రకటన అందింది. 1943 నుండి 1995 వరకు పరమ వందనీయ, శక్తి స్వరూప, స్నేహసలీల, మాతా భగవతీదేవి తమ ఆరాధ్యులైన పరమపూజ్యగురు దేవులు పండిత శ్రీరామశర్మ ఆచార్యులగారితో గాయత్రీ పరివార్ సంరక్షణ కోసం విశేషమైన కృషి చేశారు. 1995లో వారు తమ లీలను ముగించుకుని తన ఆరాధ్యునిలో విలీనమై పోయారు. 1926లో జన్మించిన మన మాతృసత్తా జన్మశతాబ్ది 2026 సెప్టెంబరు, ఆశ్వయుజ కృష్ణ చతుర్థికి రాబోతోంది. దానిని పురస్కరించుకుని వారి పిల్లలమైన మనందరం కలిసి వారి స్మృతిలో ఒక ఆధ్యాత్మిక మహా పురుషార్థాన్ని తొమ్మిది సంవత్సరాల పాటు నిరంతరం చేసి, దాని పూర్ణాహుతిని 2026లో చేసుకోవాలని సంకల్పం తీసుకున్నాం. ఈ యుగ పరివర్తనకారీ మహా అనుష్ఠానం 9 జులై 2017 గురుపౌర్ణమి నుండి మొదలుకుని 29 జులై 2026 గురుపౌర్ణమికి పూర్తవుతుంది. ఇందులో కోట్లమంది పాల్గొనబోతున్నారు.

2026వ సంవత్సరం మొత్తం మూడు ప్రత్యేకతలను సంతరించుకుంది అన్న విషయం అందరికీ గుర్తుండే ఉంటుంది. ఒకటి మాతృసత్తా జన్మశతాబ్ది. రెండవది అఖండజ్యోతి ప్రజ్వలన పూర్తయి నూరు సంవత్సరాలు.(1926 వసంత పంచమి, 20 జనవరినాడు ప్రజ్వలించారు). మూడవది శ్రీ అరవిందుల వారు సిద్ధి దినంగా ప్రకటించిన సంవత్సరం (24 నవంబరు 1926). అప్పటి నుండి 1940 వరకు అఖండ సాధన గురించి ప్రకటించిన సంవత్సరం. మన సాధనాత్మక మహా పురుషార్థం పూర్తయ్యేలోపల ఇప్పుడున్న 12 కోట్ల సాధకులకు అంతకంత మంది కలుస్తారు. నవయుగ-సత్యయుగ ప్రాకాట్యం ఇంకా దగ్గరవుతున్నట్టు కనిపిస్తుంది.

ఈ కాలంలో త్రివిధ సాధనాత్మక ఉపక్రమంలో అందరు యథాశక్తి పాల్గొంటారు. ఉపాసన ప్రధానం, సాధన ప్రధానం, ఆరాధన ప్రధానం. మూడేసి సంవత్సరాలుగా మూడు చరణాలను సిద్ధం చేశారు. మొదటి చరణం గురించి ఈ సంచిక ద్వారా ప్రకటించడం జరుగుతోంది. 2017-2020 వరకు చేసేవాటిలో ఇది మొదటిది. ఆ తరువాత ఇందులో కొన్ని మార్పులతో 2020-2023 వరకు ప్రకటన మూడు సంవత్సరాల తరువాత ఇవ్వబడుతుంది. యువశక్తి, నారీశక్తి మరియు ప్రజ్ఞాపరిజనుల భాగస్వామ్యంతో పూర్తి భారతాన్ని మన ప్రభావ క్షేత్రంలోకి తీసుకోవాలి.

యువశక్తి అంటే, నిరంతరం మన యువక్రాంతి మహావర్షం (2016-18)లో మనతో కలిసిన వారిలో కొత్త యువకులు ఏదైనా సాధిద్దాం అనే ఉత్సాహంతో ఉన్నారు. మార్పు యొక్క ఈ మహాయజ్ఞంలో పాల్గొనాలి అనుకుంటున్నారు. ఇప్పుడు చాలామంది కొత్తవారు నారీశక్తిలో కూడా కలిశారు. ఇన్నాళ్ళు ఇల్లు, వంటలకే పరిమితమైన ఎందరో ఇప్పుడు మహిళామండలి కార్యక్రమాల ద్వారా, బాలసంస్కారశాలలు, స్వాధ్యాయ కార్యక్రమాల ద్వారా కలుస్తున్నారు. వీరిలో చాలామంది ఉన్నత విద్యని అభ్యసించి, గత పది సంవత్సరాలుగా ఈ కార్యక్రమాల్లో అగ్రభూమికను నిర్వహిస్తున్నారు. గాయత్రీ మంత్రదీక్ష తీసుకున్న వారు, మిషన్ కార్యక్రమాలతో ప్రభావితులై మనతో కలిసిన ప్రజ్ఞాపరిజనులు ఎంతోమంది చాలా సంవత్సరాల నుండి మనతో కలిసిపోయారు. రాబోయే మూడు సంవత్సరాల కోసం ఈ మూడు వర్గాలవారికి విడివిడిగా ప్రణాళికలు సిద్ధం చేయబడ్డాయి.

ఇందులో మొదటి చరణం (9 జులై, 2017 గురుపౌర్ణమి నుండి 4 జులై 2020 గురుపౌర్ణమి వరకు) లో నిర్ధారింపబడిన త్రివిధ సాధనాక్రమం -

### 1. ఉపాసన

ప్రతి రోజూ ఉదయం ఆత్మబోధ సాధన అందరు చేస్తారు. సూర్యోదయానికన్నా ముందే నిద్రలేచి 'ప్రతి రోజు క్రొత్త జన్మ' అని గుర్తుంచుకుని క్రొత్త ఆరంభం గురించి ధ్యానం చేయాలి. 5 నుండి 10 నిమిషాలు కేవలం ఈ క్రొత్త జన్మలో చేయవలసిన

**గాయత్రీ సాధనలో సమయ సంయమం అవసరమవుతుంది**

క్రొత్త కార్యక్రమాల గురించి మాత్రమే ఆలోచించాలి. ఏమి చేయాలని నిర్ణయించుకుంటే, వాటి గురించి డైరీలో నోట్ చేసుకోవాలి. రాత్రి పడుకునే ముందు తత్త్వబోధ చేయాలి. ప్రతి రాత్రి కొత్త మృత్యువు అనే సాధన చేయాలి. ఈ పది నిమిషాల్లో వేరే ఏదీ ఆలోచించకుండా, నేడు చేయలేకపోయిన పనులు, రేపు పూర్తి చేయగలిగే పనుల గురించి మాత్రమే ఆలోచించాలి. వాటిని కూడా డైరీలో నోట్ చేసుకోవాలి. పడుకునే ముందు ఇష్టదైవాన్ని తలుచుకుని ప్రశాంతంగా నిద్రపోవాలి.

వీటితో పాటు రోజు స్నానం తరువాత 5 మాలలు గాయత్రి జపం (అరగంట సేపు జపం) లేదా 50సార్లు గాయత్రి మంత్రలేఖనం లేదా 5 సార్లు గాయత్రి చాలీసా పఠనం చేయాలి. వీటిలో వీలైనవి ఏవైనా లేదా అన్నీ సాయంత్రం లోపు ఎప్పుడైనా చేయాలి. వీటితో పాటు 15 నిమిషాల ప్రాణ సంచార ధ్యాన సాధన లేదా మూడు శరీరాల ధ్యానం లేదా పంచకోశజాగరణ ధ్యానం (ఏదైనా ఒకటి) చేయాలి. పరమపూజ్య గురుదేవుల వాణిలో ధ్యానానికి నిర్దేశాలు ఇవ్వబడతాయి. ఈ క్రమం మూడు సంవత్సరాలు నిరంతరం కొనసాగుతుంది. మొదటి చరణంలో ప్రతి సంవత్సరం ఒక లక్ష 82 వేల ఐదు వందల జపం (మూడు సంవత్సరాలకి 5 లక్షల 47 వేల ఐదువందల జపం) ప్రతిసాధకుడు పూర్తి చేస్తాడు. ఇది చాలా పెద్ద సంఖ్య.

## 2. సాధన

ఇందులో సకారాత్మక ఆలోచనల కోసం నిరంతరం ఉత్తమ గ్రంథాలను నియమిత స్వాధ్యాయం చేస్తూ ఉండాలి. ఈ స్వాధ్యాయం పది కన్నా ఎక్కువమంది ఉన్న సమూహాలలో దేశమంతటానే కాక, ప్రపంచమంతా పలుచోట్ల జరుగుతుంది. ఎన్నుకోవలసిన పుస్తకాలు.

1. నేను ఏమిటి? (1940 పరమపూజ్య గురువుగారు), 2. క్రాంతి ధర్మీ సాహిత్యం పుస్తకాలు 25 (1985-1990), 3.ప్రాణశక్తి ఒక దివ్య విభూతి (వాఙ్మయం 18), 4.జీవన దేవత సాధన, ఆరాధన (వాఙ్మయం 2), 5. ఉపాసన-సమర్పణ యోగం (వాఙ్మయం 3), 6. మనిషిలో దైవత్వ ఉదయం (వాఙ్మయం 54), 7. యుగపరివర్తన ఎప్పుడు, ఎలా? (వాఙ్మయం 27).

వ్యక్తిగతంగా అందరు స్వాధ్యాయం చేయవలసినవి - యుగనిర్మాణ సత్సంకల్పాలు; నా అంగ అవయవాలతో, గాయత్రి సూర్యోపాసన; అచేతన, చేతన, సూపర్ చేతన (వాఙ్మయం 22) చమత్కార ప్రత్యేకతల మానవ మెదడు (వాఙ్మయం 18) ఇవన్నీ మూడు సంవత్సరాలు స్వాధ్యాయం చేస్తారు. ఇవన్నీ కాక సాధనా క్రమంలో వారానికొక రోజు ఉపవాసం, చింతన, మనన, వ్రతపాలన, నాలుగు సంయమాల పాలన నిరంతరం అభ్యసిస్తూ ఉంటారు.

## 3. ఆరాధన

ఇందులో యువశక్తి, నారీశక్తి, ప్రజ్ఞాపరిజనులు అందరికీ విడిగా ప్రచారం, సృజన, సంఘర్షణ కోసం నిర్ధారించబడ్డ కార్యాలు.

### యువశక్తి

1. యువశక్తి ద్వారా విద్యాలయాలలో, మహావిద్యాలయాలలో, విశ్వవిద్యాలయాలలో యుగసాహిత్య చర్చా శిబిరాల ఏర్పాటు. గురువుగారి సంపూర్ణ సాహిత్యం నుండి కొన్ని విషయాలు సంగ్రహించి వాటిపై చర్చ కోసం ఏర్పాటు చేస్తారు. అందుకు తగిన కార్యప్రణాళికలు ఏర్పాటు చేయబడతాయి.
2. వైజ్ఞానిక ఆధ్యాత్మికవాదం గురించి బృహత్ సంవాదనల క్రమం కొనసాగుతుంది. విజ్ఞానం, ఆధ్యాత్మికతల సమన్వయం మీద గురువుగారు రచించిన సాహిత్యంలోని అనేక విషయాలపై వర్క్‌షాపులు, కార్యశాలలు ఏర్పాటు చేయబడతాయి. అనేక రంగాలలోని అధ్యాపకులను వీటి సంచాలన కోసం కలుపుకుంటాం. అప్పుడు ఆధ్యాత్మిక విశ్వాసాలకు వైజ్ఞానిక ఆధారం లభిస్తుంది. విజ్ఞాన పరిశోధనలను ఆధ్యాత్మిక సమ్మతంగా చేయడానికి సహాయం అందుతుంది. రెండింటి మధ్య వారధి ఏర్పడితే వాతావరణం మారుతూ కనిపిస్తుంది. రాబోయే సంచిక నుండి ఈ విషయాల గురించి క్రమంగా చెప్పబడుతుంది.
3. ప్రాంతీయ, జిల్లా, మండలస్థాయిల్లో యువ సంగఠనల ఏర్పాట్లకు ప్రయత్నాలు చేయబడతాయి. 2016-18 వరకు జరిగే యువక్రాంతి సంవత్సర కార్య యోజన మరింతగా విస్తరింపబడుతుంది. అన్ని వర్గాల యువత కలిసేందుకు ప్రయత్నాలు చేయబడతాయి.
4. విద్యాలయ స్థాయి విద్యార్థులకు కోచింగ్ క్లాసులు ద్వారా ప్రశిక్షణ దేశమంతటా జరుగుతుంది.
5. ఇంటింటికీ యోగ చేరడానికి యువతకు శిక్షణ ఇవ్వబడు

**గాయత్రీ సాధనలో ఇంద్రియ సంయమం అవసరం**

తుంది. దేవ సంస్కృతి విశ్వవిద్యాలయంలో చదువుకున్న విద్యార్థులు, చదువుతున్నవారు దీనికి సహకరిస్తారు. ఇది కూడా దేశమంతటా జరుగుతుంది. పలుచోట్ల యోగ విజ్ఞానం, యోగచికిత్స, యోగప్రశిక్షణ శిబిరాలు ఏర్పాటు అవుతాయి.

6. యువ సంస్థలు (జిల్లా, మండల, నగరస్థాయిల్లో) సంవత్స రానికి ఐదు రెట్లు పెరగాలన్నది లక్ష్యం. వారం వారం (సాప్తాహిక) మీటింగులు జరుపబడతాయి. అన్ని సంస్థలు నమోదు చేయబడతాయి. రాజకీయాలకు అతీతంగా దేశనిర్మాణ కార్యాలలో వారు పాల్గొంటారు.
7. రచనాత్మక కార్యక్రమాలు నోట్ చేసి మూడు నెలలకు ఒకసారి నివేదికలు తీసుకోబడతాయి.

## నారీశక్తి

1. కన్యల విద్యాలయాలలో, మహావిద్యాలయాలలో యుగ సాహిత్యాన్ని స్థాపిస్తారు, వాటిపై చర్చలు జరుగుతాయి. అన్నింటిలోను యువతులు, మహిళలు పాల్గొంటారు.
2. కన్యా నైపుణ్య శిబిరాలు అన్ని చోట్ల ఏర్పాటు చేయబడ తాయి. వారి ఆత్మవిశ్వాసం పెరుగుతుంది, యంత్రాల పట్ల అవగాహన పెరుగుతుంది, నైపుణ్యంలో బహుముఖ వికాసం కలుగుతుంది.
3. మహిళల యోగశిక్షణ శిబిరాలు పలుచోట్ల ఏర్పాటు చేయ బడతాయి.
4. పౌరుల ఆత్మ రక్షణకై కరాటే, టైక్వాండో వంటి మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ ఇవ్వబడుతుంది.
5. పారిశ్రామిక మహిళా సంగఠనలకు సేవా కార్యాల ప్రణాళి కలు అందివ్వబడతాయి. వీటి సంఖ్య సంవత్సరానికి ఐదు రెట్లు పెరుగుతుంది. అందుకు అవసరమైన ప్రోత్సాహక శిబిరాలు ఏర్పాటు చేయబడతాయి.
6. మహిళలు పాల్గొనగల రచనాత్మక కార్యాలు, మాతా భగవతీ వాత్సల్య ప్రణాళికలు వారికి ఇవ్వబడతాయి. బాలసంస్కారశాలలు కూడా అనేక రెట్లు పెరగాలి. వాటి సంచాలన నారీశక్తి ద్వారానే జరుగుతుంది.
7. సంవేదన, సంస్కారం, భద్రత, స్వావలంబన, సశక్తీకరణ. వీటి ఆధారంగా నారీ జాగరణ వేగం పుంజు కుంటుంది. వీటికి కూడా త్రైమాసిక రిపోర్టు తీసుకోబడు తుంది.

## ప్రజ్ఞాపరిజనులు

వీరు మన సంగఠనకు ఆధారభూతమైనవాళ్ళు. పలుచోట్ల మరింతమంది కలుపుకోబడతారు.

1. యుగనిర్మాణ కార్యాలలో సక్రియంగా ఉంటూ ఈ మూడు సంవత్సరాలల్లో ఐదు రెట్లు వృద్ధి పొందాలన్నది ప్రయత్నం.
2. యుగసాహిత్య ప్రచారం అనేది ముఖ్య లక్ష్యం. వీరి ద్వారా పలుచోట్ల పుస్తక ప్రదర్శనలు జరగాలి. 1995 నుండి ఇప్పటి వరకు ఆలోచనా క్రాంతి గురించి వ్రాసిన సాహిత్యం నుండి, వాఙ్మయాల నుండి విషయాలు సేకరించి, పదివేల కొత్త పుస్తకాలు ప్రచురించబడతాయి. పాకెట్ పుస్తకాల తరహాలో ఉండే వీటిని బాగా విస్తరింపజేయాలి.
3. గ్రామతీర్థాల స్థాపనకు విస్తృత వేగం ఇవ్వబడుతుంది. ప్రతి గ్రామంలో సేవా సంస్థలు ఏర్పాటు చేసే ప్రయత్నం జరుగుతుంది. సామూహిక స్వాధ్యాయం నుండి సర్వాంగీణ స్వచ్ఛత అభియానం మరియు ఇతర అభియానాలకు ప్రోత్సాహం ఇవ్వబడుతుంది.
4. ప్రజ్ఞాపీఠాలు, శక్తిపీఠాలు, చేతనా కేంద్రాలకు 100% సక్రియంగా ఉండే బాధ్యత ఇవ్వబడుతుంది. ప్రతి కేంద్రం అనేక ప్రణాళికలు చేతిలోకి తీసుకుని సక్రియంగా ఉంటుంది.
5. అఖండజ్యోతి, యుగనిర్మాణ యోజన, ప్రజ్ఞా అభియానము, మరియు ప్రాంతీయ భాషల పత్రికల (యుగశక్తి గాయత్రి) పాఠకుల సంఖ్య మూడు రెట్లు పెంచబడుతుంది. పత్రికల వితరణ వ్యవస్థ కూడా మెరుగుపరచబడుతుంది.
6. భారతీయ సంస్కృతి జ్ఞాన పరీక్ష విస్తృతంగా పెంచి కోటిమంది పిల్లలచేత రాయించడం అనే లక్ష్యం 2020 వరకు ఇవ్వబడుతుంది.
7. పరమపూజ్య గురుదేవుల, పరమవందనీయ మాతాజీల ప్రవచనాల ప్రచారం విస్తృతంగా జరుగుతుంది. అప్పుడే వారి అమృతవాణి ఇంటింటికీ చేరుతుంది.

ఈ త్రివిధ ఉపక్రమాల ద్వారా మిషన్ ఎటువంటి కొత్త మలుపు తిరుగుతుంది, ఎలా రూపు మారుతుంది అనేది ఊహించవచ్చు. మూడు సంవత్సరాలు నిరీక్షణ కొనసాగుతూ ఉంటుంది. ఆ తరువాత రాబోయే మూడు సంవత్సరాల ప్రణాళిక అందివ్వబడుతుంది.

*– అఖండజ్యోతి మే 2017*
*అనువాదం: ఎం.వి.ప్రసాద్*

**గాయత్రీ సాధనలో వాక్ సంయమం అనివార్యం**

# అశ్వమేధ మహాయజ్ఞం-జనవరి 2018 (కౌంట్‌డౌన్-7)

## సుప్రసిద్ధ పుణ్యక్షేత్రము, మంగళగిరి పట్టణము, గుంటూరు జిల్లా ఆంధ్రప్రదేశ్‌లో నిర్వహింపబడుచున్నది

దేశాన్ని తద్వారా విశ్వాన్ని ఏకీకరణ ద్వారా బలోపేతం గావించెడి ఒక వైజ్ఞానిక, ఆధ్యాత్మిక ప్రయోగమే గాయత్రీ అశ్వమేధ యజ్ఞము. మేధ అనగా మనస్సులో ధారణ చేయుట అని ఒక అర్థం.

మూడు విధములైన మేధా యజ్ఞముల పరిపూర్ణ కలయికే అశ్వమేధ యజ్ఞము. దీనిలో **ప్రథమ యజ్ఞము నరమేధ యజ్ఞము** – అనగా వ్యక్తిలోని చంచలత్వాన్ని నియంత్రిస్తూ క్రమశిక్షణతో చేపట్టెడి యజ్ఞమే కార్యాచరణే నరమేధ యజ్ఞము.

**ద్వితీయ యజ్ఞము సర్వమేధ యజ్ఞము.** నరమేధ యజ్ఞము ద్వారా సాధించిన క్రమశిక్షణతో, కుటుంబాన్ని, సమాజాన్ని ప్రభావితం గావిస్తూ సామూహికంగా చేసే సర్వమేధ యజ్ఞము.

**తృతీయ యజ్ఞము గోమేధ యజ్ఞము.** ప్రథమ, ద్వితీయ యజ్ఞాల ద్వారా సంప్రాప్తించిన శక్తితో గురువు నిర్దేశించిన మార్గాన్ని అనుసరించుటే గోమేధ యజ్ఞము. దీనిని పలుధార్మిక సంస్థలు వారి వారి రీతులలో అనుసరించుట పరిపాటి. మరోవిధంగా ఇదియే గాయత్రీ మంత్రజపం.

ఈ గాయత్రీ మంత్రజపం ద్వారా లభించే శక్తిని అనగా గోశక్తిని (ఇంద్రియశక్తిని) వాక్‌శక్తిని, మంత్రశక్తిని అశ్వమేధ యజ్ఞంలో ఆహుతులుగా అర్పించి దానిని ప్రపంచమంతటికి అందించుట జరుగుతుంది. గోమేధ యజ్ఞములో మనము వాక్కుతో సూర్యకిరణాలను కూడా ఉపయోగించుకొనుట నేర్చుకోవాలి. ఈ శక్తిని అశ్విక శక్తి అంటారు.

పై రీతిగా క్రమశిక్షణతో సముపార్జించిన వాక్‌శక్తిని, సూర్య కిరణాల ఉపయోగాన్ని, గాయత్రీమంత్ర జపంతో జోడించి సాధక సమూహము అశ్వమేధ యజ్ఞానికి ప్రథమ పంక్తిలో నిలుస్తారు.

దీనిలో ఎవ్వరైనా జాతి, మత, కుల, లింగ, వయో, వర్గ భేదాలు లేకుండా పాల్గొనవచ్చు. ఒక్కొక్క పర్యాయం వాక్‌శక్తి జీవితాన్ని మార్చివేస్తుంది. భారతంలో ధర్మజుని వాక్ శక్తి తన గురువైన ద్రోణాచార్యుని అస్త్ర సన్యాసం చేసేలా చేసింది. యుద్ధగతిని మార్చివేసి పాండవులకు విజయాన్ని చేకూర్చింది.

అదేవిధంగా సూర్యకిరణాలు ప్రాణికోటిని సజీవంగా శక్తి శాలురుగా తయారుచేస్తున్నాయి. పైన ఉదహరించిన రీతిలో నిర్వహించే గాయత్రీ అశ్వమేధ యజ్ఞము ఐదు రకాలైన లక్ష్యాల సాధనకు ఉపయుక్తం అవుతుంది.

**ప్రథమ లక్ష్యము:** ఒకే శక్తి అదే సూర్యశక్తి – అందరు అనుభవించేది. అందరికీ అందుబాటులో ఉన్నది. *"గురుర్బ్రహ్మా గురుర్విష్ణుః గురుర్దేవో మహేశ్వరః గురుసాక్షాత్ పరబ్రహ్మః తస్మైశ్రీ గురవేనమః"* అనెడి ప్రార్థనలో మనము ఏకైక శక్తి అయిన ఆ సూర్యుణ్ణే ప్రార్థిస్తున్నాం. తూర్పున ఉదయించే సూర్యుడు (బాల భానుడు) బ్రహ్మ (సృష్టి). మధ్యాహ్నవేళ ప్రకాశించెడి మధ్య మార్తాండుడు సూర్యుడు విష్ణువు (పాలన చేసేవాడు). సాయంత్రం అస్తమిస్తున్నటువంటి సూర్యుడు "శివుడు" (లయకారుడు) పై చేసే ప్రార్థన మనల అంధకారము నుండి వెలుగు మార్గం వైపు నడిపిస్తుంది. ఈ సూర్యశక్తినే రానున్న రోజులలో మానవజాతి అత్యధికంగా ఉపయోగించుకుంటుంది.

**ద్వితీయ లక్ష్యము:** ఒకే ధర్మము–అదే సూర్యశక్తిని ఉపయోగించుకొనగల్గెడి గుణాన్ని లేక ధర్మాన్ని మనం (మన శరీరం) కలిగి ఉండాలి. ఈ రీతిగా మన దేహాలే దేవాలయాలుగా మారి సమాజానికి ప్రేరణనందించాలి. అనగా దేవత్వాన్ని అందించాలి, హింసను విడనాడాలి.

**తృతీయ లక్ష్యము:** ఒకే భాష అనగా "మౌనము" మనం అభ్యసించాలి. తల్లి తన బిడ్డలోని పెంకితనాన్ని తన మౌనంతో సంస్కరిస్తుంది. అదే రీతిలో మనం మన మౌనశక్తిని పెంపొందించుకోవాలి. తద్వారా అంతర్గతంగా శక్తివంతులం కావాలి. ఇదే మనలోని ప్రేమతత్వాన్ని పెంచుతుంది.

**చతుర్థ లక్ష్యము:** ఒకే వినిమయ ద్రవ్యము (కరెన్సీ) : దీని అర్థము ఒకే ప్రాణశక్తి వినిమయ ద్రవ్యంగా గుర్తింపు పొందాలి. ప్రాణశక్తికి, ధనానికి తేడా లేదు అని ఋషులు ప్రవచించారు.

**పంచమ లక్ష్యం:** ఒకే విశ్వం – పై నాలుగు లక్ష్యాలు నెరవేరగనే పంచమ లక్ష్యమైన "ఎల్లలు లేని, యుద్ధాలు లేని" ప్రపంచం ఒకే విశ్వంగా ఆవిర్భవిస్తుంది.

ఇట్టి విశిష్టమైన విశ్వాన్ని అందుకొనుటకై మన ఋషులు ఈ వైజ్ఞానిక, ఆధ్యాత్మిక ప్రయోగమైన అశ్వమేధ యజ్ఞాన్ని అందించారు.

*మూలం: డా॥ మాస్టర్ ఆర్.కె. ప్రసంగాల నుండి*
*సంకలనం: ఎ. వేణుగోపాలరెడ్డి*

**గాయత్రీ సాధనలో అర్థ సంయమము కావాలి**

# అశ్వమేధ గాయత్రీ మహాయజ్ఞం-జనవరి 2018 శక్తి కలశపూజనం

అశ్వమేధ గాయత్రీ మహాయజ్ఞము 2018 జనవరి 5 నుండి 8 వరకు మంగళగిరి పట్టణము, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రములో జరుపుటకై ఆదరణీయ శ్రద్ధేయ డా॥ ప్రణవ్ పండ్యాగారు మరియు శ్రద్ధేయ శైలబాల పండ్యా దీదీగార్లు అనుమతి ప్రకటించారు.

15 మే మంగళవారము, 2017 తేదీన ఉ॥ 9 గం॥ల ప్రాంతములో శ్రద్ధేయ, డాక్టరు ప్రణవ్ పండ్యా మరియు శైలబాల పండ్యా పుణ్య దంపతుల పవిత్ర హస్తాల మీదుగా శాంతికుంజ్‌నందు అశ్వమేధయాగ శక్తికలశపూజను నిర్వహించారు. ఈ పవిత్ర కార్యనిర్వహణవేళ హాజరైె ఉన్న ఉభయ తెలుగు రాష్ట్రాల గాయత్రీ పరిజనులనుద్దేశించి డా॥ ప్రణవ పండ్యాగారు ఈ విధంగా ప్రసంగించారు.

గాయత్రీ మంత్రోచ్చారణతో వారి ప్రసంగం ప్రారంభమైంది. సూక్ష్మ రూపంలో ఉపస్థితులైయున్న పరమపూజ్య గురుదేవులు–పరమ వందనీయ మాతాజీల సూక్ష్మ సంరక్షణలో విరాజమానమైయున్న మీరంతా ఎంతో సౌభాగ్యశాలురు.

మాకు ప్రియ బంధువులైయున్న మీ ఆదేశానుసారము అశ్వమేధ గాయత్రీ మహాయజ్ఞము 2018 జనవరి 5 నుండి 8 తేదీలలో మంగళగిరి పట్టణములో జరుప నిర్ణయించడమైనది. 7వ తేది ఆదివారం సాయంత్రం దీపయజ్ఞము కూడా చేయ సంకల్పించడమైనది. ఇంతకు పూర్వం దక్షిణ భారతావనిలో తిరుపతి, మధురై, బెంగుళూరు మరియు కన్యాకుమారిలో అశ్వమేధ యజ్ఞాలు జరుపబడినవి. ఇప్పుడు మంగళగిరిలో జరుపబోయే గొప్ప యజ్ఞములో ఉభయ తెలుగు రాష్ట్రాల పరిజనులతోపాటుగా దక్షిణాదిలోని మిగిలిన రాష్ట్రాల పరిజనులు కూడా పాల్గొనెదరు. ఉత్తర భారతావని నుండి పలువురు మంగళగిరి అశ్వమేధ యజ్ఞాన్ని గురించి వివరములు తెలుపమని కోరుచూ మాకు ఫోన్ ద్వారా, ఉత్తరాల ద్వారా అడుగుచున్నారు.

మాననీయ అశ్విని సుబ్బారావు మరియు గౌడ్‌జీల ఉమ్మడి ప్రయత్నంతో మనకు 'మంగళగిరి' పుణ్యస్థలి యజ్ఞవేదికగా లభించింది. యజ్ఞానికి ఇంకా 7 మాసముల వ్యవధి ఉన్నది. ఈ సమయాన్ని సద్వినియోగం చేసికొని మీరంతా ప్రధానంగా ఉభయ తెలుగు రాష్ట్రాలలోని వారంతా విస్తృతంగా ప్రచారాన్ని చేపట్టాలి. గాయత్రిని ఇంటింటా చేర్చేడి బృహత్తర ప్రయత్నం చెయ్యాలి. మీలో ఒక్కొక్కరు 100 మంది కొత్తవారితో సంపర్కం పెట్టుకొని యజ్ఞానికి మీతోపాటు వారంతా వచ్చేలా చూడాలి. ప్రస్తుతం గాయత్రి అవగాహన కలిగి ఉన్న ప్రజల సంఖ్య లక్ష మంది ఉన్నారు. ఈ సంఖ్య పదిలక్షలకు ఈ యజ్ఞ ప్రచారం ద్వారా పెరగాలి. ప్రజలకున్న సమస్యలన్నింటికి గాయత్రి ద్వారా పరిష్కారం లభిస్తుంది. ఈ విశ్వాసాన్ని ప్రజలలో నెలకొల్పాలి. యజ్ఞములో పాల్గొనెడి పరిజనులు అనునిత్యం గాయత్రీ ఉపాసనతోపాటు వారి ఇళ్ళలో బలివైశ్య ప్రక్రియను చేపట్టాలి. ఇది వారి జీవితాలలో ఒక భాగం కావాలి. ఈ యజ్ఞం మరియు బలివైశ్యం ద్వారా సూక్ష్మ జగత్తులోనున్న దేవతలు సంతుష్టులయ్యెదరు. తద్వారా దైవీ వరాలతో జనావళి కోర్కెలు ఈడేరుతాయి. అట్లే ఆహారానికి లోటుండదు.

దంపతులైన స్త్రీ పురుష సంపర్కం ద్వారా వీర్యకణము, అండముతో సంయోగం చెంది ఫలదీకరణం జరిగి నూతన ప్రాణి సృష్టికి దారితీస్తుంది. గర్భస్థ శిశువు ఉచ్చ సంస్కారాలతో జననం పొందుటకై గర్భిణీ స్త్రీ యొక్క మానసిక స్థితి అత్యంత సంతోషంగా, ఉన్నతంగా, దయ, కరుణ, మమతలతో నిండి ఉండేలా చూడవలసి ఉంది. దీనికై గర్భిణీ స్త్రీలకు పుంసవన సంస్కారం జరిపించాలి. అట్లే బిడ్డ జన్మానంతరం, నామకరణం, అన్నప్రాశన, చూడాకర్మ, గురుదీక్ష, వివాహ సంస్కారాలు ప్రతివారికి జరిపించాలి. అందరిని సంస్కారవంతుల గావించాలి. మన బిడ్డలు సంస్కారవంతమైన మహా మానవులుగా ఎదగాలి. జ్ఞానవంతులు, సంస్కారవంతులు కావాలి. ఇదే అశ్వమేధ లక్ష్యం. దీనిలో భాగంగా బాల సంస్కారశాలలు రెండు లక్షలకు పెరగాలి.

అశ్వమేధ యజ్ఞ లక్ష్యం దేశాన్ని విస్తరింపచేయుట అనేది రాజుల కాలం నాటి భావన. నేడు ప్రజాపాలనలో ఉన్నాం. నేటి లక్ష్యం దేశాన్ని బలోపేతం చేయుట. సంస్కారవంతం,

**నవరాత్రులలో చేసే గాయత్రీ అనుష్ఠానములు అద్భుత ఫలితాలను ఇస్తాయి**

సౌభాగ్యవంతం చేయుట. నేడు ఆచరణ ద్వారా మాత్రమే ప్రజలను సంస్కారవంతం చేయగలం, ప్రసంగాలతో చేయజాలం. దీనికి మనకు శక్తి కావాలి. ఈ శక్తినిచ్చే జనరేటరు మనకు గురుదేవుల రూపంలో ఉన్నది. ఇది నిరంతర తరగని శక్తిని ఇస్తూ ఉంటుంది. ఈ జనరేటరుతో మనం అనుసంధానం చేసికోవాలి, శక్తివంతులం కావాలి. శిరిడీలో కొన్ని రోజుల క్రితం 4 వేల కన్యలకు వారి వారి నైపుణ్యాలను మెరుగుపరచు కొనే శిక్షణను ఇచ్చుట జరిగింది.

భారతీయ సంస్కృతికి మూలాలు మూడు – అవి గాయత్రి, యజ్ఞము మరియు సంస్కారాలు. అగ్ని జ్ఞానానికి ప్రతీక. మనము యజ్ఞాగ్నిని ఆరాధిస్తున్నాం. క్రైస్తవులు కొవ్వొత్తిని వెలిగించి ఆరాధిస్తున్నారు. ముస్లిములు ధూపం వేసి, సుగంధాన్ని ఆస్వాదిస్తూ, అగ్నిని ఆరాధిస్తున్నారు. ఈ రీతిగా అన్ని మత విశ్వాసాల వారు అగ్నిని ఆరాధిస్తున్నారు. భూమికి యజ్ఞము నాభివంటిది. గీతాచార్యుడు వివిధ యజ్ఞాలను గీతలో ఉటంకించుట జరిగింది. గీతను చదవండి అశ్వం అనగా వ్యవసాయం అని ఒక అర్థముంది. అశ్వమేధ యజ్ఞా నంతరం వ్యవసాయ దిగుబడులు పెరుగుతాయి. భూమిపై అన్న సంపద పెరుగుతుంది.

మన యజ్ఞానికి రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులను ఆహ్వానించండి. సమయానుకూలంగా మనదేశ ప్రధాన మంత్రిని కూడా ఆహ్వానిద్దాం.

మీ అందరికి శుభకామనలు – స్వస్తి

**ఆదరణీయ శైలబాల పండ్యా దీదీ** ప్రసంగిస్తూ గాయత్రీ ఉపాసన ద్వారా, సూర్యశక్తిని ఆరాధించుట జరుగుతుంది. దీనిని సవితాశక్తి అని కూడా పిలచుట కద్దు. ఆ సవితా శక్తి ఆరాధన ద్వారా మనలోని ప్రతిభాపాటవాలను పెంపొందించు కొని, సద్బుద్ధితో సత్కర్మలను బహు విధాలా వ్యాప్తి చెయ్యాలి. భూమిపై ప్రజల మధ్య ప్రేమ, దయ, కరుణ, మమతల పెంపొందింపజెయ్యాలి. వివిధ ప్రాంతాల నుండి, వివిధ ఆహారపు అలవాట్లను కలిగి ఉన్న మనమంతా గాయత్రీ సాధన ద్వారా, గురుయుగ్మం నీడలో ఒక సామూహికశక్తిగా ఎదిగి రాష్ట్రాన్ని, దేశాన్ని బలోపేతం గావించాలి. భారతీయ సంస్కృతికి పూర్వపు ఔన్నత్యాన్ని చేకూర్చాలి. మాతృశక్తి జాగృతం కావాలి. 21వ శతాబ్ది ఉజ్జ్వల భవిష్యత్తు అనే నినాదం యదార్థం కావాలి.

పూజానంతరం శక్తి కలశాన్ని ఊరేగింపుగా శాంతికుంజ్ లోని ప్రఖర ప్రజ్ఞ – సజల శ్రద్ధల వద్దకు చేర్చి అచ్చట శక్తి స్థలంలో స్థాపించుట జరిపింది.

**అశ్విని సుబ్బారావుగారు,** దక్షిణ భారత ప్రధాన సంచాలకులు, పరిజనులనుద్దేశించి ప్రసంగిస్తూ ఇలా అన్నారు – అశ్వమేధ గాయత్రీ యజ్ఞ మాధ్యమంగా మనమంతా మన పరిజనుల సంఖ్యను పదిరెట్లుగా పెంచుకొని పది లక్షలకు చేర్చాలి. సూక్ష్మజగత్తులో నూతన యుగనిర్మాణ దిశగా మార్పులు సంభవించాయి. ఈ మార్పులు స్థూలజగత్తులో దృగ్గోచరమయ్యేడి సమయం ఆసన్నమైందని పూజ్యగురుదేవులు సెలవిచ్చి ఉన్నారు. అట్లే వినాశకరమైన మూడవ ప్రపంచ యుద్ధాన్ని నిలువరించానని పూజ్యగురుదేవులు ప్రకటించి ఉన్నారు. అన్ని రంగాలలో కాలుష్య నివారణ చర్యలు ప్రారంభ మయ్యాయి. ఈ అశ్వమేధ గాయత్రీ మహాయజ్ఞానికి మిమ్ములను హృదయపూర్వకంగా ఆహ్వానిస్తున్నాం.

**డా॥ బ్రిజ్‌మోహన్ గౌడ్ జీ,** శాంతికుంజ్ ప్రసంగిస్తూ విశ్వశాంతికై నూతన యుగ నిర్మాణానికై, అఖిల విశ్వగాయత్రి పరివార్ శాంతికుంజ్ సారథ్యంలో ఒక విశాల ఆధ్యాత్మిక వైజ్ఞానిక ప్రయోగాన్ని అశ్వమేధ గాయత్రి మహాయజ్ఞము మాధ్యమంగా చేపట్టింది. దీనిలో దేశంలోని కళాకారులు, రాజనీతిజ్ఞులు, కవులు, శాస్త్రవేత్తలు, పత్రికా సంపాదకులు భాగస్వాములు కానున్నారు. వీరందరి మాధ్యమంగా ప్రజల ఆలోచనలలో క్రాంతి ప్రవేశించి, సదాలోచనలు సత్కర్మల వ్యాప్తి జెంది నూతన యుగనిర్మాణం జరిగి భూమిపై స్వర్గావతరణకు దారితీస్తుంది. సుఖశాంతులతో ఆనందంతో ఈ భూమి స్వర్గంగా మారుతుంది.

ఈ యజ్ఞానికి అందరికీ ఆహ్వానం.

## గాయత్రీ జపం నుండి పరాధ్వని

*గాయత్రీ మహామంత్ర జపం నుండి జనించే పరాధ్వని వాతావరణమంతటిలోని పరమాణువులను కంపించి జేసే శక్తితో నిండి ఉంది. ఈ జపం వల్ల సాధకునిలో అద్భుతమైన చేతనా శక్తి జనిస్తుంది. ఆ శక్తి అతడి శరీరంలో, మనస్సులో అద్భుతమైన సంచలనాన్ని సృష్టిస్తుంది; అనంత ఆకాశంలో వ్యాపించి, విశిష్ట వ్యక్తులను, విశేష పరిస్థితులను, వాతావరణం మొత్తాన్నీ ప్రభావితం చేస్తుంది.*

**గాయత్రీ మాత కొంగును ఆశ్రయించిన వ్యక్తికి ఏ కొరత ఉండదు**

# ఉభయ తెలుగు రాష్ట్రాలలో జరిగిన వివిధ కార్యక్రమాలు

## ఖమ్మం జిల్లాలో

2016–17 సంవత్సరానికి సంబంధించిన భారతీయ సంస్కృతి జ్ఞానపరీక్ష ఖమ్మం జిల్లాలో శ్రీ ఎన్.బి.కె.చౌదరిగారు గాయత్రీ పరివార్‌గారి సారథ్యంలో నిర్వహించారు. దీనికి సంబంధించిన బహుమతి ప్రదానోత్సవాన్ని ఖమ్మం పట్టణంలో 14 ఏప్రిల్ 2017న నిర్వహించారు.

సభా కార్యక్రమాన్ని ప్రారంభిస్తూ తొలుత శ్రీ చౌదరి ప్రసంగిస్తూ గత నాలుగు సంవత్సరాల నుండి దాదాపు ఎనిమిది వేల పై చిలుకు విద్యార్థిని విద్యార్థులు ఖమ్మం జిల్లాలో ఈ పరీక్షను వ్రాశారని తెలియజేశారు. బాల బాలికల తల్లిదండ్రులకు ఈ పరీక్ష విశిష్టతను తెలుపుతూ, భారతీయ సంస్కృతి జ్ఞానపరీక్ష ద్వారా బాలబాలికలలో మనదేశ సంస్కృతి సంస్కారాల పట్ల ఉత్సాహాన్ని రేకెత్తించుతూ, అవగాహనను పెంచుటకు కృషి చేయుట అత్యంత ముదావహం.

సభలో శ్రీ నరసింహారావుగారు, విశ్రాంత ప్రిన్సిపాల్‌గారు మాట్లాడుతూ భారతీయ సంస్కృతి మూలాలు అత్యంత ప్రభావంతో కూడినవని, జాతి నిర్మాణంలో ఎంతో విశిష్టతను సంతరించుకొని ఉన్నాయని, వీనిని మనం సర్వదా కాపాడు కొనవలసి ఉందని ఉద్భోదించారు.

శ్రీ శర్మగారు విశ్రాంత ప్రధానోపాధ్యాయులు మరియు ప్రధానోపాధ్యాయుల సంఘు అధ్యక్షులు మాట్లాడుతూ భారతీయ సంస్కృతి విలువల విశిష్టతను భావిపౌరులకు అందించుటలో విశేష కృషి చేయుచున్న గాయత్రీ పరివార్ కృషిని అభినందించారు.

తిరుమలాపాలెం, మండల విద్యాశాఖాధికారి మాట్లాడుతూ విద్యార్థిని విద్యార్థులకు కావలసిన సంస్కృతి సంస్కారాలను అందించుటకై గాయత్రీ పరివార్ ఖమ్మం శాఖ చేయుచున్న కృషిని కొనియాడారు.

వందన సమర్పణ, బహుమతి ప్రదానంతో ఆనాటి సభ ముగిసింది.

## మంగళగిరిలో

శ్రీమతి మరియు శ్రీ పేర్ల కుసుమకుమారిదేవి – వెంకటేశ్వర్లు దంపతుల 43వ వివాహదిన వార్షికోత్సవము 4 మే 2018 గురువారమునాడు ఎన్.ఆర్.ఐ. వైద్యకళాశాల, మంగళగిరి లోని గౌతమి మహర్షి పర్ణశాలలో జరిగింది. దీనిని గాయత్రీ పరివార్ సభ్యులు, పరమపూజ్య గురుదేవులు పండిత శ్రీరామ శర్మ సూచించిన రీతిలో వివాహదిన సంస్కారాన్ని చక్కగా నిర్వహించారు. గృహస్థజీవన విశిష్టతను తెలియజేస్తూ స్త్రీ పురుషులు వివాహ బంధముతో ఒక్కటై రెండు శరీరాలు ఒకే ఆత్మగా జీవించుటలోని భారతీయ సంస్కృతి విశిష్టతను తెలుపుతూ శ్రీయుతులు బి.ఎల్.ఎన్.మూర్తి– శారదా దంపతులు (ఎర్రబాలెం) ఈ కార్యక్రమాన్ని చక్కగా నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో శ్రీ తాతారావు, శ్రీ కె.శర్మగారు, నరసింహారావు, భిక్షారావు, ప్రసాద్, రాము, గోపాలకృష్ణమూర్తి, బాలాజీగుప్త, భోజనపల్లి ప్రసాద్, సాంబశివరావు, కృష్ణప్రసాద్, నరేంద్రరెడ్డి, శ్రీమతి కనకదుర్గ ప్రభృతులు పాల్గొని దంపతులను ఆశీర్వదించారు.

## చీరాలలో 108 కుండముల గాయత్రీ మహాయజ్ఞము

2017 జూన్ 17,18 మరియు 19 తేదీలలో 108 కుండముల గాయత్రీ మహాయజ్ఞము ఆంధ్రప్రదేశ్, ప్రకాశం జిల్లా, చీరాల పట్టణములోని ఎన్.ఆర్ & పి.ఎమ్. ఉన్నత పాఠశాల (హైస్కూలు) ఆవరణలో అఖిల విశ్వగాయత్రీ పరివార్ శాంతికుంజ్ వారి మార్గదర్శనంలో, గాయత్రీపరివార్ చీరాలశాఖ వారి సారథ్యంలో నిర్వహింపబడుచున్నది.

17న సా॥ 3 గం॥లకు కలశయాత్ర; 18న ఉ॥ 6.30 గం॥లకు దేవపూజనము & యజ్ఞము, వివిధ సంస్కారముల నిర్వహణ, మ॥ 1 గం॥కు భోజన ప్రసాద వితరణ, సా॥ 6 గం॥లకు యువసమ్మేళనం, 1,116 దీపాలతో గాయత్రీ దీపయజ్ఞము; 19న ఉ॥ 6.30 గం॥లకు పూర్ణాహుతి.

**గాయత్రి అనౌచిత్యాన్ని చీల్చిచెండాడే వజ్రాయుధం**